fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 65 | విజయవాడ, బుధవారం 7 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

విద్యా హక్కు అమలు చేయరేం?

ఏపి, తెలంగాణ రాష్ట్రాలకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్

పేద విద్యార్థులకు కూడా ప్రైవేటు పాఠశాలల్లో విద్య అందించాలన్న ప్రధాన లక్ష్యంతో రూపొందించిన విద్యా హక్కు చట్ట నిబంధనను తెలంగాణ, ఎపిల్లో అమలు పర్చకపోవడంపై హైకోర్టు మండిపడింది. చట్టాన్ని ఎందుకు అమలు చేయలేకపోయారో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ రెండు ప్రభుత్వాలకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం అమలు చేయడం లేదని న్యాయశాస్త్ర విద్యార్థి తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ విచారించింది. ఈ చట్టం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మిగతా 9లో

ఎపికి 9.30 టిఎంసిలు

మార్చి కోసం కృష్ణా జలాల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్

మార్చి నెల తాగు, సాగునీటి అవసరాల కోసం తెలంగాణకు 24.46, ఎపికి 9.30 టిఎంసిల నీటిని కేటాయిస్తూ కృష్ణా బోర్డు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నీటి కేటాయింపుల కోసం ఈనెల 2న సమావేశమైన బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు బోర్డు కార్యదర్శి ఎ.పరమేశం తెలిపారు. గతంలో కుదిరిన ఒప్పందం మేరకు 2017–18 నీటి సంవత్సరానికి 66:34 నిష్పత్తిలో ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేసినట్టు ఆయన రెండు రాష్ట్రాలకూ పంపిన ఒక లేఖలో పేర్కొన్నారు.

హోదా ఇవ్వలేం..!

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం?

రాయితీలూ కుదరవు

సైన్యం నిధులూ అడుగుతారంటూ వ్యాఖ్యలు


ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ప్రత్యేకహోదా కోసం పెద్ద ఎత్తున జరుగుతున్న ఆందోళనలను కేంద్రం బేఖాతరు చేస్తోందా? రాష్ట్ర ప్రజలకు మొండి చేయి చూపడానికే నిర్ణయించుకుందా? తాజా సంకేతాలు ఇవే అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. 'ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదు' అన్న సమాచారం కేంద్ర ఆర్థిక శాఖ అత్యున్నత స్థాయి వర్గాల నుండి మంగళవారం సాయంత్రం మీడియా ప్రతినిధులకు అందింది. 'హోదా ఇవ్వడం సాధ్యం కాదు. గతంలో ప్రకటించిన ప్యాకేజిని అమలు చేయడమే మేలు' అని కూడా ఈ వర్గాలు తెలిపాయి. ప్యాకేజి మినహా ఇతర రాయితీలు ఇవ్వడం కూడా కష్టమని కూడా ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. ప్యాకేజి ఒక్కటీ అమలు చేసి, మిగిలిన హామీలు అమలు చేయడం సాధ్యం కాదని ప్రకటించాలని ఆర్థిక శాఖ కేంద్రానికి సిఫార్సు చేసినట్లు సమాచారం. కేంద్ర సర్కారు అంగీకారం లేకుండా ఇటువంటి కీలకమైన సమాచారాన్ని, అందులోనూ పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతుండగా, పార్లమెంటు సమావేశాలు కొనసాగుతుండగా ఆర్థిక శాఖ నుండి వెల్లడి కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ దిశలో ఇప్పటికే నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఒక వ్యూహం ప్రకారం అనధికారికంగా సమాచారాన్ని లీక్ చేయించిందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడేమీ యుద్ధాలు జరగడంలేదు కదా.. రక్షణ శాఖకు అన్ని నిధులు ఎందుకు, అవి కూడా కేటాయించాలని అడుగుతారన్న వ్యాఖ్యలు ఆర్థిక శాఖ అధికారుల నుండి వినవస్తున్నాయి. ఎఫ్ఆర్‌డిఐ బిల్లుతో పాటు, గతంలో మరికొన్ని మిగతా 9లో


నిరసనలకు సిపిఎం, సిపిఐ పిలుపు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యపడదంటూ కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించడాన్ని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ప్రత్యేక హోదాపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఇరు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు పి మధు, కె రామకృష్ణ ఉమ్మడిగా మంగళవారం ఒక ప్రకటన ద్వారా కోరారు. ప్రజల సెంటిమెంట్ ఆధారంగా ప్రత్యేక హోదా ఇవ్వబోమని, ప్యాకేజికి మాత్రమే కట్టుబడి ఉన్నామని ప్రకటించడం ఆంధ్రా ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు భవిష్యత్‌లో ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఉండదని చెప్పి, ప్యాకేజీ ప్రకటనతో సరిపెట్టిందని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు మాదిరిగా రాయితీలు ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం సాధ్యం కాదని ఆర్థిక శాఖ స్పష్టం చేయడం, కేంద్ర పక్షపాత ధోరణితో వ్యవహరించడమేనని విమర్శించారు. సైన్యానికి కేటాయించిన నిధులు కూడా అడుగుతారని వ్యాఖ్యానించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరుతుంటే, సెంటిమెంట్ ఆధారంగా ప్రత్యేక హోదా ఇవ్వలేమని చెప్పడం రాష్ట్ర ప్రజలను దగా చేయడమేనని పేర్కొన్నారు. రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని కోరారు.











హోరెత్తిన హస్తిన

నినాదాలతో దద్దరిల్లిన దేశ రాజధాని



ప్రత్యేక హోదా కోసం న్యూఢిల్లీలో ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, ఇన్‌సెట్లో ప్రసంగిస్తున్న బివి రాఘవులు

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ధర్నా

చంద్రబాబువి పిల్లిమొగ్గలు : బివి రాఘవులు విమర్శ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ప్రత్యేకహోదా కోసం వెల్లువెత్తిన నినాదాలతో హస్తిన హోరెత్తింది. ఏపికి న్యాయం చేయాలని, ప్రజానాట్య మండలి కళాకారులు గీతాలతో జోరు, డివైఎఫ్ఐ నేతలు అర్ధనగ్న ప్రదర్శన, ప్రజా సంఘాల కార్యకర్తలు మాక్ ఉరి, హోదా సాధించేంతవరకు విశ్రమించేది లేదంటూ సాగిన నేతల ప్రసంగాలు... ఇవీ మంగళవారం పార్లమెంట్ స్ట్రీట్‌లోని సంసద్ మార్గ్‌లో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో కనిపించిన దృశ్యాలు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజానీకం పెద్దఎత్తున ఈ ఆందోళనలో భాగస్వామ్యమైంది. ప్రత్యేకహోదా భిక్ష క్షాదు... ఆంధ్రుల హక్కు అంటూ నినదించింది. "ప్యాకేజీ వద్దు.. ప్రత్యేక హోదా ముద్దు, టిడిపి, బిజెపి నాటకాలు ఆపండి, హోదా మిగతా 9లో

అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా : రాహుల్

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో



2019లో అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పార్లమెంటు స్ట్రీట్‌లో కాంగ్రెస్ మిగతా 9లో

తెగతెంపులకే మొగ్గు

టిడిఎల్‌పి సమావేశంలో దోస్తీని వ్యతిరేకించిన 95 శాతం ఎమ్మెల్యేలు

అభిప్రాయాలు సేకరించిన చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపితో దోస్తీపై టిడిపి ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వెంటనే తెగతెంపులు చేసుకోవాలని, దీనిపై అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని 95 శాతం మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన టిడిఎల్‌పి సమావేశంలో బిజెపి అనుసరిస్తున్న వైఖరిపై మాట్లాడిన అనంతరం ముఖ్యమంత్రి ఆ పార్టీతో భవిష్యత్ ఎలా ఉండాలనే అంశంపై అందరి అభిప్రాయాలూ అడిగారు. ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఇక ముందు ఏం చేస్తే బాగుంటుందో చెప్పాలని ప్రశ్నించారు. బిజెపితో తాడోపేడో తేల్చుకోవాల్సిందేనని అంతా ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రంతో చర్చల్లో సానుకూలత లేకపోవడంతో బిజెపితో విడిపోవడమే మేలనే అభిప్రాయానికి తెలుగుదేశం నాయకులు వచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఎపికి ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీలపై కేంద్రంతో జరిగిన చర్చలు సానుకూలంగా జరగలేదని స్పష్టం చేశారు. విభజన సమయంలో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎపికి ప్రత్యేక హోదాతో పాటు అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ రోజు మిగతా 9లో

హోదాపై మిత్రుల వాగ్యుద్ధం

రూ.3వేల కోట్లే వస్తాయని అనలేదు : సిఎం

టిడిపి తప్పుడు ప్రచారం : బిజెపి ఎమ్మెల్యే

2

విద్యుత్ కార్మికుల సమ్మె విరమణ

ఐక్య వేదికతో యాజమాన్యం చర్చలు

9న కార్మికుల డిమాండ్లపై ఇరు వర్గాల సమావేశం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించడంతో ఎపి విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక నాయకులు 15 రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. సిఎం చంద్రబాబునాయుడు, ఆ శాఖ మంత్రి కళా వెంకట్రావు ఆదేశాలతో ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్, జెఎండి దినేష్ పరుచూరి మిగతా 9లో

> "ఐక్య వేదిక నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. 9వ తేదీన జరిగే చర్చల్లో సమస్యను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీని ఇచ్చింది. దీన్ని నిలబెట్టుకుంటేనే గౌరవం ఉంటుంది, కార్మికుల్లోను, నమ్మకం ఏర్పడుతుంది. సమస్యలను పరిష్కరించాలని సిఐటియుగా విజ్ఞప్తి చేస్తున్నాం."
>
> ఎం.ఎ గఫూర్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



దీక్ష విరమిస్తున్న విద్యుత్ కార్మికులు



3 రోజుల్లో..

దాడుల్లో గాయపడిన వారు	: 514
ఆహుతైన ఇళ్లు	: 196
ధ్వంసమైన సిపిఎం ఆఫీసులు	: 134

త్రిపురలో సంఘ్‌పరివార్ హింసాకాండను నిరసిస్తూ కోల్‌కతాలో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, బృందాకరత్, బిమన్‌బసు, సూర్యకాంత మిశ్రా, ఎంఎ బేబి ప్రభృతులు

త్రిపురలో బిజెపి హింసాకాండపై

జోక్యం చేసుకోండి

ప్రధానమంత్రి మోడీకి సిపిఎం వినతి

8

గుంటూరులో డయేరియా

విజృంభణ

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

జిజిహెచ్‌లో వంద మందికి పైగా చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి– గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో డయేరియా మృతుల సంఖ్య మంగళవారానికి నాలుగుకు చేరింది. ఇటీవల తాగునీరు కలుషితం కావడంతో వాంతులు, విరోచనాలతో దాదాపు 100 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. వీరందరూ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి, పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం సాయంత్రం ఒక మహిళ మృతి చెందగా.. మంగళవారం మరో ముగ్గురు మృతి చెందారు. తొలుత ఫుడ్ పాయిజన్ అయిందని చెప్పి పలాయనవాదం అవలంభించిన కార్పొరేషన్ అధికారులు బాధితులు రోజు మిగతా 9లో



గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ కోన శశిధర్, కమిషనర్ అనురాధ తదితరులు

ఎపిఎస్ ఆర్టీసి ఇ-వాలెట్ సౌకర్యం పున: ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దూర ప్రాంత సర్వీసులకు అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుగా రూపొందించిన ఎపిఎస్ ఆర్టీసి ఇ-వాలెట్‌ను మరిన్ని ఫీచర్లతో ఈ నెల 8 నుంచి పున: ప్రారంభించనునట్లు ఆర్టీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) జయరావు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఇ-వాలెట్ ఖాతాను జీరో బ్యాలెన్స్‌తో తెరుచుకోవచ్చని, ఇ-వాలెట్ ద్వారా టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయిన తరువాత ఐదు శాతం క్యాష్ బ్యాక్ పొందవచ్చని తెలిపారు. ఇ-వాలెట్ ఖాతాదారులు బుక్ చేసుకున్న టికెట్లును రద్దు చేసుకున్నప్పుడు తిరిగి వాపసు పొందే మొత్తాన్ని ఆ క్షణంలోనే పొందవచ్చని, ఒక వాలెట్ నుంచి మరో ఖాతాలోకి ఎలాంటి రుసు ము లేకుండా బదిలీ చేసుకోవచ్చని వివరించారు.

నంది నాటకోత్సవం గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'అర్థం పరమార్థం' నాటికలో ఒక రసవత్తర దృశ్యం



కళామతల్లికి కంఠహారంలా నంది నాటకాలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు)

నంది నాటకోత్సవాలు కళామతల్లికి కంఠహారంలా కొనసాగుతున్నాయి. గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్న నంది నాటకోత్సవాల్లో మంగళవారం ఐదు నాటికలను ప్రదర్శించారు. ప్రద్యున్ ఆర్ట్స్ క్రియేషన్ విజయవాడ వారి అప్పలాచార్య రచనకు ఎస్.శివాజీ దర్శకత్వంలో 'తులసితీర్థం' హాస్య నాటికలో కులాలు, మతాలు కావు మంచితనం, మానవత్వం ఒక్కటే జీవితాన్ని ముందుకు నడిపిస్తుందని హాస్య చలోక్తులతో నాటిక కొనసాగింది. మోక్షరాగ్ని థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారి పవన్‌కుమార్ రచనకు ఇవి.సాగర్ దర్శకత్వంలో 'భార్య, భర్త' నాటికను ప్రదర్శించారు. జనశ్రేణి విజయవాడ వారి ఎల్లాప్రగడ భాస్కరరావు రచనకు వైఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో 'గుర్తు తెలియని శవం' నాటికను ప్రదర్శించారు. శ్రీశివరామకృష్ణ కళాకారుల అనన్య సమాఖ్య విజయవాడ వారు శేషపవన్‌కుమార్ రచనా దర్శకత్వంలో 'అర్థం పరమార్థం' నాటికను ప్రదర్శించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ థియేటర్ కొల్లిపర వారి ఎస్.వెంకటరత్నం రచనా దర్శకత్వంలో 'స్వచ్ఛ సర్వేక్షన్' నాటికను ప్రదర్శించారు.

నేటి కాలంలో వృక్షాలను సంరక్షించాల్సిన ఆవశ్యకతను ఆలోచింపచేసింది ఈ నాటిక. స్వచ్ఛ సర్వేక్షన్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన బాధ్యతను వివరించింది. సీనియర్ కళాకారులు పెద్దిటి యెహాను, పంతుల జయవాని, కాంథేటి నాగేశ్వరరావు, ఉప్పాల శ్రీనివాసరావు, పల్లా యలమందేశ్వరరావు, బొద్దుల చిరంజీవిలను బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, గోగినేని కేశవరావును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

రాజ్యసభకు 'బీద'

బీసీ కోటాలో రేస్‌లోకి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీకి కచ్చితంగా దక్కే రెండు స్థానాల్లో ఒక దానికి నెల్లూరు జిల్లాకు చెందిన పార్టీ నాయకుడు బీద మస్తాన్‌రావు పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. రెండవ సీటుపై మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ (జెపి)ను రాజ్యసభకు పంపే విషయంపై ఇంకా చర్చలు కొలిక్కి రాలేదని టిడిపి వర్గాలు వెల్లడించాయి. జెపి వైపు మొగ్గు చూపుతూనే ఆయన్ని రాజ్యసభకు పంపితే టిడిపిలో, వెలుపల రాజకీయంగా ఒనగూరే లాభ నష్టాలపై ఎడతెగని సమాలోచనలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో రెండవ సీటు విషయంలో మరికొందరి పేర్లను చంద్రబాబు పరిశీలిస్తున్నట్లు సమాచారం. వైసిపి నుంచి 2014లో కాకినాడ లోక్‌సభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయిన చలమలశెట్టి సునీల్ పేరు అకస్మాత్తుగా తెరమీదకొచ్చింది. గ్రీన్‌కో సంస్థ అధిపతి, వ్యాపారవేత్త అయిన సునీల్‌ను టిడిపిలోకి చేర్చుకొని రాజ్యసభ ఇచ్చే విషయంపై చర్చలు సాగుతున్నట్లు అధికారపార్టీ నాయకులు కొందరు పేర్కొంటున్నారు. చలమలశెట్టితో ఇప్పటికే ఒక అవగాహన కుదిరిందని, తుది నిర్ణయం తీసుకోవడంపై సిఎం కసరత్తు చేస్తున్నారని వారంటున్నారు.

రెండో సీటుపై ఎడతెగని చర్చలు

నెల్లూరు జిల్లా కావలి మాజీ ఎమ్మెల్యే, బిఎంఆర్ గ్రూపు అధినేత, బీసీ, యాదవ అయిన మస్తాన్‌రావు రాజ్యసభ రేస్‌లో ముందు వరుసలోకొచ్చారు. మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, అమరనాథరెడ్డి, అఖిలప్రియ, నారాయణ, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు మస్తాన్‌రావుకు రాజ్యసభ ఇవ్వాలని సిఎంను కోరినట్లు తెలిసింది. దీంతో మస్తాన్‌రావు వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అదే సామాజిక తరగతికి చెందిన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు రాజ్యసభ అడుగుతున్నప్పటికీ మస్తాన్‌రావు పట్ల సిఎం అనుకూలంగా ఉన్నట్లు తెలిసింది. ఇక రెండో సీటుపై చంద్రబాబు పలు కోణాల్లో ఆలోచిస్తున్నారు. జెపి, చలమలశెట్టితో పాటు మరికొందరి పేర్లను పరిశీలిస్తున్నారు. ఎస్సీలకు ఇచ్చే విషయంపైనా సమాలోచనలు సాగిస్తున్నారు.

ప్రజ్ఞ

1. ఆస్కార్ 2017 అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా ఎంపికైనది?
2. అస్కార్ అవార్డుల్లో ఉత్తమ నటిగా ఎంపికైనది?
3. ఏ సినిమాకు గానూ గ్యారీ ఓల్డ్‌మ్యాన్‌కు ఉత్తమ నటుడుగా ఎంపికయ్యారు?
4. 'ది షేప్ ఆఫ్ వాటర్' చిత్రానికి ఎన్ని అవార్డులు వచ్చాయి?
5. ఉత్తమ విదేశీ చిత్రంగా అవార్డు గెలుచుకున్న ఎ ఫెంటాస్టిక్ ఉమెన్ ఏ దేశ చిత్రం?

సమాధానాలు 7లో

హోదాపై మిత్రుల వాగ్యుద్ధం

- రూ.3వేల కోట్లే వస్తాయని అనలేదు : సిఎం
- టిడిపి తప్పుడు ప్రచారం: బిజెపి ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదాతో కేవలం మూడు వేల కోట్ల రూపాయలు మాత్రమే వస్తాయని తానెప్పుడూ అనలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరణ ఇచ్చారు. గవర్నర్ ప్రసంగంపై అసెంబ్లీలో మంగళవారం ధన్యవాదాలు తెలిపే సందర్భంగా బిజెపి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ స్వయంగా సిఎం చంద్రబాబునాయుడే హోదాతో రూ.3వేల కోట్లే వస్తాయని చెప్పారనటంతో టిడిపి సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు మిత్రపక్షాల మధ్య వాగ్యుద్ధం సాగింది. బిజెపి ఎమ్మెల్యే వ్యాఖ్యలపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తానేదో చెప్పున్నట్లు చెబుతున్నారని, తానేదీ చెప్పలేదన్నారు. పేపర్లో వచ్చి దానికి తన బాధ్యత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఇలాంటి మాటలు చెప్పి మిస్ లీడ్ చేయడం పద్ధతి కాదన్నారు. తానేమీ ఫేవర్ చేయమని అడగటం లేదని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని కోరామని, అది కేంద్రం బాధ్యతని తెలిపారు. స్వయంగా ప్రధాని ఫోన్‌లో మాట్లాడారని, తాను 29 సార్లు ఢిల్లీ వెళ్లినా ఉపయోగం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చే వెసులుబాటునే తాము అడిగినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా అనేది తెలుగు వారి మనోభావాలు, ఆత్మగౌరవానికి సంబంధించిన విషయని చెప్పారు. మిత్ర పక్షంలో ఉన్నాం కాబట్టే కామ్ ఉన్నామని, లేకుంటే మరింత పోరాటం చేసే వాళ్లమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రం కోసం అంతా కష్టపడాల్సిన సమయంలో అది చేశాం.. ఇది చేశాం.. అని చెప్పుకోవడం భావ్యం కాదని బిజెపి వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాజకీయాలకు అతీతంగా ఈ గడ్డపై పుట్టిన వారు రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటు పడాలన్నారు. ఈ సమయంలో విమర్శించు కోవడం సరికాదని సూచించారు. హక్కుల సాధనలో ముందుండాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏడు ముంపు మండలాలను రాష్ట్రంలో కలిపితేనే తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పానన్నారు. అందుకే రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేశారన్నారు.

టిడిపి తప్పుడు సమాచారం వల్లే ఆందోళనలు

ప్రత్యేక హోదాకు సంబంధించి తెలుగుదేశం పార్టీ ఇస్తున్న తప్పుడు సమాచారంతోనే రాష్ట్రంలో ఆందోళనలు రేకెత్తుతున్నాయని బిజెపి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఆరోపించారు. ప్రజల్లో అపోహలు కలిగిస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా వస్తే అన్నీ వరదలా వచ్చేస్తాయని ప్రచారం చేస్తున్నారన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో హోదా ఉందనేది కేవలం మీడియా ప్రచారమేనన్నారు. ఇప్పటికే వివిధ ప్రాజెక్టుల కింద రూ. 9,750 కోట్లుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. ఇఎపి కింద రూ.38 వేల కోట్లు అంచనాగల ప్రాజెక్టులున్నాయని, వీటిలో 90 శాతం కేంద్రమే భరిస్తుందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఆందోళనల సందర్భంగా మోడీ మాస్క్ ధరించిన వ్యక్తిని మహిళలచే కొట్టించడం ప్రధాని పదవిని కించపరచడమేనని ఆకుల విమర్శించారు.

హోదా ఇస్తామని స్వయంగా ప్రధానే చెప్పారు : అచ్చెన్నాయుడు

ప్రత్యేక హోదాని విభజన చట్టంలో పెట్టారని, ఇస్తామని రాజ్యసభలో స్వయంగా ప్రధాని మోడీయే చెప్పారని మంత్రి అచ్చెంనాయుడు గుర్తు చేశారు. ప్రజల మనోభావాలు అర్థం చేసుకోవాలని, తమకు కొత్తవి ఏవీ అవసరం లేదని అన్నారు. విభజన చట్టం అమలు చేస్తే చాలన్నారు. బిజెపి ఎపి శాఖ నేతలు ఇదే విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఇతర రాష్ట్రాల్లా హోదా ప్రయోజనాలు ఎపికి ఇవ్వాలి: టిడిపి ఎమ్మెల్యేలు

టిడిపి ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ 2017 అనంతరం హోదా లాభాలు కొన్ని రాష్ట్రాలు పొందుతున్నందున రాష్ట్రానికి హోదా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఆర్థిక లోటుకు కేంద్రం కేవలం రూ.3,971 కోట్లు కేటాయించిందని, మిగిలిన మొత్తానికి రూ.12,021 కోట్లుకు ఏడాదికి రూ.960 కోట్లు వడ్డీ భారం పడుతుందన్నారు. బుందేల్‌ఖండ్ తరహాలో అంచనా వేస్తే రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు రూ.24,350 కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకూ రూ.1,050 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు చెప్పారు. ఢిల్లీని మించిన రాజధాని నిర్మిస్తామని చెప్పి, కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. గుజరాత్‌లోని డొలెరా నగరానికి రూ.8 వేల కోట్లు ఇచ్చారని చెప్పారు. పోలవరానికి రాష్ట్రం రూ.7,780 కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం రూ.4,329 కోట్లు మాత్రమే చెల్లించిందని, మిగిలిన మొత్తానికి ఏటా రూ.300 కోట్లు వడ్డీ భారం పడుతుందన్నారు. కేంద్రం కేటాయించిన 11 విద్యాసంస్థలకు రూ.9,654 కోట్లు వ్యయం అవుతుందగా ఈ నాలుగేళ్లలో రూ.4 వేల కోట్లుకు గాను కేవలం రూ.680 కోట్లు మాత్రమే మంజూరు చేసినట్లు చెప్పారు. పింఛన్లకు రూ.5,480 కోట్లు ఖర్చు చేస్తుంటే, కేంద్రం ఇచ్చేది రూ.250 కోట్లు మాత్రమేనన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న కర్ణాటకకు రూ.16 వేల కోట్లు, అహ్మదాబాద్ రైల్వే ప్రాజెక్టుకు రూ.1.20 లక్షల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రతిపక్షనేత అసెంబ్లీకి రాకుండా రోడ్లపై తిరుగుతున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యే వి.ప్రభాకర చౌదరి మాట్లాడుతూ యుపికి ఎన్నికల దృష్టితో రూ.80 వేల కోట్లు కేటాయించిన కేంద్రం ఎపికి ఏమిచ్చారని ప్రశ్నించారు. వైసిపి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతుంటే వారికి తోడుగా బిజెపి కర్నూలు డిక్లరేషన్ పేరుతో రెండవ రాజధాని అంటూ ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. రాజధానికి 35 వేల ఎకరాల భూములు ఎందుకుని ప్రతిపక్షం అంటుందని, లేవవుట్ అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి కేవలం 7 వేల ఎకరాలే ఉంటుందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కాంగ్రెస్‌ను గత ఎన్నికల్లో గణపాఠం చెప్పారని, వైసిపి, బిజెపిలకు ఇదే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రకాశం జిల్లా కదిరి ఎమ్మెల్యే చాంద్‌భాషా తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని చిత్తూరు జిల్లా సత్తివేడు ఎమ్మెల్యే తలారి ఆదిత్య పేర్కొన్నారు.



మీరు తెచ్చింది నీళ్లా? గాడిద పాలా?

బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు విష్ణు, ఆకుల

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

మోడీ ఎపి కోసం నీరు మట్టి తెస్తే మరి చంద్రబాబు అన్ని నదుల నుంచి తెచ్చింది ఏంటి? నీళ్లా? గాడిద పాలా? గవర్నర్ ప్రస్తావించిన అంశాలన్నీ కేంద్రానివే. పథకాలు మావి పేర్లు మీవా? రాష్ట్రంలో ఏం జరుగుతోందో సర్వే చేయించండి. టిడిపి మిత్రపక్షంగా ఉంటూనే బిజెపిని దెబ్బతీయాలని చూస్తోంది. టిడిపి నేతలు వైసిపి, కాంగ్రెస్ మాయలో పడి వారితో కలిసి పోరాడుతున్నారు. వాజ్‌పేయి హయాంలో ఎన్డీఎ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు రైల్వే జోన్‌ను ఎందుకు పట్టించుకోలేదు. డబ్బెంత కావాలో లోపల బేరాలాడుతూ బయట ఉద్యమాలు చేస్తున్నారు. **విష్ణు కుమార్ రాజు, ఆకుల సత్యనారాయణ :** మేం నోరు విప్పితే మీకే నష్టం. విశాఖలో ఎమ్మెల్యే గణేష్ రైల్వే జోన్ విషయంలో మోడీ బొమ్మను మహిళలతో చెప్పులతో కొట్టించడం, నిరసన తెలపడం దుర్మార్గం. టిడిపి ప్రభుత్వం గుండాలను, రౌడీలను ప్రోత్సహించడం అన్యాయం. దానిపై సిఎం స్పందించాలి, వారిని జైలుకు పంపాలి. **మాధవ్ :** టిడిపి అధికారిక ఫేస్‌బుక్‌లో ప్రధానికి వ్యతిరేకంగా పోస్టుల వెనుక టిడిపి వైఖరేంటి? పార్లమెంట్ పవిత్రతను దెబ్బతీసే విధంగా రకరకాల వేషాలతో భ్రష్టు పట్టిస్తున్నారు. జోకర్‌లా వ్యవహరించడం దారుణం.

బిజెపికి టిడిపి సభ్యుల కౌంటర్

బుద్ధా వెంకన్న : ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలి. లేని పక్షంలో మీ నియోజకవర్గాల్లో నడిచి వెళ్లే పరిస్థితులుండవు. **జివి ఆంజనేయులు, ఆనందరావు :** హోదా కోసం అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగడతాం. చంద్రబాబు 118 పేజీలతో ప్రధాని మోడీకి రాసిన లేఖలను అన్ని పార్టీల నాయకులకు ఇస్తాం. వైసిపిది చిత్తశుద్ధి లేని పోరాటం. **గణేష్ :** ప్రధానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారంతా ముద్దాయిలా? బిజెపి నాయకులు రాయలసీమ పేరుతో ఆంధ్రను రెండు ముక్కలు చేయాలని చూస్తున్నారు. నాలుగేళ్లుగా నిరీక్షించాం. మిత్ర ధర్మాన్ని కాపాడుతూ హామీల్ని అమలుచేయండి. టిడిపి ఎంపిలతో కలిసి బిజెపి ఎంపిలు కూడా పోరాడాలి. **పల్లె రఘునాథరెడ్డి, యామిని బాల :** రాష్ట్రానికి మంచి చేయాలని జగన్‌కు లేదు. బడ్జెట్ సమా వేశాల్లో ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత వైసిపి నేరవేర్చలేక పోయింది. సమావేశాలకు ప్రతిపక్షం రాకపోవడం హాస్యా స్పదం. ఎంపిలు పార్లమెంట్‌లో నిరసన తెలపాలి కానీ రోడ్ల మీద కాదు. సుజనాచౌదరి రాజ్యసభలో నిధుల గురించి మాట్లా డితే విజయ సాయిరెడ్డి అడ్డుకోవడం దేనికి సంకేతం. మోడీ ముందు మోకరిల్లడం వారి అధినాయకుడి కోసమే. **డొక్కా మాణిక్య వరప్రసాద్ :** రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం అనుభవం గల చంద్రబాబుకు అన్ని పార్టీలు కలిసి నాయకత్వం అప్పజెప్పాలి. ఢిల్లీలో అనవసర రాజకీయాలు చేయొద్దు. అందరూ బాబు నాయకత్వంలో పనిచేస్తేనే కేంద్రం దిగొస్తుంది. ఫేస్‌బుక్‌లో పోస్టులు కేంద్రంపై నిరసనగా మాత్రమే.

సంక్షేమం కోసం అఖిల పక్షం : కత్తి నరసింహారెడ్డి

ఆంధ్రుల సంక్షేమం కోసం సిఎం చంద్రబాబు అఖిలపక్షం ఏర్పాటు చేయాలి. ఇందులో అన్ని అంశాలు చర్చించి, ప్రధానిని కలవాలి. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన విభజన హామీల్ని కేంద్రం అమలు చేయాలి. ఎపికి న్యాయం కోసం ఢిల్లీలో నిరసన తెలుపు తున్న విద్యార్థులను, ప్రజాప్రతినిధుల్ని అరెస్టు చేయడం దారుణం.

కమలానికి సీట్లు తగ్గుతాయి

- థర్డ్ ఫ్రంట్ వెనుక మోడీ హస్తం
- అసెంబ్లీ లాబీల్లో మంత్రుల మనోభావాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రం, కేంద్రాల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో మంత్రులు కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. తెలంగాణ సిఎం కె చంద్రశేఖరరావు తలపెట్టిన మూడో కూటమిపైనా వారు పెదవి విరుస్తున్నారు. తాజా రాజకీయ పరిణామాలపై శాసనసభ లాబీల్లో మంగళవారం పలువురు మంత్రులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కేంద్రంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ బలపడుతోందని, బిజెపికి గతంలో వచ్చినన్ని సీట్లు ఇప్పుడు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రోడ్లు భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి గెలిచినా సీట్లు తగ్గుతాయని తేల్చి చెప్పారు. అయితే రాష్ట్రంలో మాత్రం తామే మంచి మెజార్టీతో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెగతెంపులపై మాట్లాడరాదని, బిజెపి, తెదేపా పంతాలకు పోతే ప్రజలకు నష్టం వాటిల్లుతుందని ఆయన స్పష్టం చేశారు. రెండు పార్టీల మధ్య కలహాలు ఉన్నా, ప్రజల కోసం కలిసి కాపురం చేయాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు. టిడిపి ఎపి రాష్ట్ర అధ్యక్షులు, విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకటరావు మాట్లాడుతూ ముస్లిం ఓట్లు కాంగ్రెస్‌కు వెళ్లకుండా చేసేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. ఈ ఆలోచనతోనే మూడో ఫ్రంట్‌ను తెరపైకి తీసుకువచ్చినట్లు కనిపిస్తోందన్నారు. ఆయన ప్రకటన ఫలితాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉందన్నారు. రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కెసిఆర్ కూటమి ప్రకటన వెనుక ప్రధాని మోడీ ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. వచ్చే కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల ఫలితాల ప్రభావం దేశ రాజకీయాలపై ఉంటుందని పేర్కొన్నారు. కర్నాటకలో 200 శాతం సిద్ధరామయ్య విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు. సభలో వైకాపా లేకపోవడంపై మాట్లాడుతూ ప్రతిపక్షం సభలో లేకపోతే ఎంత మాట్లాడినా జనంలోకి వెళ్లడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు.

నగరి రిజర్వాయరుకు ముద్దుకృష్ణమ పేరు



ముద్దుకృష్ణమకు నివాళులర్పిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసన మండలి సభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడుకు రాజకీయాల్లో ప్రత్యేక స్థానం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ముద్దు కృష్ణమ నాయుడు మృతి పట్ల శాసన మండలి సంతాపం తెలిపింది. ఈ తీర్మానాన్ని మండలిలో విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు మంగళవారం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముద్దుకృష్ణమ్మ సేవలకు గుర్తింపుగా నగరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, నగరిలోని వేణుగోపాల్‌స్వామి రిజర్వాయర్‌కు గాలి ముద్దుకృష్ణమ్మ నాయుడు పేరు పెడతామని ప్రకటించారు. అటవీ శాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, పత్తిపాటి పుల్లారావు తెలిపారు. పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో ఉన్న వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని, అందువల్ల విద్యారంగ సమస్యలను అర్థం చేసుకొని పరిష్కారానికి కృషి చేశారని వివరించారు. వీరితో పాటు పలువురు ఎమ్మెల్సీలు ముద్దుకృష్ణమ సేవలను కొనియాడారు.

సభ ముందుకు పోలీస్ ఆర్డినెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిజిపి నూతన నియామకానికి సంబంధించి గవర్నర్ నరసింహన్ 2017 డిసెంబర్ 25న జారీ చేసిన పోలీస్ ఆర్డినెన్స్‌ను ఆమోదం కోసం మంగళవారం శాసనసభలో ప్రవేశ పెట్టారు. డిజిపి నియామక విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అభిప్రాయభేదాలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వమే డిజిపిని నియమించుకునే వెసులుబాటు కోసం ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ కొత్త ఆర్డినెన్స్ ప్రకారమే ప్రస్తుత డిజిపి మాలకొండయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏదైనా ఆర్డినెన్స్ జారీ అయిన ఆరు నెలలలోపు చట్ట సభల ఆమోదం పొంద వలసి ఉంది. అందువల్ల ఈ బడ్జెట్ సమావేశాల్లో మంగళ వారం ఎమ్మెల్యే ప్రభాకరచౌదరి సభలో ప్రవేశ పెట్టారు. ఈ సమావేశాల్లోనే ఆర్డినెన్స్‌ను ఆమోదించి చట్టరూపంలో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది .

ప్రశ్నోత్తరాలు

హోం గార్డులపై వివక్ష

ప్రశ్నోత్తరాల్లో బిజెపి శాసనసభాపక్షనేత విష్ణుకుమార్ రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హోం గార్డులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతూ, వారి జీవితాలతో చెలగాటమూడుతోందని బిజెపి శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ రాజు ధ్వజమెత్తారు. ఎపి బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం సభ ప్రారంభంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో హోంగార్డులు 15 వేల మందికి పైగా ఉన్నారని, వీరికి దినసరి వేతనంగా కేవలం రూ. 400 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఈ వేతనాన్ని రూ.500 మాత్రమే పెంచుతామని ప్రతిపాదించడం సరికాదన్నారు. హోంశాఖ మంత్రి చినరాజప్ప మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పటికి హోంగార్డులకు రూ.300 మాత్రమే వేతనం ఉండేదని, దాన్ని రూ. 400 పెంచామని చెప్పారు. ఇప్పుడు రూ.500లకు పెంచి, ఏటా రూ. 50 పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. .

బిసిలకు 12867 కోట్లు ఖర్చు : అచ్చెన

టిడిపి అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో బిసిల అభ్యున్నతికి రూ.12,867 కోట్లు ఖర్చు చేసినట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సభ్యులు బి ముత్యాల నాయుడు, జి జయరాం తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ ఈ వివరాలు తెలిపారు.

రహదారుల సమస్య అధికం : కోడెల

తమ నియోజకవర్గాల్లో గ్రామీణ రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, నరేగా నిధులతో రహదారులు వేయాలని సభ్యులు వేణుగోపాలరెడ్డి, మాధవనాయుడు, రామారావు, వెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు కోరారు. ఈ ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానమిస్తూ రాష్ట్రంలో ఇంకా 11,907 జనావాసాల అనుసంధానం, 3327 గ్రామాలకు 5469 కిలోమీటర్ల రోడ్ల అవసరం ఉందన్నారు. ఈ నిర్మాణాలకు రూ.4234 కోట్ల అంచనాతో ఇఎపి, ఎఐఐబి ప్రాజెక్టు కింద ప్రతిపాదించినట్లు తెలిపారు. రోడ్ల సమస్యపై స్పీకర్ కోడెల స్పందిస్తూ రాష్ట్రంలో రహదారుల సమస్య అధికంగా ఉందన్నారు. డొంకరోడ్లు, కంకర రోడ్లు సక్రమంగా లేవన్నారు. రహదారుల నిర్మాణా లకు ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ నిధులు కూడా సక్ర మంగా రావడం లేదనే వాదన ఉందన్నారు. వర్షా లు వస్తే రోడ్లు ధ్వంసమవు తున్నాయని తర్వాత వా టిని పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు.

తెలుగు గేదెలే కావాలి : వర్మ

హర్యానా గేదెలకు తెలుగు రాదని, వాటికి ఇక్కడి గేదెలతో పొసగడం లేదని, తెలుగు వచ్చిన



ఎపి గేదెలనే కొనుగోలు చేసి పేద వర్గాలకు ఇవ్వాలని పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌విఎస్‌ఎన్ వర్మ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల గేదెలు పుష్కలంగా తింటున్నా పాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. తనను మహిళలు ఈ సమస్య గురించి అసెంబ్లీలో అడగమని కోరారని, తాను వెళ్లి వారికి సరైన సమాధానం ఇవ్వకుంటే నియోజకవర్గంలో తిరగనివ్వరని ఆయన తెలిపారు. స్పీకర్ కోడెల ప్రసాదరావు మాట్లాడుతూ బడుగుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. ప్రధానమైన ఈ సమస్యపై మంత్రి చర్యలు తీసుకోవాలన్నారు.

జీరో అవర్

వెలిగొండకు రూ.500 కోట్లు కేటాయించండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెలిగొండ ఎత్తిపోతల పథకానికి రూ.500 కోట్లు ఈ ఏడాది బడ్జెట్ కేటాయించాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు శాసనసభ జీరో అవర్‌లో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం జిల్లాలోని మెట్టప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో గ్రామాలకు జాతీయ రహదారి నుంచి రాకపోకలు సాగించేందుకు అవసరమైన రహదారులకు మరమ్మతులు నిర్వహించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. చిత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు తక్కువగా కేటాయించారని, విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు. కందులు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వినుకొండ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు కోరారు.

ఈపూరు మండలంలో గత ఏడాది మిర్చి రైతులకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి నిధులు అందలేదని, త్వరగా మంజూరు చేయాలని కోరారు. భీమవరంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు.

శనగ రైతులు సంక్షోభంలో ఉన్నారని, కిలో రూ.60 కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద ఉన్న లక్ష టన్నుల శనగ రాష్ట్ర ప్రభుత్వం, నాఫెడ్ కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనేతర ప్రాంతాల్లోని గిరిజనులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మృణాళిని ప్రభుత్వాన్ని కోరారు. సభ్యులు లేవనెత్తిన అంశాలను నమోదు చేసుకున్నామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రులు సమాధానాలిచ్చారు.

గవర్నర్ ప్రసంగం తీరు పట్ల అసంతృప్తి

- పోలవరం నిర్వాసితుల పరిహారం ప్రస్తావన లేదు
- ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక ప్యాకేజీ ఊసే లేదు

ప్రజాశక్తి యంత్రాంగం

రాష్ట్ర ప్రజలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఖరిని ప్రస్ఫుటపరిచేది గవర్నర్ ప్రసంగం. కానీ సోమవారం నాటి గవర్నర్ ప్రసంగం చూస్తే చప్పగా సాగిందనే చెప్పవచ్చు. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో నిధుల ప్రస్తావన ఉంటుంది. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ వైఖరి ఎలా ఉందీ, భవిష్యత్తులో ఎలా ఉండబోతుందనేది గవర్నర్ ప్రసంగం ద్వారా తెలుస్తుంది. కానీ నిన్నటి ప్రసంగంలో ఆయా ప్రాంత ప్రజల సమస్యలు నామమాత్రంగా ప్రస్తావనకు తేవడం, కొన్నింటిని ప్రస్తావించకపోవడంతో వివిధ రంగాల నిపుణులు, మేధావులు మండిపడుతున్నారు. పోలవరం, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, రాజధాని ప్రాంత అభివృద్ధి, మచిలీపట్నం పోర్టు, విశాఖ-చెన్నయ్ ప్రాంత పారిశ్రామిక కారిడార్, రాయలసీమలో కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం పోర్టు తదితర సమస్యలపై స్పష్టత ఇవ్వలేదు. గత బడ్జెట్‌ల సందర్భంగా సాగిన గవర్నర్ ప్రసంగంలో 'పోలవరమే' కీలక అంశంగా ఉండేది. ఈసారి గవర్నర్ ప్రసంగంలో పోలవరంపై ఒక్కవాక్యంతో సరిపెట్టేశారు. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైంది నిర్వాసితులకు పరిహారం అందించడం. నిర్వాసితుల పరిహారం విషయంలో ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభ నేపథ్యంలో సోమవారం గవర్నర్ నరసింహన్ 2019కి పోలవరం పూర్తిచేసేందుకు రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్న మాటలు తప్ప నిధుల విషయంగానీ, నిర్వాసితుల సమస్యలపైగానీ ప్రస్తవించలేదు. ఒకవైపు కేంద్రమూ నిధులు కేటాయించక, రాష్ట్రం అంత పెద్దమొత్తంలో నిధులు ఖర్చుపెట్టే పరిస్థితి లేకుండా పోవడంతో పోలవరం ఎపుడు పూర్తవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలవరంపై బిజెపి,టిడిపి డ్రామాలు



పోలవరం ప్రాజెక్టును 2019లోపు ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయలేరు. దీనిపై టిడిపి, బిజెపిలు నాటకాలాడుతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో టిడిపి అవినీతిని గమనించిన బిజెపి నిధులు ఇవ్వడానికి సుముఖంగా లేదు. అవినీతితో నిండిపోయిన టిడిపికి నిధులిస్తే చిల్లు కుండలో నీరు పోసినట్లుగా బిజెపి భావిస్తోంది. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వదు. అసలు జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరాన్ని కేంద్రం చేతిలో నుంచి టిడిపి లాక్కోవడమే పెద్ద పొరపాటు. ప్రాజెక్టు పేరుతో నిధులు లాక్కోవాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం తనపై వేసుకుంది.

-అశోక్ కుమార్ జైన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు, రాజమహేంద్రవరం


నిరాశను మిగిల్చింది



అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ఉత్తరాంధ్రవాసులకు నిరాశను మిగిల్చింది. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలను ప్రసంగంలో గవర్నర్ నిర్దిష్టంగా చెప్పలేదు. ప్రభుత్వ పెద్దలు చెప్పిన అంశాలను మాత్రమే ప్రసంగంలో ప్రస్తావించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రస్తావనే లేకుండా పోయింది. జాతీయ విద్యాసంస్థను జిల్లాలో ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నా, ఆ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలపై గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదు.

- మిరియాల చంద్రయ్య మాజీ వైస్ ఛాన్సలర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు



ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన రైల్వేజోన్ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం చేయదలచిన కృషి ఏమిటో గవర్నర్ ప్రసంగంలో లేదు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. వెనుక బడిన జిల్లాల ప్యాకేజీని అమలు చేయడం లేదు. గిరిజనుల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదు.

- ఎ.అజశర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి

వెనుక బడిన ప్రాంతాలపై శ్రద్ధ ఏదీ?



అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా గవర్నర్ నరసింహన్ ప్రసంగం అంతా కొత్త సీసాలో పాతసారా పోసిన చందంగా ఉంది. కొత్త అంశాలు ఏమీ లేవు. బాబు నాలుగు సంవత్సరాల పాలనలో మొదిటి అసెంబ్లీ బడ్జెట్‌కు ప్రస్తుత బడ్జెట్‌కు ఎటువంటి డెవల ప్మెంట్ కనబడలేదు. వెనుక బడిన జిల్లాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రాలపైన కనీస బాధ్యత ఏమాత్రం తీసుకోలేదు. 42 రోజులుగా సీమ న్యాయ వాదులు హైకో ర్టును సీమలో ఏర్పాటు చేయాలని పోరాటం సాగిస్తున్నా గవర్నర్ ప్రసంగంలో దీనిపై ప్రస్తావనే లేదు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు సీమలో హైకోర్టు ఏర్పాటు అంశంపై చర్చించి కేంద్రానికి ప్రతిపాధనలను పంపాలి.

- జి.వి.రాఘవరెడ్డి, మాజీ అధ్యక్షులు, బార్ అసోసియేషన్, కడప.

న్యాయవాదుల ఆందోళన ప్రస్తావన లేదు



ముఖ్యమంత్రి చెబుతున్న మాటలే గవర్నర్ నోటి నుంచి వచ్చాయి. ఆయనకంటూ స్వతంత్రంగా మాట్లాడినట్లు లేదు. ప్రత్యేక ప్యాకేజీ అని గతంలో మాట్లాడారు. ఇప్పుడు ప్రత్యేక హోదా అంటున్నారు. ఇక రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాల గురించి ప్రత్యేకంగా ఏమీ లేదు. ఒకవైపు హైకోర్టును ఏర్పాటు చేయాలని న్యాయవాదులు 45 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం చూసుకున్నా రాజధాని ఒక చోట ఉంటే హైకోర్టు మరో చోటు ఉండాలని ఉంది. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాల్సిన అవసరముంది. ఆ అంశాలను కూడా ఆయన ప్రసంగంలో కనీస ప్రస్తావన చేయకపోవడం శోచనీయం.

-హరినాథరెడ్డి ప్రముఖ న్యాయవాది -అనంతపురం

చంద్రబాబు స్క్రిప్ట్‌ను గవర్నర్ చదివాడు



తను స్వయంగా మాట్లాడిన అంశాలు ఏమీ లేవు. సిఎం చంద్రబాబునాయుడు ఏమైతే స్క్రిప్ట్ రాయించి ఇచ్చారో అది మాత్రమే గవర్నర్ చదివి వినిపించాడు. ఆయన మనసులో నుంచి వచ్చిన మాట ప్రసగంలో ఒక్కటి కూడా లేదు. తన మనసులోని మాట చెప్పేందుకు కూడా టిడిపి ప్రభుత్వం గవర్నర్‌కు అవకాశం ఇవ్వకపోవడం శోచనీయం.

- ఎన్. రామమూర్తి, సభ్యులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కడప.

సామాన్యుడి అభివృద్ధి కి ప్రణాళిక లేదు



గవర్నర్ నరసింహన్ ప్రభుత్వంతో భాగస్వామ్యమయ్యారు.. 2019 ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఇదంతా. నాలుగేళ్లు ప్రత్యేక హోదా కాదు ప్రత్యేక ప్యాకేజి అంటూ నాటకాలాడింది ప్రభుత్వం. సామాన్యుడి అభివృద్ధికి తగిన ప్రణాళిక లేదు.

భూమన్, రాయలసీమ అధ్యయన సంస్థ కన్వీనర్, తిరుపతి

పాత విషయాలనే వల్లే వేశారు



పాత విషయాలనే మరోమారు గవర్నర్ తన ప్రసంగంలో వల్లే వేసినట్టుగా ఉంది. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి అంశంపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ప్రాంతాభివృద్ధి గురించి నిర్దిష్టమైన ప్రకటనేది లేదు. ఒకటి,రెండు అంశాలు ప్రస్తావించడం మినహా. అదే రకంగా ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించడం మినహా దాని సాధనకు పోరాటం చేస్తామని ఎక్కడా చెప్పలేదు. మరోవైపు కేంద్రం రాష్ట్రాల అధికారాలను హరించి వేసి ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోంది. దీని గురించి ప్రస్తావన లేదు. విద్యా, వైద్యం గురించి కొంత మాట్లాడినా వాస్తవానికి మోడల్ పాఠశాలలు దెబ్బతింటున్నాయి. మొత్తంగా చూస్తే పైపై మాటలు తప్ప అందులో చిత్తశుద్ధి కనిపించడం లేదు.

-డాక్టర్ గేయానంద్, రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుంది

బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉంది. ప్రభుత్వం ప్రత్యేక హోదామీద ఇప్పుడు పెట్టిన దృష్టి మూడేళ్ల క్రితం పెట్టి ఉంటే రాష్ట్రానికి న్యాయం జరిగేది. చివరలో పెట్టడం వల్ల ఉపయోగం లేకుండా పోయింది.

సివిల్ ఫోరం కన్వీనర్ ప్రసాద్‌శర్మ,కర్నూలు

మాటలు తప్ప పనులు లేవు

పోలవరంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలు చెబుతున్నాయే తప్ప పనులు లేవు. 2019కి ప్రాజెక్టు పూర్తి అంటూ గవర్నర్ ప్రసంగంలో చెప్పిన మాటలు వట్టిమాటలే. ప్రాజెక్టు నిర్మించాలన్న చిత్తశుద్ధి కేంద్ర, రాష్ట్ర పాలకులకు లేకుండా పోయింది. అత్యంత ప్రధానమైన ప్రాజెక్టుపై ప్రభుత్వాలు ఈవిధంగా వ్యవహరించడం దారుణం.

- శిరిగినీడి నాగభూషణం, వ్యవసాయ నిపుణులు, నరసాపురం

పోలవరాన్ని పట్టించుకోవాల్సిందే



పోలవరం ప్రాజెక్టు ప్రజల మనసుల్లో నాటుకుపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవాల్సిందే. ప్రాజెక్టు 2019కి పూర్తవడం అసాధ్యం. ప్రాజెక్టు పూర్తవడానికి మరో నాలుగైదేళ్లు పైనే సమయం పడుతుంది.

- పి.రామకృష్ణంరాజు, ప్రొఫెసర్, భీమవరం

ఉత్తరాంధ్రకు అన్యాయం



అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఇ.ఎస్.ఎల్ నరసింహన్ చేసిన ప్రసంగంలో ఉత్తరాంధ్రకు జరిగిన అన్యాయం, జరగాల్సిన అభివృద్ధి గురించి ప్రస్తావించలేదు. రాష్ట్ర విభజన చట్టంలో వెనుకబడిన ఉత్తరాంధ్రకు ఇచ్చిన, ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ గురించి గవర్నర్ పేర్కొనలేదు.

- గొలివి.నర్సునాయుడు, ఉత్తరాంధ్ర మేధావుల ఫోరం సమన్వయకర్త

ప్రభుత్వ ఉద్దేశాన్నే గవర్నర్ చిలక పలుకులు పలికారు

రాష్ట్ర గవర్నర్ ప్రసంగం గతేడాది ఒకలా.. ఈ ఏడాది మరోలా ఉన్నందున ఆయన మాట మార్చినట్లు కాదు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అలా చెప్పించింది. ఇప్పుడు హోదాకు అనుకూలంగా చెప్పించింది. ప్రభుత్వం రాసిచ్చిన స్క్రిప్ట్‌ను గవర్నర్ చిలక పలుకులు పలికారు.

- ఈఎఎస్ శర్మ, విశ్రాంత ఐఎఎస్ అధికారి

హోదా అమలు గురించే ఒత్తిడి తేవాలి

2017లో గవర్నర్ ప్రసంగంలో ప్రత్యేక ప్యాకేజి, ఇప్పుడు ప్రత్యేక హోదా అని గవర్నర్ నరసింహన్ పలకడం వెనుక పెద్ద ఆశ్చర్యం లేదు. అసలు ఇప్పుడు రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు అడగాల్సింది ప్రత్యేక హోదా ప్రకటన గురించి కాదు. దాని అమలు గురించి అడగాలి. ఎందుకంటే 2014 లోనే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హోదాను ప్రకటించింది.

-కెఎస్ చలం, జాతీయ మానవ హక్కుల వేదిక సభ్యులు, మాజీ విసి

ప్రభుత్వం చెప్పించింది

ప్రత్యేక హోదాపై గవర్నర్ ప్రసంగం వింటుంటే ప్రభుత్వం రాసిచ్చిన పత్రాన్ని చదివారు తప్ప సొంత అభిప్రాయం ఏమీ అందులో కనిపించలేదు. ఇన్ని రోజులు ఎందుకు గమ్మునే ఉన్నారు. ప్రత్యేకహోదా రాకపోవడం వల్ల రాజకీయ నాయకులు కాదు, ముఖ్యంగా యువత నష్టపోతుంది. ఈ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ డ్రామాలన్నీ.

- డాక్టర్ రమేష్, ఎస్‌వి ఆయుర్వేదిక్ లెక్చరర్-తిరుపతి


ఆలస్యంగానైనా గుర్తించారు



ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయింది. చివరి బడ్జెట్ సమయంలో కేంద్రం రాష్ట్రానికి ఏం చెయ్యాలో ప్రస్తావించడం అంత ఉపయోగకరంగా ఉండదు. ఆంధ్ర రాష్ట్ర ప్రజల హక్కయిన ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రైల్వే జోన్ తదితర విషయాలపై ప్రభుత్వం ముందు నుంచే చొరవ తీసుకుంటే ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చేది. ఇప్పటికైనా రాష్ట్ర అవసరాలను గుర్తించి మాట్లాడటం మంచిదే. మాటలకే పరిమితం కాకుండా కేంద్రం నెరవేర్చాల్సిన విభజన హామీలన్నింటినీ సాధించేందుకు ప్రయత్నించాలి.

-లారీ ఓనర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు

ప్రత్యేక హోదా కోరడం హర్షణీయం



బడ్జెట్ సమావేశాలకు ముందుగా అసెంబ్లీలో గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగం రాష్ట్ర వాస్తవ పరిస్థితిని చాటింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ అవసరాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించడం హర్షణీయం. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుంది. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం విభజనొప్పారు.హామీలు అమలు చేయాల్సిన బాధ్యతను గవర్నర్ తన ప్రసంగం ద్వారా తెలియజేశారు.

-ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ ఎపిఐఐసి ఐలా సర్వీసు సొసైటీ చైర్మెన్ సుంకర ప్రసాద్

విద్యుత్ ఉద్యమంపై సర్కారు ఉక్కుపాదం

సమ్మె విరమణకు ముందు నేతలు, కార్మికుల ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లను ఆమోదించాలని 15రోజులుగా సమ్మె చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 7న చలో విద్యుత్ సౌధకు పిలుపునివ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ కార్మికులను, సిపిఎం, సిఐటియు నాయకులను ప్రభుత్వం సోమవారం రాత్రి నుంచీ అరెస్టులు చేయిస్తోంది. విజయవాడ వెళ్లకుండా ముందస్తు అరెస్టులు, బైండోవర్ కేసులకు పాల్పడింది. విద్యుత్ కార్మికులు, మద్దతు ఇచ్చే వామపక్ష పార్టీల, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు జల్లెడపట్టడంతో పలుచోట్ల కార్మికులు దీక్షా శిబిరాల నుంచి అజ్ఞాతంలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ కార్మికుల బంధువులను సైతం పోలీసులు వేధించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కార్మికులు విజయవాడ వెళ్లకుండా ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రధాన రోడ్లలో తనిఖీలు చేపట్టారు.

శ్రీకాకుళం జిల్లా రాజాంలో చలో విద్యుత్‌శాఖ మంత్రి కార్యాలయం ముట్టడి చేపడతారని, చలో విజయవాడ వెళ్తారని జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచే నాయకుల ముందస్తు అరెస్టులకు ప్రభుత్వం పాల్పడింది. శ్రీకాకుళం, రణస్థలం, లావేరు, ఆమదాలవలస, పాలకొండ, కవిటి తదితర మండలాల్లో సిఐటియు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసింది. విజయనగరం జిల్లా సాలూరు, పార్వతీపురంలో పలువురిని అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి, ఆకివీడు, నల్లజర్ల, కొవ్వూరు, తణుకు తదితర ప్రాంతాల్లో 30 మందికిపైగా కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టుల పేరిట స్టేషన్‌కు తీసుకెళ్లారు. తణుకులో కార్మికులు కనిపించలేదని ఇంట్లో కార్మికుని తండ్రిని స్టేషన్‌కు తీసుకెళ్లడం చూస్తే ప్రభుత్వం ఎంతకు బరితెగించిందో వేరే చెప్పనక్కర్లేదు. భీమవరంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్‌ను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గుంటూరు జిల్లాలో విద్యుత్ కార్మిక నాయకులు, సిఐటియు నాయకుల్ని పోలీసులు అరెస్ట్‌లు చేస్తున్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, నాయకులు బాలభాస్కర్‌ను అరెస్ట్ చేసి పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఉంచారు. ఒంగోలులో విద్యుత్ కాంట్రాక్టు ఐక్యవేదిక నాయకులనూ, సిఐటియు నాయకులను 10 మందిని పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టులు చేశారు. జరుగుమల్లి, మద్దిపాడు స్టేషన్‌లకు తరలించి నిర్బంధించారు.



రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వెలగపూడిలోని సచివాలయం వద్ద 'చలో అసెంబ్లీ' నిర్వహించిన న్యాయవాదులు

ఎస్‌వియులో అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల విలువైన కలప దగ్ధం

ప్రజాశక్తి-క్యాంపస్ (ఎస్‌వియు)

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో యూనివర్సిటీ వెనుక భాగంలో నిల్వ ఉంచిన రూ.10 లక్షల విలువైన నీలగిరి, ఇతర వృక్షాల కలప అగ్నికి ఆహుతయ్యింది. ఏడాది క్రితం నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మహాసభల కోసం వర్సిటీ విలువైన పురాతన వృక్షాలను తొలగించి నిర్మాణంలో ఉన్న సెమినార్ కాంప్లెక్స్ సమీపంలో కలపను నిల్వ ఉంచారు. మంగళవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు మంటలు తారాస్థాయికి చేరుకున్నా భద్రతాధికారులు ఎవరూ అక్కడ లేకపోవడం గమనార్హం. సమయానికి స్పందించిన హెచ్‌బ్లాక్ విద్యార్థులు, కామర్స్ పరిశోధకులు వెంటనే ఫైర్ ఆఫీసుకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసిన తరువాత కూడా వర్సిటీ సిబ్బంది గాని, ఉన్నతాధికారులు గాని అక్కడకు రాలేదు. వర్సిటీ భద్రతా విభాగంలో ఒక ఎస్ఒ, నలుగురు ఎఎస్ఒలు ఉండి వారికి ప్రత్యేక వాహనాన్ని సైతం పర్యవేక్షించడానికి కేటాయించారు. అయితే మంటలు ఎగిసి పడుతున్నా అటువైపు ఎవరూ తొంగిచూడలేదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

గురజనాపల్లిలో రొయ్యల ఫ్యాక్టరీ సీజ్

ప్రజాశక్తి-కరప (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా కరప మండలం గురజనాపల్లిలోని వీరభద్ర ఎక్స్‌పోర్ట్ రొయ్యల ఫ్యాక్టరీలో తరచూ అమోనియా గ్యాస్ లీకై కార్మికులు అస్వస్థతకు గురవుతుండటంతో కాకినాడ ఆర్‌డిఒ ఎల్.రఘుబాబు మంగళవారం ఆ ఫ్యాక్టరీని, గోదాములను సీజ్ చేశారు. తహశీల్దార్ బి.శ్రీదేవి, సిబ్బందితో కలిసి రొయ్యల ఫ్యాక్టరీలో పనులను నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ నిషేధ ఉత్తర్వుల ప్రకారం సీజ్ చేశామన్నారు. మళ్లీ ఉత్తర్వులు వచ్చే వరకూ ఎటువంటి పనులూ చేయడానికి వీల్లేదన్నారు. ఫ్యాక్టరీ లోపల సుమారు రూ.50 కోట్ల విలువ చేసే రొయ్యల స్టాకు ఉన్నట్లు యాజమాన్యం తెలిపిందన్నారు. వాటి సంరక్షణ కోసం కోల్డ్ స్టోరేజ్‌ను ఆపరేట్ చేసేందుకు ఒకరు లేదా ఇద్దరు సిబ్బంది లోపల ఉండేందుకు అనుమతి ఇస్తున్నట్లు చెప్పారు. యాజమాన్యం కూడా లోపల ఉండేందుకు వీలులేదన్నారు. గతంలో ఇదే ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ లీకవడం, సీజ్ చేసినప్పుడు మళ్లీ ఎందుకు అనుమతిచ్చారని విలేకరులు ప్రశ్నించారు. దీనిపై ఆర్‌డిఒ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతా కమిటీకి అప్పీలు చేసుకుందన్నారు. కలెక్టర్ భద్రతా కమిటీని ఎంపిక చేసి ఫ్యాక్టరీకి పంపించారని తెలిపారు. ఫ్యాక్టరీలో భద్రతా చర్యలు బాగానే ఉన్నాయని ఆ కమిటీ నిర్ధారించాక ఫ్యాక్టరీని తెరిచేందుకు అనుమతించామన్నారు. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో సీజ్ చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి

ఎపి చీఫ్ సెక్రటరీ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం (విజయవాడ)



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న దినేష్‌కుమార్

ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ దినేష్‌కుమార్ అన్నారు. కృష్ణాజిల్లా కొండపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దశ్య శ్రవణ (డిజిటల్) తరగతి గదులను ఎపి సిఎస్ దినేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ డిజిటల్ తరగతి వసతి కల్పిస్తామన్నారు. బాలికలు అధిక శాతం విద్యావంతులు కావడం వల్ల రాష్ట్రం ఎక్కువ అభివద్ధి సాధిస్తుందన్నారు. కలెక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ.. డిజిటల్ తరగతులు నిర్వహించడంలో కష్ణా జిల్లా ముందు వరుసలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు. డిజిటల్ పరికరాలను పాఠశాలకు అందజేసిన తెలుగు అసోసియేషన్ ఉత్తర అమెరికా శాఖ అధ్యక్షులు కోమటి జయరాం మాట్లాడుతూ.. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ విషయాలలోనూ సహాయం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో కష్ణా జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో పౌర సరఫరాల శాఖ తనిఖీలు

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణా)

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖాధికారులు కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పిడిఎస్ డిటి ఎఎన్ఎన్.రాజు మాట్లాడుతూ.. గుడివాడ డివిజన్ స్థాయిలో ప్రతి పెట్రోల్ బంకును తనిఖీ చేస్తామన్నారు. బంకులో స్టాక్ రిజిస్టర్, నాణ్యతా ప్రమాణాలు తదితర వాటిని పరిశీలిస్తున్నామన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి పెట్రోల్ బంకులో తప్పనిసరిగా మరుగుదొడ్లు ఉండాలన్నారు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించే దిశగా పెట్రోల్ బంకులు స్వైప్ మిషన్లను ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలిస్తున్నామన్నారు. ఎక్కడైనా పెట్రోల్ బంకులో కల్తీ జరుగుతున్నట్లు నిరూపణైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామ పేర్కొన్నారు. మూడు రోజులపాటు తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

గాయాలపాలై పరీక్ష రాయలేకపోయిన ముగ్గురు ఇంటర్ విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకొల్లు/యలమంచిలి

రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ముగ్గురు ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేకపోయారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి సమీపంలోని యలమంచిలి మండలం అడవిపాలెం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. యలమంచిలి మండలం పెనుమర్రుకు చెందిన ఆటోడ్రైవర్ ఉండ్రాజవరపు సురేష్ తన ఆటోలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు, అదే గ్రామానికి చెందిన చంద్రమ్మను ఎక్కించుకుని పాలకొల్లు బయలుదేరారు. మేడపాడు వద్ద మరో ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు ఆటో ఎక్కారు. ఆటో అడవిపాలెం వద్దకు వచ్చేసరికి మట్టి ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో పెనుమర్రుకు చెందిన చంద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలపాలైన డ్రైవర్ సురేష్‌ను, విద్యార్థి సందీప్‌ను స్థానికులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి యశ్వంత్‌ను అతని తండ్రి ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. మేడపాడులో ఆటో ఎక్కిన ఇంటర్ విద్యార్థిని నవీనకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో పరీక్షా కేంద్రానికి 40 నిమిషాలు ఆలస్యంగా వెళ్లడంతో ఆమెను అధికారులు పరీక్షకు అనుమతించలేదు. ఈ ప్రమాదం కారణంగా సందీప్, యశ్వంత్, నవీన పరీక్షకు దూరమయ్యారు.

కళాత్మకమైన ఉత్పాదన శక్తి మహిళల సహజ లక్షణం

భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయ్ భాస్కర్

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

కళాత్మకమైన ఉత్పాదన శక్తి మహిళలకు ఉన్న సహజ లక్షణమని రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.విజయ్ భాస్కర్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా భాష, సాంస్కృతిక శాఖ, మీనాక్షి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ, కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి సంయుక్త నిర్వహణలో మూడు రోజులపాటు మహిళలకు నిర్వహించనున్న తోలు బొమ్మల కళా శిక్షణా శిబిరాన్ని కల్చరల్ సెంటర్‌లో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్‌భాస్కర్ మాట్లాడారు. మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వివిధ కళల్లో శిక్షణ అందించి వారికి జీవనోపాధి కల్పించేందుకు అనేక పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. మహిళలను అభివృద్ధి వైపు తీసుకువెళ్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటువంటి శిక్షణా తరగతులను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ సెల్వి ఆర్ముగం, నాబార్డు ఆఫీసర్ విజయ్ తురుమెళ్ళ, హాండి క్రాఫ్ట్స్ ప్రమోషన్ ఆఫీసర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

జెపిసి దర్యాప్తు అవశ్యం

పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం భారత ఫైనాన్సియల్ వ్యవస్థనే కాదు, పార్లమెంటును కూడా కుదిపేసింది. పన్నెండు వేల కోట్ల సంపదను లూటీ చేసి, విదేశాలకు ఉడాయించిన బ్యాంకు బందిపోటు నీరవ్ మోడీ వ్యవహారంపై పార్లమెంటుకు జవాబుదారీ వహించాల్సిన మోడీ ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూడడం హేయమైన చర్య. ఆర్థిక నేరాలు ఒక్క పంజాబ్ నేషనల్ బ్యాంకు వరకే పరిమితమై లేదు. మరో ఇరవై బ్యాంకులకు ఇది శఠగోపం పెట్టింది. ప్రభుత్వరంగ బ్యాంకులే కుంభకోణాలకు కారణం కాబట్టి వాటిని ప్రయివేటీకరించాలని సంస్కరణ వాద సమర్థకులు వాదించడం దొంగే దొంగ అన్న చందంగా వుంది . స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి అంటే 1947 నుంచి 1969వరకు మధ్య కాలంలో అయిదు వందలకు పైగా ప్రైవేట్ బ్యాంకులు మూతపడ్డాయి. దివాళా దిశలో వున్న మరి కొన్నిటిని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విలీనం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని వాదించే ఈ పెద్ద మనుషులకు ఈ సంగతి తెలియదా? లేదా తెలిసీ తెలియనట్లు నటిస్తున్నారా? ప్రయివేటు బ్యాంకులు కూడా నీరవ్‌మోడీ నీడలో ఉన్నాయి. సిరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ సంస్థ ఆఫీస్ (ఎస్‌ఎఫ్‌ఐఓ) విచారణ మొదలుపెట్టింది.

దేశంలో ప్రయివేటు రంగంలో అగ్రగామిగా ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు ఎమ్‌డీ, సీయిఓ చందాకొచ్చార్‌కు, యాక్సిస్ బ్యాంక్ ఎమ్‌డీ శిఖాశర్మకు ఇన్వెస్టిగేషన్ సంస్థ సమన్లు జారీ చేయడంతో ఈ ప్రయివేటు రంగ బ్యాంకుల బండారమేమిటో నేడు కాకున్నా రేపు అయినా బయటపడుతుంది. నీరవ్‌మోడీ సంస్థలతో తమకు సంబంధం లేదు. ఆయన మామ మోహిత్ చౌక్సీకి చెందిన గీతాంజలి గ్రూప్‌కు మాత్రమే రుణం యిచ్చినట్టు ఐసీఐసీఐ బ్యాంకు తెలిపింది. కానీ ఆ రుణమెంతో తెలుపలేదు. ప్రయివేటు బ్యాంకులకు నోటీసులు యివ్వడంతో షేర్‌మార్కెట్ మరో భారీ కుదుపునకు గురైంది. లాభాలతో మొదలైన వర్తకం క్రమంగా నష్టాల్లోకి జారిపోయింది. చివరి గంటల్లో మదుపరులు భారీగా విక్రయాలకు పాల్పడ్డారు. ఫలితంగా రూ. 2 లక్షల కోట్ల మేరకు సంపద ఆవిరైపోయినట్టు ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. ప్రయివేటు బ్యాంకులు స్కామ్‌లకు అతీతం కాదనేది తేలిపోయింది.

పీఎన్‌బీ స్కామ్‌లో ఇప్పటి వరకు 15 మందిని అరెస్టు చేశారు. మంగళవారం నాడు గీతాంజలి గ్రూప్ ఆపరేషన్స్ ఉపాధ్యక్షుడు విపుల్‌ను ముంబయి విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నారు. సీబీఐ ప్రశ్నిస్తున్నది. బ్యాంకు కుంభకోణం మా కాలంలో కాదు అని కమలనాధులు పలుకుతున్నారు. అలాంటప్పుడు కాంగ్రెస్ పాలనలో నీరవ్ చేసిన అప్పులెన్ని? బిజెపి పాలనలో చేసిన అప్పులు ఎన్నో బయటపెట్టడానికి మోడీ ప్రభుత్వం ఎందుకు సంకోచిస్తున్నాట్లు? 2017-18లో రూ. 4వేల కోట్లకు పైగా అప్పు తీసుకొని తిరిగి చెల్లించలేదని తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోలేదు. ప్రతి దానికి స్పందించే ప్రధాని ఉత్తరాన్ని ఉట్టిమీద ఎందుకు పెట్టారో జవాబు చెప్పాల్సిన అవసరం ఉంది.

దేశంలోనే అత్యంత ధనవంతులలో నీరవ్‌మోడీ 85వ వాడు. బ్యాంకుల్లో డిపాజిట్ లేకుండా ఎలాంటి షూరిటీ లేకుండా అప్పులు ఎలా ఇచ్చారనేది అసలు సమస్య ఆడిట్‌లో ఎందుకు తెలుసుకోలేక పోయారో చెప్పడం లేదు. ప్రభుత్వ బ్యాంకుల్లో మిత్తి తక్కువ ఇచ్చినా భద్రత ఉంటుందని తెలిసి దాచుకున్నారు. ఖాతాదారుల నష్టానికి బాధ్యత ఎవరు వహించాలి అనేదానిపై చర్చ జరగాలి. ఒక ఎల్‌ఓయూకు 90 రోజుల కాలపరిమితిలోపు తిరిగి చెల్లించాలి. సామాన్యులు లోన్ తీసుకుంటే ఇండ్ల ముందు నిలబడి జప్తు చేస్తారు. రూ. 12వేల కోట్లు పైచిలుకు కొన్నేండ్లుగా పేరుకుపోతే బ్యాంకు యాజమాన్యం ఎందుకు పట్టించుకోలేదో ఇది రాజకీయ అండదండలు లేకుండా సాధ్యమయ్యే పనికాదు. స్కాం బయటపడేముందు దావోస్ ఆర్థిక సదస్సులో నీరవ్ మోడీ ప్రత్యక్షం కావడం నరేంద్ర మోడీతో ఫొటో దిగడం. ఇది ఎలా జరిగిందో ప్రధాని నోరు విప్పి చెపితేకానీ అర్థం కాదు.

2001లో గుజరాత్‌కు చెందిన కేతన్‌పరేఖ్ విదేశీ గుత్త సంస్థలతో కలిసి ःబ్యాంక్ ఆఫ్ ఇండియాకు 130 కోట్లు బకాయి పడ్డారు. మర్కెంటైల్ కో ఆపరేటివ్ బ్యాంక్, గుజరాత్‌లోని 168 సహకార బ్యాంకులు సుమారు రూ. వెయ్యి కోట్ల రుణాలు స్టాక్ బ్రోకర్ సంస్థలకు అప్పుగా ఇచ్చాయి. ఈ వెయ్యి కోట్లలో ఒక కేతన్ పరేఖ్‌కు 600 కోట్లు ఇచ్చారు. ఫలితంగా 24కు పైగా సహకార బ్యాంకులు మూత పడ్డాయి. కొన్ని బ్యాంకులు సంక్షోభంలో పడ్డాయి. ఇదికూడా బిజెపి పాలనలో జరిగిందే. దీనిపై పార్లమెంటులో చర్చించారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి దోషులను బయటపెట్టారు. ఆర్థిక నేరాలకు పాల్పడి ఒకరి తర్వాత ఒకరు దేశం విడిచి పారిపోతున్నా, నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నా మోడీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. బ్యాంకుల మీద విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నీరవ్ మోడీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలి. బ్యాంకులను నిలువునా దోచిన ఘరానా మోసగాళ్లను పట్టుకుని శిక్షించాలి.

ఇదీ విషయం



కాషాయం పిచ్చి ముదిరి
పాషాణమై మరుగుతోంది...
రాచరికపు నీచత్వం
యథేచ్ఛగా చూపుతోంది!

మెదడు లేని మూర్ఖులే
విగ్రహాలు కూల్చేది...
అదుపు లేని చేష్టలే
రేపు పుట్టి ముంచేది!

\- కొల్లూరు వెంకట్

సీపీఐ(ఎం) రాజకీయ ఎత్తుగడల విధానం

పార్టీ, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల పురోగమనానికి ఊతం

విశ్లేషణ



బి వి రాఘవులు

(నిన్నటి తరువాయి)

22వ మహాసభకు సమర్పించబోయే ప్రస్తుత ముసాయిదా రాజకీయ తీర్మానం ముందు భాగంలో పేర్కొన్న గుణపాఠాలను, కింద వివరించబడిన తక్షణ పరిస్థితులను గమనంలో ఉంచుకుని రూపొందించబడింది.

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన స్థానంలో వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల సంఘటన, తృతీయ ప్రత్యామ్నాయం, తృతీయ సంఘటన వంటి కర్తవ్యాలు అమలు చేయడానికి ప్రయత్నం చేయడం, బలమైన ప్రాంతీయ బూర్జువా పార్టీలతో నిరంతర సహచర్యం, కొన్నిసార్లు కాంగ్రెస్‌తో కూడా ఒడంబడికలకు, అవగాహనకు రావడం, యుపిఏ ప్రభుత్వాన్ని సమర్థించినప్పుడు స్వతంత్రంగా వ్యవహరించడంలో జరిగిన లోపాలు, ఎత్తుగడల విధానంలో పొరపాట్ల మూలంగా జరిగాయని, దీనివలన వామపక్ష శక్తుల పురోగమనానికి నష్టం జరిగిందని 21వ మహాసభ రాజకీయ ఎత్తుగడల సమీక్ష నిర్ధారించింది. ఎన్నికల ఎత్తుగడలపై కేంద్రీకరించినందున, దానిచుట్టూ పార్టీ కార్య కలాపాలు తిరిగినందున సరళీకరణకు వ్యతిరేకంగా జరగాల్సిన పోరాటం, సమగ్రంగా జరగాల్సిన మతోన్మాద వ్యతిరేక పోరాటం, నిరంతరం ప్రయత్నించాల్సిన వామపక్ష ప్రజాతంత్ర నిర్మాణం కర్తవ్యం అశ్రద్ధకు గురయ్యాయి. ఈ బలహీనత ఆఖరికి తక్షణ ఎన్నికల కర్తవ్యాలను నిర్వహించడానికి కూడా వామపక్షాలు అశక్తులయ్యే స్థితికి వచ్చింది. ఈ బలహీనతలు కేంద్ర కమిటీ రూపొందించిన ప్రస్తుత ముసాయిదా తీర్మానంలో పునరావృతం కాకుండా జాగ్రత్త వహించటం జరిగింది.

పరిస్థితులపై అంచనా

జాతీయ పరిస్థితిలో నాలుగు ముఖ్యాంశాలను తీర్మానం పేర్కొన్నది. (1) సరళీకరణ విధానాల అమలు వేగం, తీవ్రత, లోతు పెరిగింది. (2) హిందూత్వ మతోన్మాద చర్యలు తీవ్రమయ్యాయి. (3) పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనం చేసే ప్రయత్నాలు పెరిగాయి. (4) అమెరికాతో జూనియర్ భాగస్వామిగా వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన 10 నెలల తర్వాత జరిగిన 21వ పార్టీ మహాసభ రూపొందించిన రాజకీయ తీర్మానంలో గుర్తించిన ధోరణులన్నీ ఈ మూడు సంవత్సరాలలో మరింత తీవ్రరూపం దాల్చాయి. అధికారాన్ని ఉపయోగించుకుని సమాజంలోని అన్ని పార్శ్వాల్లోకి మతోన్మాదాన్ని వ్యాపింపజేసే ప్రయత్నం చేస్తున్నది.

మరోవైపు మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలకు, మతోన్మాద ఎజెండాకు, నిరంకుశ పోకడలకు ప్రతిఘటన కూడా ఈ కాలంలో పెరిగింది. కేంద్ర బీజేపీ విధానాలపై అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతున్నది. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలపై సైతం ప్రజలలో ప్రతికూలత పెరుగుతున్నది. బీజేపీ విధానాలను ప్రతిఘటించగలం అన్న విశ్వాసం రోజురోజుకూ పెరుగుతున్నది. రైతుల పోరాటాలు, దళితుల పోరాటాలు, కార్మిక ఉద్యమాలు, ఆదివాసీ ఆందోళనలు, విద్యార్థి ఆందోళనలు, కళాకారులు, మేధావుల నిరసనలు పెరిగాయి. అనేక ఐక్య వేదికలు ఏర్పడ్డాయి.

బీజేపీ మతోన్మాద శక్తులను నికరంగా ప్రతిఘటించే శక్తిగా వామపక్షాలు, ముఖ్యంగా సీపీఐ(ఎం)కు లౌకికవాదులలో ప్రతిష్ట పెరిగింది. మతోన్మాద సమస్యలపై పోరాటంలో కాంగ్రెస్ సాచివేతగా వ్యవహరిస్తున్నది. త్రిపురలో మొత్తం కాంగ్రెస్ ప్లేటు మార్చి బీజేపీ అవతారం ఎత్తింది. ప్రాంతీయ పార్టీలు అవకాశవాదంతో వ్యవహరిస్తున్నాయి. కేరళలో సీపీఐ(ఎం) ప్రాణాలొడ్డి హిందూత్వ మతోన్మాద శక్తులను ప్రతిఘటిస్తున్నది. హిందూత్వ మతోన్మాదులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పోరాడుతున్నందునే హిందూత్వ శక్తులకు, బడా బూర్జువా పాలక వర్గాలకు కాంగ్రెస్సో, ప్రాంతీయ పార్టీలో ప్రధాన ఆటంకాలుగా కనిపించడంలేదు. సీపీఐ(ఎం) కనిపిస్తున్నది. అందుకే దాని బలమైన కేంద్రాలను సైతం బలహీనపర్చేందుకు కుట్రలు చేస్తున్నాయి. అన్ని రకాల అక్రమాలకు పాల్పడి త్రిపురలో వామపక్షాలను దెబ్బతీయడానికి పూనుకుంది. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల బలాన్ని పెంచుకోవడమే ఈ కుట్రలను తిప్పికొట్టడానికి మార్గం. ఎన్నికల అవసరం పేరుతో వామపక్షాల శక్తిని బలహీనం చేసుకునే ఎత్తుగడలు అనుసరించి తక్షణ పరిస్థితుల్లో జోక్యం చేసుకునే శక్తిని కూడా కోల్పోయే స్థితిని తెచ్చుకోకూడదు.



> తక్షణ పరిస్థితుల్లో జోక్యం చేసుకోవడానికి తోడ్పడంతోపాటు, పార్టీ, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల పురోగమనానికి ఊతమిచ్చేట్లుగా ప్రస్తుత రాజకీయ తీర్మానం రూపొందించబడింది. సరళీకరణ విధానాలపై పోరాటాన్ని, మతోన్మాదాన్ని సమగ్రంగా ప్రతిఘటించడాన్ని, అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడాన్ని, అలాగే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణ కర్తవ్యాన్ని మేళవించి దిశానిర్దేశం చేయడం ప్రస్తుత రాజకీయ తీర్మానం ప్రత్యేకత.

ఇటువంటి పరిస్థితులలో వర్గ, రాజకీయ శక్తుల బలాబలాల మార్పు కోసం, బీజేపీ మతోన్మాద ప్రభుత్వాన్ని ఓడించడం కోసం అవసరమైన రాజకీయ విధానం రూపొందించుకోవడానికి వివిధ రాజకీయ పార్టీలు నిర్వహిస్తున్న వర్గ పాత్రపై అంచనా, వాటితో మనం వ్యవహరించాల్సిన వైఖరిపై స్పష్టత అవసరం. వివిధ పార్టీలకు సంబంధించి రాజకీయ తీర్మానం కింది విధంగా అంచనా వేసింది.

బీజేపీ

బీజేపీ భారత పాలకవర్గాల ప్రధాన పార్టీగా ఆవిర్భవించింది. బీజేపీ అధికారానికి వచ్చిన తర్వాత సరళీకరణ విధానాలను ఉధృతంగా అమలు జరుపుతున్నది. అందుకే దేశంలోని బడా బూర్జువా వర్గం సరళీకరణ విధానాలను ఇంకా ముందుకు తీసుకెళ్ళడం కోసం బీజేపీ వెనక సమీకరించబడింది. పూర్తి మెజారిటీతో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు మన ప్రధాన దాడి దానిపైనే ఎక్కుపెట్టాలి. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజానీకాన్ని విస్తృతంగా సమీకరించేందుకు, లౌకిక ప్రజాస్వామిక శక్తుల విశాల ఐక్యతను సాధించేందుకు ఉమ్మడి వేదికల్లోకి సమీకరించాలి. అయితే, ఈ వేదికలు ఎన్నికల పొత్తులకు, అవగాహనలకు ప్రాతిపదికగా పరిగణించకూడదు.

కాంగ్రెస్

కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒకే వర్గ స్వభావం కలిగిఉన్నాయి. బడా బూర్జువా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేవి. కాంగ్రెస్ లౌకిక పార్టీగా చెప్పుకుంటూ కూడా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నికరంగా, నిలకడగా పోరాడటంలేదు. సరళీకరణ విధానాలను భుజానికెత్తుకోవడంలోనూ, అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడంలో ఆద్యురాలిగా ఉండటమే కాక వాటిని కొనసాగిస్తూనే ఉన్నది. సరళీకరణ విధానాలు కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. అది అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఆ విధానాలు అమలుచేస్తున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా అన్ని కీలక సందర్భాల్లో సరళీకరణ విధానాలను అమలు జరపడంలో బీజేపీకి మద్దతుగా నిలబడింది. తమ విధానాలనే బీజేపీ కొనసాగిస్తున్నదని దెప్పిపొడుస్తున్నది.

ఇటువంటి బడా బూర్జువా పార్టీని ఐక్య సంఘటనలో భాగస్వామిగాను, మిత్రునిగాను పరిగణించలేము. అయితే నేడు సంఘపరివార్‌తో లింకు ఉన్న బీజేపీ అధికారంలో ఉండి ప్రధాన ప్రమాదకారిగా ఉన్నందున, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌ను, బీజేపీని ఒకే గాట కట్టకూడదు.

పార్లమెంటులో అంగీకృత సమస్యలపై కాంగ్రెస్‌తో సహా అన్ని లౌకిక, ప్రతిపక్ష పార్టీలతో సహకరించే వైఖరి అవలంబించాలి. పార్లమెంటు బయట కూడా మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా సమీకరణ కోసం అన్ని లౌకిక ప్రతిపక్ష శక్తులతో సహకరించాలి. అలాగే వర్గ, ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణను కాంగ్రెస్‌తో సహా అన్ని బూర్జువా పార్టీల వెనకున్న ప్రజలను రాబట్టుకునే పద్ధతిలో అభివృద్ధి చెయ్యాలి. అయితే, ఈ కృషి కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తు లేదా అవగాహన అన్న దృష్టితో జరగకూడదు.

ప్రాంతీయ పార్టీలు

ప్రాంతీయ పార్టీలు ప్రాంతీయ బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా బడా బూర్జువా పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌తో కొన్ని వైరుధ్యాలున్నా తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సరళీకరణ విధానాలనే అమలు చేస్తున్నాయి. బీజేపీ మతోన్మాదం పట్ల అవకాశవాదంగా వ్యవహరిస్తున్నాయి. అయితే అన్ని పార్టీలు ఒకేరకంగా లేవు. ప్రాంతీయ పార్టీలు బలంలోను, సామాజిక, వర్గ ప్రాతినిధ్యంలోను ఎంతో వైవిధ్యం కలిగి ఉన్నాయి. అందువలన వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు నిర్వహిస్తున్న పాత్రను దృష్టిలో ఉంచుకుని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల పురోగమనాన్ని గమనంలో ఉంచుకుని, వాటితో మనం వ్యవహరించాల్సిన ఎత్తుగడలను నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

రాజకీయ ఎత్తుగడల విధానంలో ముఖ్యమైన అంశాలు

ప్రస్తుత రాజకీయ పరిస్థితి, వివిధ పార్టీలు నిర్వహిస్తున్న పాత్ర వంటి అంశాలన్నింటిని కేంద్ర కమిటీ పరిగణనలోకి తీసుకుని పార్టీ, ప్రజా ఉద్యమం పురోగమించేందుకు తోడ్పడే రాజకీయ విధానాన్ని రూపొందించింది. మతోన్మాద, నిరంకుశ, అభివృద్ధి నిరోధక మోడీ ప్రభుత్వాన్ని ప్రతిఘటించడం, ఓడించడం పార్టీ ముందున్న కర్తవ్యం అని పేర్కొన్నది. ఈ తక్షణ కర్తవ్యాన్ని ప్రజా పోరాటాలతో వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలపర్చుకునే కర్తవ్యాన్ని మేళవించి ముందుకు తీసుకుపోయే విధంగా రాజకీయ ఎత్తుగడల విధానం రూపొందించింది.

రాజకీయ విధానాన్ని కిందివిధంగా పేర్కొన్నది.

1) కేంద్ర బీజేపీ ప్రభుత్వం, కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలతో సహా ఇతర పార్టీలు నడిపే రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఐక్య కార్యాచరణ అభివృద్ధి చెయ్యాలి. అన్ని స్థాయిల్లోను ప్రజా ఉద్యమాలను, ఐక్య పోరాటాలను అభివృద్ధి చేసేందుకు ఉమ్మడి వేదికలను నిర్మించాలి. తద్వారా బూర్జువా పార్టీల వెనకున్న ప్రజలను కూడా సమీకరించేందుకు ప్రయత్నించాలి.

2) ప్రభుత్వంలోనూ, బయట ఉన్న హిందూత్వ శక్తుల ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు లౌకిక ప్రజాతంత్ర శక్తులను విశాల ప్రాతిపదికపై సమీకరించాలి, వేదికలను నిర్మించాలి. మతోన్మాద, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం క్షేత్రస్థాయి సమీకరణపై కేంద్రీకరించాలి. అయితే ఈ వేదికలను రాజకీయ లేక ఎన్నికల కలయికగా చూడరాదు.

3) పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడానికి, వామపక్ష ఐక్యతను బలపర్చడానికి, విస్తృతపర్చడానికి ప్రాధాన్యతనివ్వాలి. అన్ని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను నిర్దిష్ట కార్యక్రమం ప్రాతిపదికపై ఉమ్మడి ఉద్యమాలలోకి, పోరాటాలలోకి సమీకరించాలి. ఈ శక్తులను రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా ఐక్యం చేసేందుకు కృషి చేయాలి. అఖిల భారత స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సంఘటన నిర్మాణానికి నిరంతరాయంగా ప్రయత్నించాలి.

4) ఎన్నికల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలు కూడా రాజకీయ ఎత్తుగడల విధానంలో ఒక ముఖ్యమైన అంతర్భాగం. హిందూత్వ మతోన్మాద శక్తులను బలహీనపర్చేందుకు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు బీజేపీ ప్రభుత్వాన్ని, దాని మిత్రులను ఓడించడం అవసరం. ఇందుకోసం బీజేపీ వ్యతిరేక ఓట్లను గరిష్ట స్థాయిలో సమీకరించేందుకు పైన వివరించిన రాజకీయ అవగాహనకు లోబడి ఎన్నికల ఎత్తుగడలను అనుసరించాలి. అయితే కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు గానీ, అవగాహన గానీ లేకుండా ఈ కృషి జరగాలి.

ముగింపు

తక్షణ పరిస్థితుల్లో జోక్యం చేసుకోవడానికి తోడ్పడంతోపాటు, పార్టీ, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల పురోగమనానికి ఊతమిచ్చేట్లుగా ప్రస్తుత రాజకీయ తీర్మానం రూపొందించబడింది. సరళీకరణ విధానాలపై పోరాటాన్ని, మతోన్మాదాన్ని సమగ్రంగా ప్రతిఘటించడాన్ని, అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడాన్ని, అలాగే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణ కర్తవ్యాన్ని మేళవించి దిశానిర్దేశం చేయడం ప్రస్తుత రాజకీయ తీర్మానం ప్రత్యేకత.

జన వాక్యం

తారాజకీయం

సినీ నటులు రాజకీయాల్లోకి రావడం సాధారణమే. ఒకప్పుడు సీనియర్ నటులే రాజకీయాల్లోకి వచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమ నుండి యువకులతో పాటు సీనియర్ నటులు కూడా రాజకీయ ప్రవేశానికి సిద్ధమయ్యారు. విశాల్, విజయ్, కమల్‌హాసన్, రజనీకాంత్... రాజకీయాల్లోకి రావడం హర్షించదగ్గదే. అయితే వీరు ఎంతవరకు నిలదొక్కుకుంటారో చూడాలి. వీరందరిలోకి కమల్ హాసన్ వంటి ముక్కుసూటి మనిషి, అభ్యుదయ భావాలున్న వ్యక్తి, రోజుకో మాట, పూటకో వేషం మార్చే రాజకీయాల్లో ఎలా నెట్టుకొస్తారో అన్న సందేహం సాధారణ ప్రజానీకానికి కలుగుతోంది. అయితే కమల్ రాజకీయ పార్టీ పెట్టే ముందే చిత్రసీమకు దూరమవుతానని ప్రకటించారు. దీంతో ఎంతో ఆవేదన చెందిన అభిమానులు కమల్ తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని కోరుకుంటున్నారు.

పి అరుణ, రాజమండ్రి.
ఆర్ ప్రభావతి, ధవళేశ్వరం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

'పోలవరం'లో బాబు లొంగుబాటు దేనికి?

నోట్




ఎం కృష్ణమూర్తి

పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు 2019కి పూర్తి చేస్తామని 2018 జనవరి 18-19 తేదీల్లో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో 50 శాతం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని తెలిపింది. కుడి కాలువ 91 శాతం, ఎడమ కాలువ 50 శాతం, రిజర్వాయర్ పనులు 34 శాతం పూర్తయ్యాయని వివరాలు ఇచ్చింది. 2013-14 ధరల్లో ప్రాజక్టు వ్యయం రూ.58,319 కోట్లకు సవరించిన వివరాలను కూడా నివేదికలో పొందుపరచింది. ఇంతవరకు రూ.12,335.99 కోట్లు ఖర్చు చేశామని, జాతీయ ప్రాజక్టుగా ప్రకటించిన తరువాత చేసిన రూ.7,200.12 కోట్లు ఖర్చుల వివరాలను ఇచ్చింది. 2018 జూన్ నాటికే తొలి దశ పూర్తి చేసి ఆయకట్టుకు నీరిస్తామని ఆ నివేదికలో తెలియజేసింది.

2005లో పోలవరం ప్రాజక్టు నిర్మాణం పనులు ప్రారంభించారు. గడిచిన 13 సంవత్సరాలలో ప్రాజక్టు నిర్మాణం 50 శాతం జరిగింది. వచ్చే ఒకటిన్నర సంవత్సరాల్లో మిగిలిన 50 శాతం పనులు పూర్తి చేయడం సాధ్యమా? ఒరిస్సా, చత్తీస్‌గఢ్, తెలంగాణ అంతర్‌రాష్ట్ర సమస్యల్ని పక్కన పెట్టినా కేంద్ర ప్రభుత్వ వైఖరి ప్రాజక్టుకు అడ్డంకిగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రాజక్టు నిర్మాణం ప్రభుత్వం ప్రకటించిన సమయానికి పూర్తవుతుందా? అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

15.03.2017న జరిగిన కేంద్ర కేబినెట్ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మూడు ముఖ్యమైన నిర్ణయాలు చేసింది. 1) రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నందున పోలవరం ప్రాజక్టు పనులు కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణకు అంగీకారం తెలిపింది. 2) 01.04.2014 నాటికి ఇరిగేషన్ కాంపోనెంట్‌కు మాత్రమే కేంద్ర ప్రభుత్వం 100 శాతం నిధులు ఇస్తుందని కేబినెట్ నిర్ణయించింది. 3) 01.04.2014కి ముందు రాష్ట్రం చేసిన ఖర్చుకు కేంద్రానికి సంబంధం లేదని, 01.04.2014 నాటి అంచనా వ్యయం మాత్రమే చెల్లిస్తామని, ఆ తరువాత పెరిగిన ధరల్లో ఖర్చుకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదని తేల్చింది. పైమూడు నిర్ణయాలతో పాటు ప్రాజక్టు నిర్మాణానికి 2016-17లో రూ 2,414.70 కోట్లు, 2017-18 లో రూ 3,400 కోట్లు, 2018-19లో రూ 9,000 కోట్లు, 2019-20లో రూ 9,000 కోట్లు మొత్తం రూ 23,814.70 కోట్లు నాబార్డు నుండి విడుదల చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది.



ఆ నిర్ణయం మేరకు ఇంతవరకు జరిగిన ఖర్చులో రూ. 4,329 కోట్లు కేంద్రం ఇచ్చిందని మిగిలిన రూ. 3,102 కోట్లను త్వరగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. సవరించిన అంచనాలను త్వరగా ఆమోదించమని కూడా కోరింది. అయితే 2013 చట్ట ప్రకారం భూసేకరణ, పునరావాసం, పున:పరిష్కా రానికి అయ్యే ఖర్చు కూడా కేంద్రమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు ఎక్కడా లేదు.

అసలు సమస్య ఇక్కడే ఉత్పన్నం అవుతున్నది. 01.04.2014 తరువాత పెరిగిన ప్రాజక్టు వ్యయంతో మాకు ఎటువంటి సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పేసింది. కేంద్రంతో వచ్చిన చిక్కుల వలన గత 6 నెలలుగా ప్రాజక్టు పనులు ఆగిపోయాయి. కనుక ప్రభుత్వం ప్రకటించినట్లు 2019 జూన్ నాటికి ప్రాజక్టు పూర్తయ్యే అవకాశం లేదు. మరికొంత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. 01.04.2014 తరువాత కూడా ధరల పెరుగుదల వలన ప్రాజక్టు వ్యయం పెరుగుతుంది. ఆ పెరిగిన వ్యయం రాష్ట్రమే భరించాలి. మరోవైపున భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, పున:పరిష్కారంకు అయ్యే రూ. 34,000 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. ఇంత పెద్ద మొత్తంలో ఒక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నుండి కేటాయించగలదా? కేంద్రం ఇవ్వాల్సిన ఈ నిధుల భారం రాష్ట్ర ప్రజలపైన నెట్టేయడం సమంజసమేనా?

2014 ఎపి పున:విభజన చట్టం సెక్షన్ 90లో 1) పోలవరం సాగునీటి ప్రాజక్టును జాతీయ ప్రాజక్టుగా ప్రకటించారు. 2) ప్రజా ప్రయోజనాల రీత్యా పోలవరం ప్రాజక్టు అభివృద్ధిని కేంద్రం వేగవంతం చేస్తుంది. 3) పోలవరంకు అవసరమైన భూభాగాన్ని తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేస్తుంది. 4) కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రాజక్టుకు అవసరమైన పర్యావరణం, అటవీశాఖ అనుమతులు, పునరావాసం, పున:పరిష్కారం చేయబడతాయి. చట్టంలో ఇంత స్పష్టంగా పొందుపర్చడమే గాక 01.05.2014న కేంద్ర కేబినెట్ నిర్ణయం ప్రకారం ప్రస్తుతం ఉన్న రూ.16,010.45 కోట్లు అంచనా వ్యయం రాబోయే కాలంలో ధరల పెరుగుదల కారణంగా పెరగవచ్చు. ఆ విధంగా పెరిగిన వ్యయంతోపాటు 2013 చట్ట ప్రకారం భూసేకరణకు, పునరావాసానికి, పున:పరిష్కారానికి అయ్యే మొత్తం ఖర్చును కేంద్రమే భరిస్తుందని స్పష్టంగా నిర్ణయించింది.

ఇంత స్పష్టంగా విభజన చట్టం, కేంద్ర కేబినెట్ నిర్ణయాలు ఉండగా 01.04.2014 తరువాత పెరిగిన వ్యయాన్ని గాని, భూసేకరణతో సహా పునరావాసానికి అయ్యే భారీ వ్యయంగాని కేంద్రం ఇవ్వను పొమ్మంటే చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు అంగీకరించింది? కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఇంత ద్రోహానికి ఒడిగడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆ వాస్తవాలు తెలియకుండా ఎందుకు దాచిపెట్టింది? ఇందులో ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా? లేదా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారా? అన్న సందేహాలను చంద్రబాబు నివృత్తి చేయాలి.

..... నిర్వాసితులు జల సమాధే!

జనవరి 18-19 కలెక్టర్ల కాన్ఫరెన్సుకు చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో పోలవరం ప్రాజక్టులో కూనవరం, వి.ఆర్.పురం, చింతూరు, దేవీపట్నం మండలాల్లో 234 గ్రామాల్లో 70,929 కుటుంబాలు నిర్వాసితులవుతాయి. ఇంతవరకు ఇందులో 6 గ్రామాల్లో 1485 కుటుంబాల పునరావాసానికి రూ. 40.65 కోట్లు ఖర్చు పెట్టినట్లు లెక్క చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పోలవరం, కుకనూరు, కనీరుపాడు మండలాల్లో 137 గ్రామాల్లో 34,672 కుటుంబాలు నిర్వాసితులవుతాయి. ఇంత వరకు అందులో 8 గ్రామాల్లో 2584 కుటుంబాలకు రూ.380.21 కోట్లు ఖర్చు చేసి పునరావాసం కల్పించినట్లు వివరాలు ఇచ్చింది. మొత్తం పోలవరంలో 8 మండలాల పరిధిలో 371 గ్రామాలు ముంపుకు గురౌతాయి. ఈ గ్రామాల్లో 105601 కుటుంబాలు నిర్వాసితులవు తాయి. ఇంతవరకు 14 గ్రామాల్లో 4069 కుటుంబాలకు రూ 420.69 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం నిర్వాసితుల్లో 3.8 శాతానికే పునరావాసం పూర్తయింది. 3.77 శాతం గ్రామాలకే పున:నిర్మాణం జరిగింది. 1.25 శాతం ఖర్చు చేశారు. 13 ఏళ్ళలో జరిగిన పునరావాసం తీరిది.

మరో 15 నెలల్లో 357 గ్రామాల్లో (96.33 శాతం) లక్ష పైన (96.22 శాతం) కుటుంబాల పునరావాసానికి రూ 33,600 కోట్లు (98.75 శాతం) ఖర్చు చేయటం సాధ్యమేనా? ఈ ప్రశ్నకు సాధ్యం కాదనే సమాధానం వస్తుంది. ప్రాజెక్టు నిర్మాణానికి 10 రెట్లు సిబ్బంది పునరావాసానికి కావాలి. సమయం కూడా ఎక్కువే పడుతుంది. గ్రామానికి గ్రామమే పున:నిర్మాణం చేయాలి. నిర్వాసిత కుటుంబాలన్నింటికి ఇళ్ళు కట్టి ఇవ్వాలి. పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. అందుకు అవసరమైన భూసేకరణే ఇంతవరకు జరగలేదు. గిరిజనులందరికీ భూమికి భూమి ఇవ్వాలి. దాదాపు లక్ష ఎకరాలు భూమిని సేకరించి ఇవ్వాలి. ఇంత వరకు 4 శాతం కూడా పునరావాసం పనులు జరగలేదు. ఇంత పని జరగాలంటే పునరావాసం కోసమే సిబ్బంది ఉండాలి. కానీ ఇంత భారీ ప్రాజక్టుకు ప్రత్యేకంగా సిబ్బంది లేదు. వారం వారం ప్రాజెక్టు పనులను సమీక్షిస్తున్న ముఖ్యమంత్రికి నిర్వాసితుల పునరావాసం సమీక్షకి నిమిషం కూడా తీరిక దొరకటం లేదు. నిర్వాసితుల పునరావాసం పట్ల ప్రభుత్వ నిబద్ధత ఎంతో దీన్నిబట్టి అర్థం చేసుకోగలరు.

2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, 2013 చట్ట ప్రకారం భూసేకరణకు, పునరావాసానికి, పున:పరిష్కారానికి అయ్యే మొత్తం ఖర్చు కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంది. చంద్రబాబు తన సొంత ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోవడంతో రాష్ట్ర ప్రజలకు, నిర్వాసితులకు ద్రోహం చేస్తున్నారు. కావున ప్రాజక్టు ఖర్చంతా ఇవ్వాల్సిందేనని పోలవరం ఆయకట్టు రైతులు- నిర్వాసితులు, రాష్ట్ర ప్రజలంతా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలి. చంద్రబాబు లొంగుబాటును ఖండించాలి. లేకుంటే ప్రాజక్టు నిర్మాణం సకాలంలో జరగదు. ప్రాజక్టు నిర్మాణం జరిగినా నిర్వాసితుల జల సమాధి ఖాయం. లక్షల నిర్వాసిత ప్రజల రక్షణకు, రాష్ట్ర ప్రయోజనాల కోసం మోడీ, బాబుల దుష్ట రాజకీయాలపై అలుపెరుగని పోరాటమే సరైన మార్గం.

(రచయిత సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు)



ఆమెను నిర్ణయించుకోనివ్వండి!

మహిళోదయం 7

'ఎక్కడమ్మా నీవు లేనిది.. ఏమిటీ నువ్వు చేయలేనిది..?'...

'ఏం తక్కువమ్మా నీకు రాజ్యమేలనూ..?' అని ప్రశ్నించాడో అభ్యుదయకవి. మహిళాసంఘాలు కోరుకునేది ఇదే. కానీ నేటికీ స్త్రీకి నిర్ణయాధికారంలో చోటులేదు. 'ఊరందరికీ మా అయ్య బానిసైతే... పాపం అమ్మ మా అయ్యకు్కూడా బానిసే' అని అన్నాడో దళితకవి. ఇంకా అక్కడే ఉండిపోయాం. వేయాల్సిన తొలి అడుగు, ఇప్పటికీ వేయాల్సిన అడుగులానే మిగిలిపోయింది. మహిళలకు ఆకాశంలో సగమనే రంగుపూసి, ఈ రోజుకీ చిన్నచిన్న నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛనివ్వని తంతు దేశపు వీధివీధుల్లోనూ కనిపిస్తూనే ఉంది. మీరు వెయ్యి గడపలు తాకి చూడండి... ఏవో కొన్ని ఇళ్ళల్లో తప్ప మిగతా అన్నిచోట్లా స్త్రీ మానసాన్ని గాయం చేస్తున్న పురుషాధిక్యత నీడలే కనిపిస్తాయి.

మాటలను దాటి, నిజజీవితాల్లోకొచ్చి చూస్తే, మనమెన్నో కితాబులిస్తున్న మహిళపాత్ర నిర్ణయాధికారంలో శూన్యంగానే కనిపిస్తుంది. మహిళా స్వేచ్ఛా, సాధికారతా, నిర్ణయాధికారమూ అన్నీ తెలుగు నవలల్లోని పాత్రల దగ్గరే ఆగిపోయాయి. ఒక్కొక్కరి జీవితాన్నీ తడిమి చూస్తే, మూసుకుపోయిన బతుకు పుస్తకాలను తెరిచి చూస్తే నిలువెత్తు నిరాశే మిగులుతుంది. ఇప్పుడో అడుగుపడాలి. నిర్ణయాలు తీసుకునే అవకాశంలో సగభాగం ఆమెకూ ఇవ్వాలి. ఆమె ఇష్టాలను తెలుసుకోవాలి. ఆమెను ఆమెలానే బతకనిచ్చేందుకు... సామూహికంగా ఇప్పుడో అడుగువేయాలి.


ఓ మధ్యతరగతి సుశీల



సుశీల ఒక మధ్యతరగతి గృహిణి. తనంటే కూతురికిష్టం. కొడుక్కిష్టం. భర్తకిష్టం. అత్తమామలకూ ఇష్టం. వాళ్లందరూ సుశీలకు అంతకు పదింతల ఇష్టం. కానీ సుశీల ఇష్టాల గురించి ఎవరూ పట్టించుకోరు సరికదా, తెలుసుకునే ప్రయత్నమూ చేయరు. పొద్దున్నే చిన్నోడికి ఇష్టమైన స్నాక్స్‌తో కలిపి లంచ్‌బాక్స్ రెడీ చేయాలి. ఈ మధ్య పెద్దమ్మాయి నీరసంగా ఉంటుంది. ఈసారి హాస్టల్‌కి పంపేప్పుడు నేతిసున్నుండులూ, బాదంపిస్తాలిచ్చి పంపాలి. శ్రీవారికసలే కోపమెక్కువ. టక్కున అలారం మోగినట్టు ఠంచనుగా సమయానికి అన్నీ సమకూర్చాలి. అత్తామామలకు బీపీ, షుగరూ... ఉప్పూ, కారాలు ఒకటికి పదిసార్లు చూసుకోవాలి. లేదంటే కోడలుగా అప్రదిష్ట మూట కట్టుకోవాల్సిందే.

ఇలా ఎంతమంది సుశీలలున్నారో? అన్నేళ్ల గృహిణి జీవితంలో సరిగ్గా తమకు అనిపించిన రోజు, ఇష్టమైన కూరతో భోజనం చేయని సుశీలలు లేని ఇళ్లను వేళ్లతో లెక్కపెట్టొచ్చేమో. అమ్మ అయినందుకు పిల్లల్ని గారాం చేసి, ఇష్టమైన ఆహారాన్ని అందివ్వాలి. భర్తకు చాకిరీ చేయాలి. అత్తమామలకు నచ్చినవే వండివార్చాలి. వీటన్నింటి కోసమూ తన ఇష్టాలను ఒక్కొక్కటిగా చంపుకోవాలి. చిన్నచిన్న నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని క్రమక్రమంగా కోల్పోవాలి.

కొత్తగా పెళ్లయిన అనుపమ



అనుపమకు కొత్తగా పెళ్లయింది. ఇద్దరూ ప్రేమించే పెళ్లిచేసుకున్నారు. ఒకటే కులం, ఒకే ఆఫీసులో పని. ఆర్థికంగానూ అటూఇటూగా సమానస్థాయే అవ్వడంతో పెద్దగా కష్టం లేకుండానే కార్యం గడిచిపోయింది. తర్వాత జీవితం గురించి ఎన్నెన్నో ఆశలగూళ్లు కట్టుకుంది. ప్రేమించి చేసుకున్న పెళ్లి కదా.. అంతా బావుంటదనే అనుకుంది. ఎన్నో కథల్లో విన్నట్టుగానే, ఇక్కడా ఎక్కువ సమయం పట్టలేదు. తన స్థానం తనకు అర్థమైపోయింది. కొత్తగా ఇల్లు తీసుకోవాలి, మిక్సీకొనాలి, ఎల్‌ఈడీ కొనాలి, ఏసీ కొనాలి, శనివారం సాయంత్రం సినిమాకెళ్లాలి... కొనాల్సితే ఉందికానీ, ఏం కొనాలి? ఎలాంటిది కొనాలి? ఎప్పుడు కొనాలి? ఏ ఏరియాలో కొనాలి? డబుల్ బెడ్‌రూమా..? ట్రిపుల్ బెడ్‌రూమా..? పద్మావతి సినిమాకా? భాగమతి సినిమాకా? ఇలా వేటిలోనూ తన నిర్ణయం లేదు.

ఒకరి నిర్ణయానికి తను కట్టుబడి ఉండాలి. ముందే తీసుకున్న నిర్ణయంలో తన కోర్కెలను వెతుక్కోవాలి. ఒక్కసారి వెళ్లి ఉద్యోగస్తుల అపార్టుమెంట్లను కదిలించి చూడండి. గుట్టలగుట్టల అనుపమలు కనబడతారు. బిడ్డను మోస్తూ, ఏవో పేర్లు పెట్టాలనీ, ముద్దపేర్లనీ రకరకాల కలలు కంటారు. అవీ అంతే, కొన్నాళ్లకు ఆవిరయ్యేవే. భర్తకు నచ్చిందో, అత్తింటి నుంచీ వచ్చిన ఆజ్ఞో, ఆ అమ్మాయి కలల్లోకి చొరబడుతుంది. తన ఆశలను ఎత్తుకుపోతుంది. చివరికి తన నిర్ణయాధికారాన్నీ ఎగరేసుకుపోతుంది.

వార్డ్ కౌన్సిలర్ స్వర్ణ



స్వర్ణ ఆ కాలనీలో అందరికీ తెలిసినావిడే. బాగా కలుపుగోలు మనిషి. కౌన్సిలర్‌గా పోటీ చేయడానికీ, వార్డులోని సమస్యల పరిష్కారానికీ కృషి చేసేందుకు అన్నివిధాలా సమర్థురాలు. బాగా చదువుకుంది. రాష్ట్ర, దేశ రాజకీయాల మీద మంచి అవగాహన ఉంది. ఆమెకున్న అర్హతల్లో సగం కూడా లేకున్నా, ఎప్పుడూ తన భర్తే వార్డు కౌన్సిలర్‌గా పోటీచేస్తాడు. గెలిచాక, భార్య నుంచి చిన్నచిన్న సలహాలు తీసుకోవడానికి నామోషీ. భార్య తనకన్నా సమర్థవంతురాలనీ, ఆధునికంగా ఆలోచించగలదనీ తెలుసు. అయినా పురుషాధిక్యత అడ్డుపడుతుంది. కాలం ఒకేలా ఉండదు కదా! ఓ సారి ఆ వార్డుని మహిళలకు కేటాయించారు. స్వర్ణే పోటీ చేసింది. అనుకున్నట్టుగానే విజయమూ సాధించింది. గెలవటమయితే గెలిచింది కానీ, ఒక డమ్మీ అభ్యర్థిగా మిగిలిపోయింది.

కాలనీలో తోరణాలు కట్టాలన్నా, పంపుసెట్టు బిగించాలన్నా, కూడల్లో బెంచీలు వేయాలన్నా,... ఇలా ఏ పనైనా నిర్ణయం సదరు భర్తగారే తీసుకోవాలి. పనులన్నీ ఆయన ద్వారానే జరగాలి. అవకాశం ఉంది, పనులు జరిపించగల స్థాయి ఉంది, సరిపోను తెలివితేటలూ ఉన్నాయి. కానీ నిర్ణయాధికారం మాత్రం ఆమెకు లేదు. మహిళలు పోటీ చేస్తున్న వార్డుల్లో నూటికి 95 మంది స్వర్ణలే ఉంటున్నారు.

బైపీసీ కీర్తి



కీర్తి చాలా తెలివిగల అమ్మాయి. స్కూల్లో ఉన్నప్పుడు ముందు తరగతి లెక్కలు కూడా చకాచకా చేసేది. లెక్కలంటే తనకు అమితమైన ఇష్టం. చిన్నప్పటి నుంచీ ఐఐటి చేయాలని కలలు కంది. కానీ కలలను కనాల్సింది తను కాదని తెలియడానికి ఎన్నో ఏళ్లు పట్టలేదు. ఇంటర్మీడియట్‌లో కుటుంబసభ్యుల ఒత్తిడితో తప్పక బైపీసీ తీసుకోవాల్సి వచ్చింది. ఇష్టంలేని చదువూ, అందులోనూ హాస్టల్.. ఆ జైలు జీవితం భరించలేకపోయింది. తీవ్రమైన ఒత్తిడిలోకి కూరుకుపోయింది.

ఇక చదువేం చదువుతుంది? కలలన్నీ కూలిపోయాక, నాలుగడుగులు ఎట్లా వేస్తుంది? అంత చలాకీ గల అమ్మాయి, తెలివైన అమ్మాయి, ఎంతో చురుకైన అమ్మాయి... ఇప్పుడు బొమ్మలా మారిపోయింది. అత్తెసరు మార్కులతో బైపీసీ పాసైంది. ఎంసెట్‌లో క్వాలిఫై మార్కుల కంటే రెండోమూడో తక్కువే వచ్చాయి. కొన్ని నెలలకు కోలుకుంది. ఫార్మసీ కాలేజీలో చేరి, మళ్లీ పాత చలాకీ అమ్మాయిగా మారబోతుంది. ఈసారి పెళ్లిరూపంలో మరోదెబ్బ ఎదురైంది. ఇష్టంలేని పెళ్లి, ఇష్టంలేని వ్యక్తితో పెళ్లి, ఇష్టంలేని సమయంలో పెళ్లి. చదువో, పెళ్లో ఏదైతే నేం? ఇంటింటిలోనూ ఇలాంటి కీర్తులు కోకొల్లలుగా ఉన్నారు. ఎవరో కన్న కలల్లో ఇప్పటికీ ప్రయాణిస్తూనే ఉన్నారు.

ఇదీ మన సమాజంలో సగటు స్త్రీ పాత్ర. మీకంతా అర్థమైపోతోంది కదా... జరుగుతున్నదాంట్లో రహస్యమేమీ లేదు... బహిరంగంగా బహుముఖంగా.. అందరికీ.. అందరిలో కనపడుతున్న చిత్రమే కదా.. శోకసముద్రం కదా... కల్లబొల్లి మాటలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయమిది. ఈ రోజే ఆమె ఇష్టాలను అడగండి. ఆమెను నిర్ణయించుకోనివ్వండి. ఆమె ఆ అధికారాన్ని చాలా విచక్షణతో ఉపయోగించుకోగలదు. అందులో ఎలాంటి సందేహమూ లేదు. అందరి కోసమూ ఆమె నిలబడ్డట్టే... ఆమె కోసమూ అందరం నిలబడదాం.. మనషులున్నారనీ.. మనిషితనం ఉందనీ.. స్త్రీ సాధికారతకు బాట వేద్దాం.

- సిద్ధార్థ కట్టా

ధైర్యమే ఆయుధంగా..



ఒకవైపు క్రూరమృగాలు, మరోవైపు అడవి దొంగలు.. పగలు, రాత్రి తేడాలేకుండా ఉద్యోగం చేయాలి. అడవిలో బీట్ ఫారెస్ట్ ఆఫీసరుగా చేయడం అంటే అషామాషీ కాదు. ఈ ఉద్యోగాన్ని మగవాళ్లు కూడా రిస్క్‌గా భావిస్తారు. అలాంటి ఉద్యోగంలో ఇద్దరు నారీమణులు ధైర్యమే ఆయుధంగా పనిచేస్తున్నారు.

కేరళలోని మరయూర్ అటవీ ప్రాంతం దాదాపు 600 హెక్టార్లు ఉంటుంది. ఈ అడవిలో ఎంతో విలువైన చందనం చెట్లు ఉన్నాయి. ఇక్కడ మనుషులపై దాడి చేసే క్రూరమృగాలు, చందనపు చెట్ల కోసం ఎదురుదాడి చేసే దొంగలూ ఉంటారు. అలాంటి ఈ అటవీప్రాంతంలో ఎలాంటి భయం లేకుండా బీట్ ఫారెస్ట్ ఆఫీసర్లు (బీఎఫ్ఓ)గా కేరళకు చెందిన అతిర పి.విజయన్, పీఎస్ శ్రీదేవి విధులు నిర్వర్తిస్తున్నారు. మొదటి మహిళా బీట్ ఫారెస్ట్ అధికారులుగా కూడా వీరే. వీరిద్దరు ఇంజనీరింగ్ చదివిన వారు. పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతోనే ఈ ఉద్యోగంలో చేరినట్లు వారు చెబుతారు. వీరు సమాజ సేవకడుకత్తర డివిజన్‌లోని నచివాయల్ ఫారెస్ట్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఎంతో కష్టతరమైన ఈ ఉద్యోగంను పగలు, రాత్రి తేడా లేకుండా ఎంతో కష్టపడి అడవిని రక్షిస్తున్నారు. జీవితంలో సవాళ్లను అధిగమించకపోతే ఎలా అని చెబుతున్నారీ నారీమణులు.

★

సౌర వెలుగులు నింపింది..!



చాలామంది వారి పిల్లల భవిష్యత్ బాగుండాలని పల్లెల నుంచి పట్టణాలకు వలస వెళ్తుంటారు. అయితే ఉన్నత చదువులు చదివిన ఆమె మాత్రం పట్టణం నుంచి పల్లెకు పయనమైంది. ఎందుకో తెలుసా?..ఆమె పేరు పాలక్ అగర్వాల్.

ఢిల్లీకి చెందిన ఆమె 2011లో టీఈఆర్ఐ యూనివర్సీలో పీజీ చేసింది. ఆ సమయంలో పున రుత్పాదక శక్తిపై సామాజిక, ఆర్థిక అవగాహన-ప్రభావం అనే అంశంపై ఫీల్డ్ వర్క్‌కు ఒడిశాలోని కలహండి గ్రామానికి వెళ్లింది. కలహండి చుట్టుపక్కల కనీసం కరెంట్ సౌకర్యం కూడా లేని గ్రామాలను, రేయింబవళ్లూ వారు పడుతున్న ఇబ్బందులను చూసి చలించింది. పాస్‌ఫొటో దిగాలంటేనే 30 కిలోమీటర్లు వెళ్లాల్సిన వారి దయనీయ పరిస్థితిపై జాలి పడింది. ఎలాగైనా వారి జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా. 2013లో ఢిల్లీని వదిలిని ఒడిశాలోని మారుమూల కలహండి ప్రాంతానికి ప్రయాణమైంది పాలక్ అగర్వాల్. అక్కడికెళ్లి సోలార్ విద్యుత్ గురించి గ్రామస్తులతో మాట్లాడి.. వారి సహకారంతో సౌర వెలుగులు తీసుకొచ్చింది.

ప్రతి ఇంటిలోనూ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయించింది. సంతల్లో సరుకులు అమ్ముకునేవారికి ఎల్‌ఈడీ బల్బ్‌తో కూడిన చిన్న సోలార్ లైట్లను ఇప్పించింది. సోలార్ వెలుగులు రావడంతో ఆ గ్రామంలోని ప్రజల జీవన స్థితిగతులలో చాలా మార్పులు వచ్చాయి. ఆ ప్రాంతంలో రైస్ మిల్లులు, ఫొటో స్టూడియోలు, దుకాణాలు, టీవీలు, ఎలక్ట్రిక్ మిషీన్లు, సేవా కేంద్రాలు వెలిశాయి. అయితే రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది పాలక్. ఇలా మారుమూల గ్రామాల ప్రజలకు టెక్నాలజీని పరిచయం చేసి వారి జీవన ప్రమాణాలు పెంచడంలో విజయం సాధించిన పాలక్ అగర్వాల్ ఎంతోమంది బతుకుల్లో ఇలా వెలుగులు నింపి సార్థకత చేసుకుంది. తనలోని మానవతను చాటుకుంది.శభాష్ పాలక్!

★

ముఖోసం



కొబ్బరినూనె చుక్కల్ని కళ్ల చుట్టూ వలయాకారంలో నెమ్మదిగా మసాజ్ చేస్తే కళ్లకింద నలుపు తగ్గుతుంది.

జీవన సౌరభం

నిర్ణయాధికారంలో ఆమెకు చోటిస్తే సమాజమార్పు ప్రారంభమైనట్లే

ఆ రోజు ఆమె కోసం



నిజానికి ఆమెను ప్రతీదినం, ప్రతీక్షణం గౌరవించాలి, ప్రేమించాలి, ప్రశంసించాలి. ప్రతిరోజూ మనకి పండగే కానీ మన పుట్టినరోజు ప్రత్యేకత మాత్రం ఏడాదిలో ఒక్కరోజే ఉంటుంది. అలాగే స్త్రీత్వానికి ఏడాదిలో ఒకరోజు కేటాయించడంలో అదే ప్రత్యేకత ఉంది. దీని కోసం ఆమెకి ఖరీదైన వస్తువులు బహుమతిగా ఇవ్వనవసరంలేదు. ఆమె జీవితానికి ఒక అనుభవాన్నివ్వొచ్చు. ఆమె మెదళ్లో మెదులుతున్న ప్రశ్నలకు సమాధానమివ్వొచ్చు. ఆమె భద్రతకు ఒక భరోసా ఇవ్వొచ్చు. ఆమెను అభిమానించే ప్రతీకగా మారొచ్చు. ఆమె ఆనందానికి ఒక ప్రతిజ్ఞగా మారొచ్చు.

నిన్ను లోకానికి తీసుకురావడానికి ఆమె అనుభవించిన వేదన నీకు తెలియదు. ఆమె నీ కోసం చేసిన త్యాగం వర్ణించడానికి అందదు. కానీ ఆమె దాన్ని బయటకు చెప్పదు. చెప్పాలనే ఆలోచన కూడా ఆమెకుండదు. అయినా ఆమెకు నీ బాగోగులు కావాలి. ఆమెకు నీకు తెలిసిన దానికంటే ఎక్కువ సామర్థ్యమే ఉంది. కానీ నీతో ఉండాలనే ఆశతోనే నిన్ను ఆధారంగా చూపిస్తుంది. నిన్ను ప్రేమిస్తుంది. ఈ రోజు ఆమెది. ఆమెలా ఆలోచించు. కనీసం ఆమె ఈ రోజైనా నీకు అర్థమవుతుందేమో గమనించు. అదే నీవు ఆమెకిచ్చే బహుమతి.

పరిష్కారమార్గం



వయస్సుకు తగ్గట్లు ఆమె ఎన్నో సమస్యలను ఎదుర్కుంటూ ఉండొచ్చు. ఆయా పరిస్థితులను బట్టి వాటి తీవ్రత ఆమె శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంటాయి. అయితే అన్ని సమస్యలకూ మీరే పరిష్కారం ఇవ్వలేకపోవచ్చు. కానీ కనీసం ఒకదానికైనా ఒక పరిష్కారం మన చేతుల మీదుగా చేసే అవకాశం ఉంటుందేమో? అందుకే ఈ మధ్య కాలంలో ఆమె మీతో పంచుకున్న సమస్యలను గుర్తుచేసుకోండి. ఆమె శారీరక, మానసిక అనారోగ్యాలు ఏమున్నాయో.. చదువుకునే మహిళలైతే, ఏదైనా కోర్స్ చేయాలనుకుంటున్నారేమో.. ఆమె హాబీలను పూర్తిస్థాయిలో ఆనందించడానికి ఏదైనా సహాయం కావాలేమో... ఇంకా... ఇంకా... ఏదైనా ఆమె సమస్యకు మీరు పరిష్కారం ఇవ్వడానికి ప్రయత్నించండి.

అనుభూతినే బహుమతిగా

ఆమె ఎలాంటి సందర్భాన్ని, వాతావరణాన్ని ఇష్టపడుతుందో మీకు తెలిస్తే ఆమెకు మంచి బహుమతి ఇవ్వడానికి మార్గం దొరికినట్లే. ఇంట్లో అయినా, బయటైనా ఆమెకు నచ్చినట్లు నడుచుకోవడం. ఆమెకు ఇష్టమైన వంటచేసి పెట్టడం, ఇష్టమైన ప్రదేశాలకు తీసుకెళ్లడం వంటి ఏదైనా ఒక మంచి అనుభవాన్ని ఆమెకు బహుమతిగా ఇవ్వగలిగితే మంచిది.

భద్రతే బహుమతి

ప్రతి స్త్రీ తనను తాను సంరక్షించుకోగలిగినప్పుడు నిజంగా లోకంలో ఒక అద్భుతమైన వాతావరణం నెలకొంటుంది. కానీ చాలా కారణాల వల్ల అలాంటి పరిస్థితులు తక్కువున్నాయి. కనుక మీరే ఆమె సంరక్షణకు భరోసా ఇవ్వగలిగితే అదే ఆమెకు మంచి బహుమతి అవుతుంది. ఆర్థికంగానైనా, సామాజికంగానైనా, మానసికంగానైనా, శారీరకంగానైనా ఆమె జీవితంలో అభద్రత లేకుండా బతకడానికి ఒక భద్రతను ఇవ్వగల్గితే అంతకుమించిన బహుమతి మరొకటి ఉండదు.

ఆమెతో వాగ్దానం

ఆమె మన గురించి ఆలోచిస్తోంది అనడానికి గుర్తే ఆమె మనల్ని హెచ్చరించడం. మీరు స్నేహితులతో సంతోషాన్ని పంచుకోవడం ఆమెకు ఇష్టంలేక కాదు. ఆ సంతోషం మరో కష్టానికి దారితీయకూడదనే ఆలోచనే ఆమె ఆవేదన. ఆమె హెచ్చరికల్లో కొన్నైనా మన మంచి కోసమేనని తెలిసినా వాటిన ఒప్పుకోవడానికి మనం తయారుగాలేకే ఆమెను బేఖాతరు చేస్తాం. అయితే రోజులో కనీసం అరగంటైనా ఆమెతో మాట్లాడటానికి సమయాన్ని కేటాయించడం ఆమెకెంతో సంతోషాన్నిస్తుంది. అలాంటి ప్రతిజ్ఞ చేసి, ఆచరించగల్గితే అది ఆమెకిచ్చే గొప్ప బహుమతి అవుతుంది.

★

సెన్సెక్స్ ⬇ 430
33,317

నిఫ్టీ ⬇ 110
10,249

రూపాయి ⬆ 16 పైII
అమెరికా డాలరుకు రూ.
64.96



భేటీ

మంగళవారం న్యూఢిల్లీలో వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయిన మంత్రి లోకేష్

డెలాయిట్, నోబెల్ గ్రూప్, హెచ్‌పితో లోకేష్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు డెలాయిట్, నోబెల్ గ్రూప్, హెచ్‌పి కంపెనీలు ఆసక్తి కనపరిచాయి. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం పలు కంపెనీలతో భేటీ అయ్యారు. తొలుత డెలాయిట్ గ్లోబల్ సిఇఒ పునీత్ రెంజెన్ బృందంతో భేటీ అయ్యారు. అమరావతిలో ఆధునిక టెక్నాలజీల అభివృద్ధి జరగబోతోందని, విశాఖ ఐటి హబ్‌గా మారబోతోందని లోకేశ్ వివరించారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, పరిశ్రమల ఏర్పాటుకు అందిస్తున్న రాయితీల గురించి వివరించారు. ఎపిలో పెట్టుబడులు పెట్టాలని, డెలాయిట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. ఎపిలో కంపెనీ ఏర్పాటును పరిశీలిస్తామని, త్వరలోనే పూర్తి స్థాయి ప్రతిపాదనలతో వస్తామని, ఎపి ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉనాన్నమని డెలాయిట్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం నోబెల్ గ్రూప్ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సరబ్జిత్ సింగ్‌తో సమావేశమయ్యారు. ఎపిలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. కంపెనీ ఏర్పాటుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కిమాషీ ఎలక్ట్రానిక్స్ సిఇఒ అనిల్ గుప్తా, యూహో మొబైల్ కంపెనీ ఎండి చన్ప్రీత్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఎపిలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. అనంతరం హెచ్‌పి కంపెనీ కంట్రీ మేనేజర్ అమితాబ్ నాగ్, ఎండి సుమీర్ చంద్రాతో సమావేశమయ్యారు. ఎపితో కలిసి పనిచేయాలని, తయారీ కంపెనీని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని, త్రీడి ప్రింటింగ్, డిజిటలైజేషన్, విఆర్, ఎఆర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

రెండు లక్షల కోట్లు ఫట్

- కేవలం చివరి గంటలో ఆవిరి
- సెన్సెక్స్ 430 పాయింట్ల పతనం
- కొచ్చర్, శర్మలకు నోటీసుల ఎఫెక్ట్
- కొనసాగిన ట్రేడ్ వార్ భయాలు
- దేశీయ మదుపరి విలవిల



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో మరోమారు బేర్ పంజా విసిరింది. నీరవ్ మోడీ కేసులో ఐసిఐసిఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకులకు ఆర్థిక నేర విభాగ ఏజెన్సీలు నోటీసులు ఇవ్వడంతో బ్యాంకింగ్ షేర్లు భారీగా పడిపోయాయి. మరోవైపు అంతర్జాతీయ ట్రేడ్ వార్ భయాలు రెండో రోజూ కొనసాగాయి. ఈ పరిణామాల మధ్య మంగళవారం మదుపర్ల సంపద రూ.2 లక్షల కోట్లు కరిగిపోయింది. కేవలం చివరి గంటలో మదుపర్లు భారీ విక్రయాలకు ముగ్గుచూపటంతో ఈ నష్టం చోటు చేసుకుంది. బిఎస్ఇ సెన్సెక్స్ 429.58 పాయింట్లు లేదా 1.27 శాతం పతనమై 33,317.20కు దిగజారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 109.60 పాయింట్లు క్షీణించి 10,249కు పడిపోయింది. ఇంతక్రితం సెషన్‌లో బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ విలువ రూ.146 లక్షల కోట్లుగా ఉండగా రూ.146 లక్షల కోట్లకు క్షీణించింది.

ఎస్ఎఫ్ఐఒ నోటీసులు..

నీరవ్ మోడీ అక్రమ లావాదేవీల కేసులో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ (ఎస్ఎఫ్ఐఒ) ఐసిఐసిఐ బ్యాంకు సిఇఒ చందా కొచ్చర్, యాక్సిస్ బ్యాంకు సిఇఒ శికా శర్మకు నోటీసులు జారీ చేసింది. మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్‌కు రూ.5,000 కోట్ల రుణ పొడగింపుపై ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

వాణిజ్య యుద్ధం..

స్టీల్, అల్యూమినియం లోహాల దిగుమతులపై 25 శాతం పన్ను విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై యూరప్, ఇతర ప్రపంచ దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ట్రంపు ప్రతిపాదనపై తాజాగా యూరోపియన్ పార్లమెంట్‌కు చెందిన అంతర్జాతీయ ట్రేడ్ కమిటీ ఛైర్మన్ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒ లాంటి అంతర్జాతీయ సంస్థలు, విశ్లేషకులు ట్రంపు నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారి తీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు ప్రపంచ మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి, ఆందోళనకు గురి చేస్తున్నాయి.

జారుకుంటున్న ఎఫ్ఐఐలు..

ఇప్పటికే అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లు పెంచనుందన్న సంకేతాలకు తోడు ఇతర దేశీయ పరిణామాల మధ్య విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) తమ ఈక్విటీలను తరలించుకుపోతున్నారు. మార్చిలో ఇప్పటి వరకు రూ.11,037 కోట్ల ఈక్విటీలు విక్రయించగా, రూ.1200 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు. దేశ వాణిజ్య లోటు, విత్త లోటు కూడా అంచనాల కంటే ఎక్కువగా పెరిగి పోతుండటం మదుపర్లను ఆందోళనకు గురి చేసింది.

కొచ్చర్‌కు నోటీసులు..!

- యస్ బ్యాంకు చీఫ్‌కు కూడా
- నీరవ్ మోడీ కేసులో ఎస్ఎఫ్ఐఒ చర్యలు
- 31 బ్యాంకులపై విచారణ



న్యూఢిల్లీ : నీరవ్ మోడీ కేసులో రెండు ప్రయివేటు రంగ దిగ్గజ బ్యాంకులకు నోటీసులు జారీ అయ్యాయి. ఐసిఐసిఐ బ్యాంకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందా కొచ్చర్, యాక్సిస్ బ్యాంకు చీఫ్ శికా శర్మలకు సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు (ఎస్ఎఫ్ఐఒ) నోటీసులు ఇచ్చింది. నీరవ్ మోడీ ఆయన మామ మెహుల్ చోక్సీలకు ఈ బ్యాంకులు కూడా రుణాలు ఇచ్చినందున ఆ బ్యాంకు చీఫ్‌లను విచారణ నిమిత్తం పిలిచారు. నీరవ్, ఛోక్సీలు పిఎన్‌బిలో దాదాపు రూ.13,000 కోట్ల అక్రమ లావాదేవీలు నెరవేర్చి ఆ బ్యాంకును భారీగా మోసం చేసిన విషయం తెలిసిందే. కన్సార్టియం పిఎన్‌బి కుంభకోణంలో నిందితుడిగా ఉన్న గీతాంజలి గ్రూప్స్ అధినేత మెహుల్ ఛోక్సీకి రుణాలు ఇచ్చింది. అయితే కొన్ని విషయాల్లో స్పష్టత కోసమే కొచ్చర్, శిఖా శర్మలను ప్రశ్నించేందుకు పిలిచామని ఎస్ఎఫ్ఐఒ పేర్కొంది. వారిని నిందితులుగా భావించడం లేదని తెలిపింది. నీరవ్ గ్రూప్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని ఐసిఐసిఐ బ్యాంకు గతంలోనే ప్రకటించింది. కాని ఇతర బ్యాంకులతో కలిసి ఐసిఐసిఐ కూడా అప్పులు ఇచ్చింది. ఈ కేసులో మంగళవారం పలువురి బ్యాంకర్లను నేర పరిశోధన ఏజెన్సీలు ప్రశ్నించాయి. యాక్సిస్ బ్యాంకు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ వి శ్రీనివాసన్‌ను ఎస్ఎఫ్ఐఒ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరో 31 బ్యాంకుల అధికారులను విచారణకు పిలిచినట్లు సమాచారం.

దర్యాప్తు ముమ్మరం


పిఎన్‌బి కుంభకోణంతో ప్రభుత్వం, బ్యాంకుల ప్రతిష్ట దెబ్బతినడంతో సర్కార్ ఈ కుంభకోణాన్ని సీరియస్‌గా తీసుకుంది. మరోవైపు పార్లమెంట్‌లో ఈ కేసుపై ప్రతిపక్షాలు ఆందోళనను తీవ్రతరం చేశాయి. ఈ పరిణామం ప్రభుత్వంపై మరింత ఒత్తిడిని పెంచాయి. కాగా తాజాగా సిబిఐ అధికారులు గీతాంజలి గ్రూప్ బ్యాంకింగ్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ విపుల్ చితాలియాను అదుపులోకి తీసుకుంది. ఈ కుంభకోణ వివరాలపై ఆయన ప్రశ్నించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే.



సుజుకి కొత్త 'గిక్సర్'

న్యూఢిల్లీ : సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా గిక్సర్ సిరీస్‌లో కొత్త మోడల్ బైక్‌లను మంగళవారం ఆవిష్కరించింది. 2014లో లాంచ్ చేసిన గిక్సర్ బ్రాండ్‌కు చెందిన గిక్సర్ , గిక్సర్ ఎస్ఎఫ్ పేరుతో 2018 వర్షన్ మోడళ్లను అందుబాటులోకి తెచ్చింది. గిక్సర్ ధరను రూ. 80,928, గిక్సర్ ఎస్ఎఫ్ ధరను రూ .90,037గా నిర్ణయించింది. 155 సిసి సామర్థ్యం ఇంజిన్‌తో అందుబాటులోకి తెచ్చినట్లు సుజుకి మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రతినిధి సజీవ్ రాజశేఖరన్ చెప్పారు. దేశ వ్యాప్తంగా తమ షోరూంల్లో వీటిని అమ్మకానికి సిద్దంగా ఉంచినట్లు తెలిపారు.

ఆర్‌బిఐ డివిడెండ్‌పై సర్కార్ భారీ ఆశలు ..!




న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి తాత్కాలిక డివిడెండ్‌గా రూ .10,000 కోట్లు (1.5 బిలియన్ డాలర్లు) అందుకోవాలని ప్రభుత్వం ఆశిస్తోంది. 2017-18 తొలి ఆరు నెలల కాలానికి ఈ మొత్తాన్ని పొందాలను కేంద్రం యోచనగా ఉంది. ఈ మొత్తాన్ని ఈ మార్చి నెలలోనే విడుదల చేసే అవకాశాలున్నాయి. ఆర్‌బిఐ ప్రతీ ఏడాది కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌ను చెల్లిస్తూ ఉంటుంది. జులై నుంచి జూన్ కాలాన్ని ఆర్‌బిఐ వార్షిక సంవత్సరంగా పరిగణిస్తుంది. ఈ వార్తలపై ఆర్‌బిఐ, కేంద్రం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

దేశ మర్కెట్లోకి గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ మోడల్ గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్‌లను భారత మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది. మంగళవారం ఈ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. వీటి ధరలు రూ.57,900 నుంచి రూ.72,000 మధ్య నిర్ణయించింది. సామ్‌సంగ్ పాత మొబైళ్లపై రూ.6,000 వరకు ఎక్స్ఛేంజీ ఆఫర్‌ను అందిస్తుంది. ఎస్9 5.8 అంగుళాల క్వాడ్ హెచ్‌డి ప్లస్ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లేతో రాగా, ఎస్9 ప్లస్ డిస్ ప్లే 6.2 అంగుళాలు డిస్‌ప్లే కలిగి ఉంది.

నీటి శుద్ధి యంత్రాల్లోకి హావెల్స్ రూ.500 కోట్ల టర్నోవర్ లక్ష్యం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



హావెల్స్ ఇండియా కొత్తగా పిహెచ్ బ్యాలెన్స్, నేచురల్ మినరల్ ఫార్టిఫికేషన్ సామర్థ్యంతో నీటి శుద్ధి యంత్రాల్లోకి ప్రవేశించినట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ఈ విభాగంలో వచ్చే నాలుగు, ఐదు సంవత్సరాల్లో రూ.500 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని హావెల్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ శశాంక్ శ్రీవాస్తవ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఈ కొత్త ఉత్పత్తులను ఆయన మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ వాటర్ ప్యూరిఫైయర్స్ ధర రూ.10,499 నుంచి రూ.23,999గా నిర్ణయించామన్నారు. ఈ రంగంలో ఏప్రిల్ 2018 నుంచి 2019 మార్చి నాటికి రూ.100 కోట్ల వ్యాపారం అంచనా వేస్తున్నామన్నారు. సంఘటిత మార్కెట్‌లో 2.5-3 శాతం మార్కెట్ వాటా సాధించాలని నిర్దేశించుకున్నామన్నారు.



ENGLISH PAPER-II

S.S.C.MODEL PAPER

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 40

Part - A

Time:1½ Hours Marks: 25

Instructions:

1. Answer all the questions under Part-A on a seperate answer book.

2. Write the answers to the questions under Part-B on the question paper itself.

3. Start answering the questions as you read them.

4. 15minutes of time is alloted exclusively for reading the question paper and 2.30 hours for writing the answers.

5. Part-B of the question paper will be supplied along with Part-A at the begining of the examination.

1. Here is the information about public Holidays inthe various countries.

PUBLIC HOLIDYS IN A YEAR

Country	Holidays
India	17
Switzerland	13
USA	13
NewZealand	12
Belgium	12
Finland	11
Australia	10
France	10
Holland	8
Brazil	8
UK	8

Now answer the following questions.5 × 1= 5

A) Which Country People enjoy a large number of public holidays?

B) Name the country that has eleven public Holidays?

C) In the given countries which have the same number of public holidays?

i) Switzerland, Australia ii) France , UK

iii) Newzealand, Belgium

D) Which Country has 8 public holidays other than Holland and UK?

i) Brazil, ii) France, iii) Australia

E)Find the correct statement reading the above table.

i) All the countries have more than 10 public holidays.

ii) Maximum countries have 8 holidays.

iii) Next to India, Australia gives more public holidyas.

2. Read the following passage carefully. 5 × 1= 5

People have been playing chess for over 500 years.The chess we play today came from Europe.Chess is a two- player game. One player uses the white pieces.The other uses the black pieces.Each piece moves in a special way. One piece is called the king.Each player has one king.The players take turns moving their pieces. If a player lands on a piece, he or she takes it.The game ends when a player loses his king. There are few more rules, but these are basics.

The player of chess believes that it makes the mind stronger.Good chess players use their brains. They take their own time. They think about what will happen next. These skills are useful both in life and in chess.Chess is like a workout for the brain.

You don't always have lots of time to think when playing chess.There is a type of chess with short time limits. It's called blitz chess, each player gets ten minutes to use for the whole game. Your clock runs during your turn.You hit the time clock after your move. This stops your clock. It also starts the other player's clock. If you run out of time you lose Games of blitz chess are fast paced.

Chess is not just for people.Computers have been playing chess since 1970s. At first they did not play well. They made mistakes.As time went on, they grew stronger.In 1997, a computer beat the best player in the world for the first time. It was a computer called deep blue. Deep blue was big.It took up the whole room. By 2006, Acell phone could beat the best players in the world. Chess sure has come a long way.Don't you think so?

Now, answer the following questions.

A) Where did the modern chess originate?

B) Which is the most important piece in chess?

C) How does it affect the brain?

i) It makes the brain stronger.

ii) It creats nausea.

iii) It keeps us away from thinking.

D) What is Blitz chess?

i) a game that has only few moves.

ii) a game that has short time limits.

iii) It keeps us away from thinking.

E) Pick out the true statement based on the information in the given passage.

i) Chess is a game that makes us stressful.

ii) The game ends when the player loses all the pieces of his side.

iii) The cell phone is the latest device that could counter the best players.

3. Read the following passage carefully.

Swami Dayanand was the first to use the word "Swaraj". Even before Dadabhai Naorojiand Tilak used it. The British regarded Arya Samaj as a seditious organisation and during the martial law days students of DAV college, Lab were ordered to go for roll call by the police thrice a day. It is now being increasingly accepted that during the sepoy Revolt of 1857 Dayanand played a historic role, not as a solider but by inspiring the freedom fighters.

It was taught in school text books that the Aryans migrated here from Central Asia. Dayanand was first to debunk that view and assert that the Aryans were the original residents of Arya Varta (India),now many historians agree with him. Indians told the British rulers: " You quit because you are foreigners".Their reply was: " you too are migrants from other lands. Only you came much before us. So first you quit and then we will see. "They invented this theory of Aryan migration as a part of their imperial policy of ' divide and rule'.The aim was to put the Dravidians,according to them original residents of this country, against the Aryan invaders.

Now, arrange the following jumbled sentences in a sequetial and meaningful order.

A) They used this theory to divide the Aryans and the Dravidians.

B) Dayanand asserted that the Aryans were the original residents of India.

C) The British used this theory of Aryan migration to divide and rule.

D) It was taught that the Aryans migrated to India from central Asia.

E) Dayanand was the first to debunk this theory.

4. Read the paragraph given below.

The climatic conditions are changing very fast.The day.The day temperatures are reaching terrible levels.The patterns of rain fall are not the same every year.Every one in the society is worried. You feel that we have to act immediately and do something to improve climatic conditions.

A) Write a letter to your friend Abhilash explaining to him the importance of planting trees, rain harvesting techniques like soaking pits and prevention of wastage of wataer, Imagine that you are Venkat. 5M

OR

B) Write a News report about the event of the Annual Day celebrations held in your school.



5. A) Write a biographical sketch of Mokshagundam Visweswarayya based on the following hints. 5M

Date of Birth - September 15, 1861- Muddenahalli, Mysore- early education- Higher studies- nationalistic ideas- Asst.Engineer in Mumbai-purified Sukkuar water- title " Kaiser -e-Hind" Chief Engineer- Dewan of Mysore State- Bharat Ratna in 1955- died in 1962

5. B) Write a story using the following hints.

Ramaiah-poor- cultivated his bit of landrest under a tree-snake -bowed. dialy gave milk- a gold coin next day- continued- Ramaiah told his son to do so-went to another village-son thought- treasure inside-struck the snake- bit the son-Ramaiah knew- no relation with the snake-snake left- gave a necklace.

Part – B

Time: 1 Hour Marks:15

Instructions :

1. Answer the questions in 'Part-B' on the paper itself.

2. This part of the question paper should be attached to the Main Answer Book of the student.

6. Read the paragraph and write the synonyms of the under lined words choosing from the words given in the box 4 × ½=2

difficulties, beliefs, courage, got, dominate, person

"The **challenges** (a); in our lives are there to strengthen our **conviction**s (b). They are not there to run us over" , said Nick. In 1990 Nick **won** (c) the Australian Young Citizen of the Year award for his **bravery** (d) and perseverance.

Answers :

A)................................. B) ....

C)................................ D)................................

7. Read the paragraph and write the antonyms of the under lined words. 4 × ½=2M

Roberge does not endorse the **accusation** (a) of Ray's detractors that the master director made his **reputation** (b) selling India's poverty to the West. " What struck me most was not the **material** (c) poverty depicted in the films, but the **enormous** (d) spiritual poverty of some rich people is much deplorable than material poverty," he said.

Answers :

A................................ B) ....

C) .... D) ....

8. Fill in the blanks with the right form of the words given in brackets. 4 × ½=2M

It was a very...........(a) (quiet/quite) friendship that developed over the years. Manikda {as Ray was .... (b) (affection / affectionately) called by his friends} was a shy person and always very discreet about .... (c) (display /displaying), his ....(d) (emotions / emotional)," said Roberge.

Answers :

A) ....B) ....

C) ....D) ....

9. Complete the spelling of the words with 'ea', 'ia', 'ou', 'ae'. 2 × ½= 1M

The door opens rev--ling an old man clad in a faded but gay dressing-gown. Although over seventy, he is vigor-- s.

10. Complete the words with correct suffixes given in brackets. 2 × ½= 1M

We lived in our (a) ancest .... (rel / ral) house.

A days collection would fetch Kalam the (b) prince ....(li / ly) sum.

A) .... B) ....

11. Find the wrongly spelt word and write its correct spelling. 2 × ½= 1M

A) academically enroute stopover fasinating

Ans :

B) sustainabel equitably expense majority

Ans :

12. Arrange the following words under correct heading. 2 × 1/4= 2M

lethargy, protest, decide, worry, spend, carry, certainty, plight

State	Action
1.	1. ....
2.	2. ....
3.	3. ....
4.	4. ....

13. Use the following expresions in sentences of your own. 4 × 1/2= 2M

a) Phrasal Verb: take off

Ans :

b) Idiomatic Expression : at length

Ans :

c) Binomial Expression : rough and ready

Ans :

d) Foreign Expression : magnum opus

Ans :

14. Match the following one word substitues with their meanings. 4 × 1/2= 2M

1) Fatalist [ ] A) A position for which no salary is paid.

2) misogynist [ ] B) One who believes in God.

3) biography [ ] C) One who spends too much.

4) spendthrift [ ] D) A life history written by somebody else.

E) A person who hates women

F) A person who believes in fate.

★

ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో పోలీసుల హడావుడి

ప్రజాశకి - భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి)
పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి వై.రాము హాజరయ్యారు. సాయంత్రం సమయంలో పోలీసులు ఒక్కసారిగా కార్యాలయంలోకి ప్రవేశించి ఇక్కడ సమావేశం ఇప్పుడు ఎందుకు నిర్వహిస్తున్నారంటూ హడావుడి చేశారు. దీనిపై ఇది తమ కార్యాలయమని, జిల్లా కమిటీ జరుగుతుందని చెప్పినప్పటికీ కొద్దిసేపు వాగ్వివాదానికి దిగారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి రామును అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, మిగిలిన నేతలంతా అడ్డుకున్నారు.



వినూత్నం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పకోడీలు, బజ్జీలు అమ్ముతున్న డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మోడీ.. పకోడీ..! బాబు.. బజ్జీ!!

డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ వినూత్న నిరసన

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని వినూత్న రీతిలో ఎండగట్టారు.. డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట 'మోడీ..పకోడీ.! బాబు..బజ్జీ!!' అంటూ ప్రత్యేక హోదాపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంలో అటు మోడీ, ఇటు బాబు ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌ను మోసగించారన్నారు. విభజన చట్టంలో అనేక హామీలు ఉన్నప్పటికీ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. నాలుగేళ్లు కాలయాపన చేసిన చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తుండడంతో నాటకాలు ఆడుతున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లోనే ఆంధ్రప్రదేశ్‌కు కనీసం రూ. 2 వేల కోట్లను కూడా కేటాయించకపోవడం వారికి ప్రత్యేక హోదాపై ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతుందన్నారు. డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు జయచంద్ర, మాధవక్రిష్ణ మాట్లాడుతూ.. విభజన చట్టంలో ఉన్న హామీలను రాజ్యాంగబద్ధంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. బిజెపి అధికారంలోకి రాగానే తెప్ప తగలేసిన చందంగా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందన్నారు. నేటి యువత ఉద్యోగాలు లేకుండా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. భవిష్యత్‌లో సరైన నిర్ణయం తీసుకోకపోతే ఆంధ్రా యువత బజ్జీలు, బోండాలు వేసుకుని బతకాల్సిందేనన్నారు. రూ.9,600 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం 420 కోట్లు మాత్రమే కేటాయించడం చిత్తశుద్ధికి అద్దం పడుతోందన్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)
గ్రామీణ పశు వైద్యశాలలను అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ సముచితమైందని, దానిని సాధించడానికి విద్యార్థులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఏపి వెటర్నరీ సర్జన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వెటర్నరీ కళాశాలలో ఆరు రోజులుగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మంగళవారం పలు సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. పాడిపరిశ్రమ అభివృద్ధికి వైద్యుల పోస్టుల భర్తీ చాలా కీలకమన్నారు. ప్రభుత్వం కొత్త పోస్టులు భర్తీ చేయాలంటే వైద్యశాలలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. మూగ జీవాల బాధను తెలుసుకుని వైద్యం చేసే పశువైద్యుడు చాలా గొప్పవాడని కితాబిచ్చారు. అలాంటి వారి సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అసోసియేషన్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ మాధవరావు, బాలచిన్నిరెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులు మురళీ, నందకిషోర్, మౌనిక, మాధురి, సాల్మన్, అచ్యుతరావు, వెంకటేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో బిజెపి దాడులపై వామపక్షాల ఆగ్రహం

- మార్క్సిజమే మార్గదర్శకం
- విజయవాడలో ధర్నా
- రాజమహేంద్రవరంలో రాస్తారోకో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/రాజమహేంద్రవరం
లెనిన్ విగ్రహాన్ని కూల్చినంత మాత్రాన మార్క్సిస్ట్ సిద్ధాంతాలను దెబ్బ తీయలేరని వామపక్ష నేతలు అన్నారు. త్రిపురలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కార్యకర్తలు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసి, సిపిఎం కార్యాలయాలపై దాడులు చేయడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. నిరసనగా మంగళవారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ఆందోళన చేశాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. త్రిపురలో బిజెపి గెలుపుతో విర్రవీగుతూ సిపిఎం కార్యాలయాలు, కార్యకర్తల ఇళ్లపై దాడులకు తెగబడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలతో లెనినిజం, మార్క్సిజం, కమ్యూనిజం సిద్ధాంతాలను దెబ్బతీయలేరన్నారు. బిజెపి చేస్తున్న దాడులకు కమ్యూనిస్టులు భయపడరని, భవిష్యత్తులో తప్పక సిపిఎం గెలుపొందుతుందని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. ప్రజలకు అండగా ఉన్న సిపిఎంకు ఓటు వేసే వారిపై బిజెపి కార్యకర్తలు దాడులకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే సిపిఎంకు చెందిన 64 పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేసి, 208 పార్టీ కార్యాలయాలు, 38 ప్రజా సంఘాల కార్యాలయాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. మతతత్వ శక్తుల రౌడీ, గూండాయిజానికి వ్యతిరేకంగా పోరాడతామన్నారు. సిపిఐ నగర కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. బిజెపి భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలన్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి, విదేశీ సంస్థలతో చేతులు కలిపి బిజెపి విజయం సాధించిందని విమర్శించారు. వామపక్షాలే దేశానికి మార్గదర్శమని అనేక మంది అభ్యుదయ వాదులు చెబుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి దాడులపై ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. లెనిన్ గురించి, చరిత్ర గురించి తెలియని రామ్ జఠ్మలానీ లెనిన్‌ను టెర్రరిస్ట్ అనడం సరికాదన్నారు. సిపిఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు రామారావు తదితర వామపక్ష నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.



విజయవాడ లెనిన్‌సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

ఓటర్లను ప్రలోభపెట్టి బిజెపి అధికారంలోకి వచ్చింది : మిడియం బాబూరావు

త్రిపురలో లెనిన్ విగ్రహం ధ్వంసం, సిపిఎం కార్యాలయాలపై దాడులను నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నందంగనిరాజు జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం రాత్రి రాస్తారోకో చేపట్టారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడారు. త్రిపురలో ఓటర్లను ప్రలోభపెట్టి బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ వెంటనే తన నైజాన్ని ప్రదర్శిస్తోందన్నారు. ఎన్నికలు పూర్తయి మూడు రోజులు గడవకముందే ఫాసిస్టు పోకడలకు పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.ఆంజనేయులు మాట్లాడారు.

హోదా కోసం వినూత్న నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల నిరసన దీక్షలు నిర్వహించారు. ధర్నాలు, ప్రదర్శలు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజనచట్టంలోని అంశాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉరేసుకుని వినూత్న నిరసన తెలిపారు. గుంటూరు జిల్లాలో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషనన్, నాన్ పొలిటికల్ జెఎసి, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు ప్రారంభించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న దీక్షలకు మద్దతుగా సత్తెనపల్లిలో అంబెద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో దీక్షలను సిపిఎం గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్య ప్రారంభించారు. మంగళగిరిలో జెఎసి ఆధ్వర్యంలో ఉరి వేసుకుని నిరసన తెలిపారు. రేపల్లెలో తహశీల్దార్‌కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మంగళగిరి గాలిగోపురం సెంటర్‌లోని భగత్‌సింగ్ స్థూపం వద్ద నిరాహారదీక్షలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అయజ్‌కుమార్, సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెవి.రాఘవులు సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ నాయకులు లోకం భాస్కరరావు మాట్లడారు. తెనాలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రత్యేకహోదా సాధనా సమితి అధ్వర్యంలో దీక్షలను సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట 'మోడీ..పకోడీ.! బాబు..బజ్జీ!!' అంటూ ప్రత్యేక హోదాపై నిరసన తెలిపారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంలో అటు మోడీ, ఇటు బాబు ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌ను మోసగించారన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిరసనలు జరిగాయి. అనంతపురంలో ఈ నెల 13వ తేదీ వరకు సిపిఎం ప్రచారోద్యమ పోస్టరును సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆవిష్కరించారు.



మంగళగిరిలో ఉరి వేసుకొని నిరసన తెలియజేస్తున్న జెఎసి నాయకులు

సిపిఎస్ రద్దుకై చలో అసెంబ్లీ

ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఉపాధ్యాయుల, విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ సమావేశాలు, పదో తరగతి పరీక్షలు జరిగే సమయంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఫ్యాప్టో ప్రకటించింది. సిపిఎస్ రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఈ నెలలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపింది. ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఎస్టీయు రాష్ట్ర కార్యాలయంలో చైర్మన్ పి బాబురెడ్డి అధ్యక్షతన మంగళశారం జరిగింది. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో అనేక ఉద్యమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పజెప్పడంతో బోధన చేసే అవకాశం లేకుండా చేస్తోందని తెలిపింది. ఎపిటెల్స్ ఈ హాజరుతో రోజుకో అసంబద్ధమైన నిబంధనలు ఇస్తున్నారని పేర్కొంది. ఉన్నత పాఠశాలల్లో ఉన్న అరకొర స్కావెంజర్స్‌కు జూన్-2017 నుంచి జీతాలు మంజూరు చేయలేదని తెలిపింది. పదో తరగతి పరీక్షల్లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యార్థులు రాసే కేంద్రాల్లో సిసి కెమెరాలు అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. కోర్టు తీర్పు ననుసరించి ఉన్నత పాఠశాలల సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఉప విద్యాశాఖాధికారులుగా కొనసాగే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేసింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఎపి పునర్విభజన చట్టంలోని అంశాలు, విభజన హామీలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయాలనే డిమాండ్‌పై ఈనెల 13న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీ, ప్రదర్శనలకు చేస్తామని ప్రకటించింది.సమస్యల పరిష్కారానికై పదో తరగతి పరీక్షల విధులకు, పాఠశాలల విధులకు వెళ్ళే టీచర్లు మార్చి 15 నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన, ర్యాలీలు నిర్వహిస్తామని, అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే పది స్పాట్ కేంద్రాల్లో పికెటింగ్‌లు నిర్వహిస్తామని వెల్లడించింది. ఈ సమావేశంలో ఎపి జెఎసి సెక్రటరీ జనర, ఫ్యాప్టో చైర్మన్ సిహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, కో చైర్మన్లు పి పాండురంగ వరప్రసాద్, పి కృష్ణయ, ఎం శంకర్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎం రవిచంద్రకుమార్, చేబ్రోలు శరత్‌చంద్ర, కోశాధికారి జి శౌరిరాయులు, కార్యవర్గ సభ్యులు షేక్ సాబ్జీ, జి నాగేశ్వరరావు, కె వెంకటేశ్వరరావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

నూతన రవాణా బిల్లుతో

కార్మికుల ఉపాధికి ముప్పు

- ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్
- పలు జిల్లాల్లో ప్రదర్శనలు, ధర్నాలు



విశాఖలో ర్యాలీ చేస్తున్న రవాణా రంగ కార్మికులు



కర్నూలు కలెక్టరేట్ ఎదుట లారీ ఓనర్స్ అసోసియేషన్ ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం
నూతన రోడ్డు రవాణా సవరణ బిల్లును రద్దు చేసి రోడ్డు రవాణా రంగాన్ని రక్షించాలని, పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్‌తో కూడిన సమగ్రచట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. విశాఖలో సరస్వతి పార్కు నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.ఎ.సుభాన్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రోడ్డు రవాణారంగంపై సుమారు 20 కోట్లమంది ఆధారపడి ఉన్నారన్నారు. ఎంవి యాక్టు సవరణ బిల్లు ఆమోదిస్తే ఓనర్, డ్రైవర్లు, చిన్న ఓనర్ల వద్ద డ్రైవర్లుగా పనిచేసే లారీ, ఆటో, ట్యాక్సీ, ట్రాలీ, ప్రైవేట్ బస్సు కార్మికులు ఉపాధిని కోల్పోతారని తెలిపారు. ఆర్‌టిసి నిర్వీర్యమవుతుందని చెప్పారు. ఆర్‌టిఏ ఆఫీసులు ప్రయివేటు పరం అవుతాయని పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, ప్రభుత్వానికి, కార్పోరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే నూతన రవాణా సవరణ బిల్లు ప్రజలకు తీవ్రమైన ఆర్థిక భారాలను తెస్తుందన్నారు. ఈ బిల్లును ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, తాడేపల్లిగూడెంలో ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం ధర్నాలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో గ్యారేజ్ వద్ద ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఆలీ పాల్గొన్నారు. ఏలూరులో ధర్నాలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజనల్ కార్యదర్శి టిపిఆర్ దొర పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. కాకినాడ జెడ్‌పి సెంటర్ నుంచి ఇంద్రపాలెం బ్రిడ్జి వరకూ, అక్కడినుంచి కలెక్టరేట్ వరకూ ప్రదర్శన చేశారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండులో ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. కర్నూలులో మోటారు వర్కర్స్ యూనియన్, లాంగ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యర్శి పిఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు ఇ.పుల్లారెడ్డి డిమాండ్ పాల్గొన్నారు.

894 జిఒ రద్దు కోరుతూ ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)
ఆటో కార్మికులకు నష్టం కలిగించే జిఒ 894ని రద్దు చేయాలని సిఐటియు, ఎఐటియుసి, వైఎస్ఆర్‌టియుసి ఆధ్వర్యంలో ఆటో కార్మికులు స్థానిక లెనిన్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు పాల్గొని మాట్లాడారు. మోటారు చట్టం బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టకూడదని డిమాండ్ చేశారు. దీనికి ముందు జిఒ 894 ప్రవేశపెట్టి ఆటో కార్మికులపై భారం మోపుతున్నారన్నారు. థర్డ్‌పార్టీ ఇన్సూరెన్సును భారీగా పెంచారని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పేరుతో రోజుకు అదనంగా రూ.50 వసూలు చేయడం అన్యాయమని అన్నారు.

ప్రజ్ఞ
జవాబులు
1. ది షేప్ ఆఫ్ వాటర్, 2. ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్
3. డార్కెస్ట్ అవర్ చిత్రాని గానూ
4. 4 (ఉత్తమ దర్శకుడు, ఉత్తమ చిత్రం, ఉత్తమ ఒరిజినల్ స్కోప్, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్)
5. చిలీ

నిరసన

నల్లబ్యాడ్జీలతో పెరల్ కార్మికుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం)
కొందరు సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని యజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై మహిళలు నిరసన వ్యక్తంచేశారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండ పెరల్ డిస్టలరీ ఫ్యాక్టరీలో మహిళలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. జీతాల సమస్యపైనా యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళామని, అయినా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. పెరల్ డిస్టలరీ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు కూడా ఈ సమస్యను పరిష్కారం చేయాలని యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేస్తున్నారన్నారు.

'ఈ-నామ్' అంగీకరించే ప్రసక్తే లేదు

వ్యాపారుల స్పష్టీకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
గుంటూరు మార్కెట్ యార్డులో ఈ-నామ్ పద్ధతి ద్వారా మిర్చి కొనుగోలుకు అంగీకరించే ప్రసక్తే లేదని వ్యాపారులు తేల్చి చెప్పారు. మంగళవారం మార్కెటింగ్ శాఖ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేయగా కమిషనర్ ఆనంద్‌కుమార్ శ్యామ్యూల్ హాజరు కాలేదు. దీంతో మార్కెటింగ్ శాఖకు చెందిన ఇతర అధికారులు వ్యాపారులతో సమావేశమయ్యారు. యార్డుకు రోజుకు లక్ష నుంచి లక్షన్నర బస్తాల మిర్చి వస్తుందని, ఈ సమయంలో ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేసి అప్పటికప్పుడు సొమ్ము ఆన్‌లైన్‌లో జమచేయడం కుదరదని స్పష్టం చేశారు. తాము ఇక్కడ కాకపోతే మరో రాష్ట్రం వెళ్లి మిర్చి కొనుగోలు చేస్తామని తెలిపారు.

ఏ రాష్ట్రంలో మిర్చి కొనుగోలుకు ఈ-నామ్ వర్తింపచేయడం లేదని, క్షేత్రస్థాయిలో ఇది సాధ్యం కాదని చెబుతున్నా బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయడం తగదన్నారు.

14 నుంచి అంగన్‌వాడీల ఆందోళన

19న చలో విజయవాడ

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/ఒంగోలుటౌన్
అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు గుంటూరు ఐసిడిఎస్ కమిషనరేట్ వద్ద సామూహిక దీక్షలకు, 19న చలో విజయవాడకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈమేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్పెషల్ కమిషనర్‌కు నోటీసు అందజేసినట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి. బేబిరాణి, కె. సుబ్బరావమ్మ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్, అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ 18 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ 2 లక్షలు, హెల్పర్లు, మినీ వర్కర్లకు రూ లక్ష గ్రాట్యుటీ, చివరి జీతంలో సగం పెన్షన్‌గా నిర్ణయించి అమలు చేయాలని పేర్కొన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయాలను నియమించాలని, ఖాళీ పోస్టుల్లో మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌కు సంబంధంలేని అదనపు పనులు అప్పగించరాదని, అంగన్‌వాడీ సెంటర్ల విలీనం ఆపాలని, అంగన్‌వాడీ వర్కర్లకు సూపర్ వైజర్ పరీక్షలు నిర్వహించి వయో పరిమితిని పెంచాలని, ఐసిడిఎస్‌లో నగదు బదిలీ అమలు చేయరాదని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సబ్సిడీ పై గ్యాస్ సప్లై చేయాలని, తొలగించిన లింక్, క్రచ్ న్యూట్రిషన్ కౌన్సిలర్లను విధుల్లోకి తీసుకోవాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఒంగోలులో 8వ రోజుకు చేరిన దీక్షలు

బయోమెట్రిక్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరుగుతున్న దీక్షలు మంగళవారానికి 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ఐద్వా నగర నాయకురాలు పి.కల్పన దండలు వేసి దీక్షలను ప్రారంభించారు.

త్రిపురలో బిజెపి హింసాకాండపై జోక్యం చేసుకోండి

ప్రధానికి సిపిఎం వినతి

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం ఆరెస్సెస్, బిజెపి మూకలు విజయోన్మాదంతో సాగిస్తున్న హింసాకాండను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ హింసాకాండలో సిపిఎం, వామపక్ష శ్రేణులు సమిధలుగా మారుతున్నారని, పార్టీ కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకుని ఈ హింసాకాండకు తెరదించేందుకు చర్యలు తీసుకోవాలని పొలిట్‌బ్యూరో ప్రధాని నరేంద్రమోడీ సమర్పించిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేసింది. ఆరెస్సెస్, బిజెపి మూకలు తమ దాడుల్లో లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేయటం వారి కమ్యూనిస్టు వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక లక్షణాలను బయటపెడుతోందని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో పేర్కొంది. ఆరెస్సెస్, బిజెపిలు తమ ప్రజాస్వామ్య వ్యతిరేక అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు రాజకీయ హింసపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయన్న విషయాన్ని ఈ దాడులు స్పష్టం చేస్తున్నాయని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో పేర్కొంది. సిపిఎం, లెఫ్ట్ ఫ్రంట్, త్రిపురలోని శాంతికాముకులైన ప్రజలు, ఈ దాడులను ఎదుర్కొంటున్న వామపక్ష కార్యకర్తలకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరపాలని పొలిట్‌బ్యూరో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది.



ప్రధానికి వినతిపత్రం

త్రిపురలో ఎన్నికల అనంతరం కొనసాగుతున్న హింసాకాండను ప్రధాని దృష్టికి తెచ్చేందుకు సిపిఎం పొలిట్‌బ్యూరో మంగళవారం నాడు ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించింది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే బిజెపి, ఆరెస్సెస్ శ్రేణులు వామపక్ష కార్యకర్తలు, మద్దతుదారులపై తమ దాడులతో రాష్ట్ర వ్యాప్తంగా భయానక వాతావరణం సృష్టించారని ఈ వినతి పత్రంలో పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వున్న సిపిఎం కార్యకర్తలు, మద్దతుదారుల ఇళ్లు, పార్టీ కార్యాలయాలు, ప్రజా సంఘాల కార్యాలయాలపై జరిగిన దాడుల్లో 514 మందికి పైగా గాయపడ్డారని, 1,539 ఇళ్లపై దాడి జరిగిందని, 196 ఇళ్లను అగ్నికి ఆహుతి చేశారని పొలిట్‌బ్యూరో తన వినతిపత్రంలో వివరించింది. తమ పార్టీకి చెందిన 134 కార్యాలయాలపై దాడులు చేయటంతో పాటు 208 కార్యాలయాలను ఆక్రమించుకున్నారని, అంతేకాక ప్రజా సంఘాలకు చెందిన అనేక కార్యాలయాలపై దాడులుచేసి వాటిని ఆక్రమించుకున్నారని తెలిపింది. ఈ దాడులు ఇంకా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని వెంటనే జోక్యం చేసుకుని ఈ దాడులు, హింసాకాండకు తెరదించి రాష్ట్రంలో సాధారణ, శాంతి భద్రతలు కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే పరిస్థితి మరింత దిగజారుతుందని పొలిట్‌బ్యూరో ఈ వినతిపత్రంలో పేర్కొంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఆరెస్సెస్, బిజెపి మూకలు చేసిన దాడులు వివరాలతో రూపొందించిన పట్టికను పొలిట్‌బ్యూరో ఈ వినతిపత్రానికి జత చేసింది.

విదేశీ నాయకుల విగ్రహాలకు భారత్‌లో స్థానం లేదు : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

న్యూఢిల్లీ : భారత్‌లో విదేశీ నాయకుల విగ్రహాలకు స్థానం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హంస్‌రాజ్ గంగారామ్ అహిర్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. త్రిపురలో బెలోనియా పట్టణంలో లెనిన్ విగ్రహాన్ని బిజెపి గుండాలు ధ్వంసం చేసిన ఘటనపై స్పందిస్తూ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. త్రిపురలో విజయం సాధించిన అనంతరం బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు విధ్వంసానికి పాల్పడుతున్నాయి. సిపిఎం కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నాయి. 'అన్ని రకాల హింసను మేం ఖండిస్తున్నాం. అయితే నేను ఒక విషయం స్పష్టం చేయదల్చుకున్నాను. విదేశీ నాయకుల విగ్రహాలకు భారత్‌లో స్థానం లేదు. నేను ఏ ఒక్కరి పేరునూ చెప్పను. కానీ వారికి మేం స్థానం ఇవ్వం' అని హంస్‌రాజ్ తెలిపారు. దేశంలో మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద, బిఆర్ అంబేద్కర్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ, రామ్ మనోహర్ లోహియా.. వంటి ప్రముఖులు ఉన్నారని అన్నారు.

దాడులకు, విగ్రహాల కూల్చివేతకు మమత ఖండన



కోల్‌కతా : త్రిపురలో సిపిఎం కార్యకర్తలపై బిజెపి చేస్తున్న దాడులను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం తీవ్రంగా ఖండించారు. బంకూరా జిల్లాలో జరిగిన ఒక బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ 'మీరు (బిజెపి) అధికారంలోకి వచ్చినంత మాత్రాన కార్ల్ మార్క్స్, లెనిన్ విగ్రహాలను కూల్చివే యడానికి హక్కు లేదు. ఒక పార్టీకి చెందినంత మాత్రాన ఏ ఒక్కరినీ లక్ష్యంగా చేసుకోరాదు. త్రిపురలో వారు (బిజెపి) మారణ హోమం వాతావరణం సృష్టిస్తున్నారు. ప్రతీదాన్ని ధ్వంసం చేస్తున్నారు. దీనిని ఎవ్వరూ నిరసన తెలిపినా తెలపకపోయినా నేను మాత్రం సహించను. నిరసిస్తాను' అని ఆమె అన్నారు. పశ్చిమబెంగాల్‌లో సిపిఎం శ్రేణులపై తృణమూల్ కాంగ్రెస్ దాడులు కొనసాగిస్తూనే పొరుగున త్రిపురలో బిజెపి చేస్తున్న దాడులను ఆ పార్టీ అధినేత్రి మమత ఖండించడం విశేషం.

బిజెపి దాడులపై తెలంగాణలో నేడు వామపక్ష పార్టీల నిరసన

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

త్రిపురలోని సిపిఎం సహా వామపక్ష పార్టీల కార్యలయాలపై బిజెపి చేస్తున్న దాడులకు నిరసనగా తెలంగాణలో వామపక్ష పార్టీలు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించను న్నాయి. త్రిపురలో గెలిచిన రెండు రోజుల్లోనే బిజెపి దాడులకు తెగబడుతోంది. వామపక్ష కార్యకర్తలపై దాడులు చేయడంతో పాటు లెనిన్ విగ్రహాన్ని తొలగించారు..ఈ దుశ్చర్యలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వామపక్షాలు తెలిపాయి.

త్రిపురలో 3 రోజుల్లో బిజెపి దాడుల వివరాలు

సబ్ డివిజన్	భౌతిక దాడులు, ఇళ్లు/మద్దతుదారుల షాపులపై దాడులు	పార్టీ కార్యాలయాలపై దాడులు	ప్రజా సంఘాల కార్యాలయాలపైదాడులు	ఆక్రమణకుగురైన పార్టీ ప్రజా సంఘాల కార్యాలయాలు
సబ్‌రూమ్	ఆశా కార్యకర్తతో సహా ఆరుగురిపై దౌర్జన్యంలు	మనుబంకుల్‌లో ఒక కార్యాలయంపై దాడి	రెండు కార్యాలయాలపై దాడి	8 కార్యాలయ భవనాల ఆక్రమణ
షాంతి బజార్	10 మందిపై భౌతిక దాడులు, నాలుగు ఇళ్ల విధ్వంసం	2 భవనాల కూల్చివేత	సిటు సబ్‌డివిజన్ కార్యాలయానికి తాళం,టిఎంఎస్‌యు కార్యాలయం విధ్వంసం	3 ఆటో ఆఫీసులతోసహా 5 ఆక్రమణ
బెలోనియా	22 మందిపై భౌతికదాడి, 3 ఇళ్లపై దాడి, ఒక ఇల్లు కూల్చివేత	19 పార్టీకార్యాలయాల ధ్వంసం, 2 కార్యాలయాల కూల్చివేత	3 కార్యాలయం ధ్వంసం ఒక కార్యాలయం కూల్చివేత	
అమర్‌పూర్	50 మందిపై భౌతిక 50 ఇళ్ల ధ్వంసం, 3 ఇళ్ల కూల్చివేత	8 కార్యాలయాల ధ్వంసం, చెలువాలో ఒక కార్యాలయం కూల్చివేత	3 టిఎంఎస్‌యు కార్యాలయాలు, 2 ఆటో వర్కర్ల కార్యాలయాల ధ్వంసం, టిఎంఎస్‌యు ఆఫీసు కూల్చివేత	5టిఎంఎస్‌యు ఆఫీసుల ఆక్రమణ
కర్బూక్	4 ఇళ్లపై దాడి	ఒక లోకల్ కమిటీ కార్యాలయంపై దాడి		టిఎంఎస్‌యు ఆఫీసు ఆక్రమణ
ఉదయ్‌పూర్	46 మందిపై భౌతిక దాడి	23 పార్టీ కార్యాలయాల ధ్వంసం	టిఎంఎస్‌యు ఆఫీసు కూల్చివేత	6 టిఎంఎస్‌యు ఆఫీసుల ఆక్రమణ
సోనామురా	7గురిపై భౌతిక దాడి, 26 ఇళ్లు, మద్దతుదారుల షాపులపై దాడులు, లూటీ	26 పార్టీ కార్యాలయాల ధ్వంసం		6 టిఎంఎస్‌యు ఆఫీసుల ధ్వంసం, ఆక్రమణ
బిశాల్‌గఢ్	21 మందిపై భౌతిక దాడి, 57 ఇళ్లు, షాపుల ధ్వంసం, లూటీ	8 పార్టీ కార్యాలయాల ధ్వంసం, ఒక పార్టీ కార్యాలయం కూల్చివేత, చెరిలామ్ ఏరియా కమిటీకి చెందిన అన్ని బూత్ కార్యాలయాల ధ్వంసం (ఇక్కడ ఈ నెల 12న ఎన్నిక జరగాల్సి వుంది) 6 పార్టీ ఆఫీసులకు తాళం		4 ఆఫీసుల ఆక్రమణ
జంపైజలా	ముగ్గురిపై భౌతిక దాడులు, తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిక. 68 ఇళ్ల ధ్వంసం, లూటీ, 22 ఇళ్ల కూల్చివేత, దాదాపు 3000 రబ్బర్ ప్లాంటేషన్ల కూల్చివేత, అనేక పశువులు తరిమివేత, 2 కార్ల విధ్వంసం	రెండు లోకల్ కమిటీ ఆఫీసుల ధ్వంసం		
తక్కి	ఆరుగురిపై భౌతిక దాడి గాయాలతో ఆస్పత్రిలోచేరిక 40 ఇళ్ల ధ్వంసం, 3 ఇళ్ల కూల్చివేత, బలవంతపు పార్టీ సభ్యత్వం	8 పార్టీకార్యాలయాల ధ్వంసం2 పార్టీ ఆఫీసుల కూల్చివేత		5 టిఎంఎస్‌యు, ఆటో వర్కర్ల ఆఫీసుల ఆక్రమణ
సదర్	8 మందిపై భౌతిక దాడి, 100కు పైగా ఇళ్లు, షాపుల ఆఫీసుల ఆక్రమణ ధ్వంసం	11 పార్టీ కార్యాలయాల ధ్వంసం 4 పార్టీ ఆఫీసుల ఆక్రమణ	సిపిఎం అభ్యర్థి కారు ధ్వంసం	8 టిఎంఎస్‌యు ఆటో వర్కర్ల కార్యాలయాల ఆక్రమణ
మోహన్‌పూర్	13 మందిపై భౌతిక దాడి, అభ్యర్థి ఇంటిపై దాడికి యత్నం, 12 ఇళ్ల ధ్వంసం, లూటీ	సబ్ డివిజనల్ కార్యాలయం ధ్వంసం, నగదు లూటీ, 2 లోకల్ కమిటీ కార్యాలయాల కూల్చివేత		
జిరానియా	60 మందిపై భౌతిక దాడి, 400 ఇళ్ల ధ్వంసం, లూటీ, 2 రబ్బరు ప్లాంటేషన్ల కూల్చివేత, 100 మంది నుండి బలవంతపు సభ్యత్వ రుసుము వసూళ్ళు	7 పార్టీ కార్యాలయాల ధ్వంసం, 5 పార్టీ ఆఫీసుల కూల్చివేత	సిఐటియు, డివైఎఫ్ఐ కార్యాలయాల ధ్వంసం, 4 కార్లకు నిప్పు	
తెలియామురా	నలుగురిపై భౌతిక దాడి, 20 ఇళ్ల ధ్వంసం,రెండు ఇళ్ల కూల్చివేత	2 లోకల్ కమిటీ కార్యాలయాల ధ్వంసం, నాలుగు పార్టీ ఆఫీసుల కూల్చివేత, ఒక ఆఫీసు ఆక్రమణ	5 కార్ల ధ్వంసం,	3 టిఎంఎస్, 1 ఎస్‌సి సమన్వయ కమిటీ, ఒక సిఐటియు ఆఫీసుల ఆక్రమణ
ఖోవాయ్	102 మందిపై భౌతిక దాడి, 252 ఇళ్ల ధ్వంసం,300 ఇళ్ల లూటీ, 125 ఇళ్లు, చెరువులు, భూమి బలవంతంగా ఆక్రమణ, 150 షాపుల ధ్వంసం, లూటీ, అగ్నికి ఆహుతి	47 పార్టీ కార్యాలయాలకు నిప్పు200 ఆఫీసుల ఆక్రమణ	11 ఆఫీసుల ధ్వంసం, 5 ఆఫీసులకు నిప్పు	15 టిఎంఎస్‌యు ఆఫీసుల ఆక్రమణ
అంబాసా	15 ఇళ్లపై రాళ్ళ రువ్వటం, 1 షాపు ధ్వంసం, ఒక లోకల్ కమిటీ ఆఫీసుతో సహా 4 ఇళ్ల కూల్చివేత, 200 ఇళ్లపై దాడులు, లూటీ, ఒక రబ్బర్ ప్లాంటేషన్ కూల్చివేత, 20 మంది నుండి బలవంతపు సభ్యత్వ రుసుము వసూళ్ళు			4 సిఐటియు ఆఫీసుల ఆక్రమణ
గండచెర్రా	ఒకరిపై భౌతిక దాడి, తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిక			2టిఎంఎస్‌యు ఆఫీసుల ఆక్రమణ
లాంగ్‌తరాయ్	ముగ్గురిపై భౌతిక దాడి, 37 ఇళ్లపై దాడి	6 ఆరు పార్టీకార్యాలయాలపై దాడి, విధ్వంసం		3 టిఎంఎస్‌యు ఆఫీసుల ఆక్రమణ
కుమార్‌ఘాట్	నలుగురిపై భౌతిక దాడి, పార్టీనేత ఇంటిపై దాడి, ఒక షాపుపై దాడి	2 లోకల్ కమిటీ కార్యాలయాలపై దాడి ధ్వంసం, ఆఫీసులకు తాళం	రెండు ఆఫీసులపై దాడి, విధ్వంసం	2 సిఐటియు ఆఫీసుల ఆక్రమణ
కైలాస్‌శహర్	3 ఇళ్లపై దాడి		2సిఐటియు ఆఫీసుల ధ్వంసం	
ధర్మనగర్ (?)	120 మందిపై భౌతిక దాడి, 35 ఇళ్ల ధ్వంసం ఒక ఇంటికి నిప్పు	3 పార్టీ కార్యాలయాల ధ్వంసం	1 ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ ఆఫీసు ధ్వంసం, 3 టిఎంఎస్‌యు ఆఫీసుల ధ్వంసం	4 టిఎంఎస్‌యు ఆఫీసుల ఆక్రమణ
ఫటిక్‌రాయ్	ముగ్గురిపై భౌతిక దాడి			2 టిఎంఎస్‌యు కార్యాలయాల ఆక్రమణ
ధర్మనగర్	ఆరుగురిపై భౌతిక దాడి, 3 ఇళ్లపై దాడి,3 గోదాళ్ల కూల్చివేత, హాపాంగ్‌లో బిజెపి శ్రేణుల ఉపోషల సంబరాలలో 100 షాపులు మూతపడ్డాయి	1 లోకల్ కమిటీ ఆఫీసు ధ్వంసం	2 టిఎంఎస్‌యు ఆఫీసులపై దాడి, 2 ఎంప్లాయీస్ ఆఫీసులపై పలుమార్లు దాడి	3 టిఎంఎస్‌యు ఆఫీసులు, ఒక మోటార్ స్టాండ్ ఆక్రమణ
మొత్తం	దాడులకు గురైన వారు 514 దాడులకు గురైన ఇళ్ళు, 1539 అగ్నికి ఆహుతైన ఇళ్లు 196	ధ్వంసమైన పార్టీ ఆఫీసులు 134 కూల్చివేసిన పార్టీఆఫీసులు 64 ఆక్రమణలకు గురైన పార్టీ ఆఫీసులు 208	దాడులకు గురైన ప్రజా సంఘాల ఆఫీసులు 38	ఆక్రమణకు గురైన ప్రజా సంఘాల ఆఫీసులు 90





యునైటెడ్ ఫ్రంట్ దిశగా యత్నాలు !

13న ప్రతిపక్ష నేతలకు సోనియా విందు



న్యూఢిల్లీ : బిజెపిని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష కూటమి ఏర్పాటు దిశగా యత్నాలు ప్రారంభమైనట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీల నేతలతో ఈ నెల 13న సోనియా గాంధీ విందు భేటీ జరుపనున్నారని సమాచారం. . వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేసే అంశంతో పాటు, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కలసికట్టుగా వ్యవహరించే అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారని, పార్లమెంట్ లోపల, వెలుపల, బిజెపిని ఎదుర్కోవడానికి అన్ని పార్టీలను ఏకం చేయడమే లక్ష్యమని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ విందు సమావేశానికి రావడానికి ఇప్పటికే కొందరు నేతలు అంగీకరించారని తెలిపాయి. కాగా, నాన్-బిజెపి, నాన్-కాంగ్రెస్ ఫ్రంట్‌ను ఏర్పాటుకు తెలంగాణ ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ప్రతిపాదించిన నేపథ్యంలో సోనియా గాంధీ ఈ సమావేశాన్ని ఏర్పాటుచేస్తుండడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి కలిగిస్తోంది.

కార్తికి చుక్కెదురు

మరో మూడు రోజులు సిబిఐ కస్టడీలోనే

న్యూఢిల్లీ : బెయిల్ కోరుతూ కార్తి చిదంబరం పెట్టుకున్న పిటిషన్‌ను పాటియాలా ప్రత్యేక కోర్టు తోసిపుచ్చింది. మరో మూడు రోజుల పాటు సిబిఐ కస్టడీని పొడిగించింది. అంటే 9వ తేదీ వరకు కార్తి సిబిఐ కస్టడీలోనే వుంటాడు. ఇదిలా వుండగా, ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తి చిదంబరాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేయకుండా తాత్కాలిక రక్షణ కల్పించడానికి సుప్రీం కోర్టు మంగళవారం తిరస్కరించింది. తాను అరెస్టు కాకుండా చూడాలంటూ కార్తి చిదంబరం పెట్టుకున్న తాజా పిటిషన్‌పై ఇడి స్పందనను సుప్రీం బెంచ్ కోరింది. కార్తి కస్టడీని పొడిగించాలని కోరనున్నట్లు సిబిఐ సుప్రీంకు తెలియచేసింది. దీంతో విచారణా కోర్టు కార్తి కస్టడీని మరో మూడు రోజులు పొడిగించింది. తదుపరి విచారణ నిమిత్తం 8వ తేదీకి వాయిదా వేసింది. సిబిఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని ఇటువంటి నోటీసులు జారీ చేసే అధికారం ఇడికి లేదంటూ కార్తి చిదంబరం తనకు వచ్చిన సమన్లను సవాల్ చేశారు. కాగా ఇడి జారీ చేసిన సమన్లపై స్టే విధించడానికి గత నెల 23న సుప్రీం కోర్టు తిరస్కరించింది.

మేఘాలయ ముఖ్యమంత్రిగా కాన్రాడ్ సంగ్మా



షిల్లాంగ్ : మేఘాలయ 12వ ముఖ్యమంత్రిగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) అధ్యక్షులు కాన్రాడ్ సంగ్మా మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఉదయం 10.30 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ గంగా ప్రసాద్ సంగ్మాతోనూ, మరో 12 మంది క్యాబినేట్ మంత్రులతోనూ ప్రమాణస్వీకారం చేయించారు. కాగా, లోక్‌సభ మాజీ స్పీకరు పిఎ సంగ్మా కుమారుడైన కాన్రాడ్ సంగ్మా ప్రస్తుత లోక్‌సభలో సభ్యుడిగా ఉన్నారు. కాగా ప్రమాణస్వీకార కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బిజెపి అధ్యక్షులు అమిత్ షా, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరున్ సింగ్ పాల్గొన్నారు. యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, బిజెపి, స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో ఎన్‌పిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

9న త్రిపుర ముఖ్యమంత్రిగా విప్లవ్‌దేవ్ ప్రమాణస్వీకారం


ఈ నెల 9న త్రిపుర ముఖ్యమంత్రిగా విప్లవ్‌దేవ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గవర్నర్ తథాగత రాయ్ తమను ఆహ్వానించినట్లు మంగళవారం త్రిపుర బిజెపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే విప్లవదేవ్ తెలిపారు. తనతోపాటు కొంత మంది మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడి, బిజెపి అధ్యక్షులు అమిత్ షా, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కాగా, మంగళవారం ముందుగా జరిగిన సమావేశంలో బిజెపి శాసనసభ పక్ష నేతగా విప్లవదేవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి కేంద్ర పరిశీలకుడిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో బిజెపి ఎంఎల్ఎ జిష్ణు దేవ్‌వర్మను ఉప ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు.

నాగాలాండ్ ముఖ్యమంత్రిగా టీఆర్ జిలియాంగ్ రాజీనామా

నాగాలాండ్ ముఖ్యమంత్రి పదవికీ టిఆర్ జిలియాంగ్ మంగళవారం రాజీనామా చేశారు. తన రాజీనామాను గవర్నర్ పిబి అచార్యకు అందచేశారు. రాష్ట్ర సంక్షేమం కోసం సమర్థవంతమైన ప్రతిపక్షంగా నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) వ్యవహరిస్తుందని తెలిపారు. నాగాలాండ్‌లో ఎన్‌డిపిపితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బిజెపి ఇప్పటికే ప్రకటించిది.

గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

పెళ్లిబృందంలోని 30 మంది మృతి, పలువురికి గాయాలు



భావ్‌నగర్: గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక ట్రక్కు వంతెన పై నుండి కిందపడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న పెళ్లిబృందంలోని 30 మంది మరణించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారని వారికి సమీప ఆస్పత్రుల్లో వైద్య చికిత్స అందిస్తున్నామని ఒక ప్రకటనలో వివరించింది. క్షతగాత్రుల్లో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా వున్నట్లు రాష్ట్ర హోం మంత్రి ప్రదీప్‌సింగ్ జడేజా చెప్పారు. మృతులలో నలుగురు చిన్నారులు, ఎనిమిది మంది మహిళలు వున్నారని ఆయన వివరించారు. ట్రక్కు వంతెన పై నుండి కింద వున్న ఒక కాంక్రీట్ బేస్‌పై పడిందని, 26 మంది అక్కడికక్కడే మరణించగా మరో నలుగురు ఆస్పత్రిలోచికిత్స పొందుతూ మరణించారని ఆయన వివరించారు. బాధితులకు సహాయం అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగంతో పాటు సమీప గ్రామాల ప్రజలు కూడా ఘటనాస్థలికి చేరుకున్నారని ఆయన చెప్పారు. ప్రధాని మోడీ ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యంత దురదృష్టకరమైన ఈ ప్రమాదంలో మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు ఆయన తన సానుభూతిని తెలియచేశారు. మృతుల కుటుంబాలకు రు.4 లక్షల పరిహారం అందచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

కెపిజెపి నుండి వైదొలగిన నటుడు ఉపేంద్ర

'ప్రజాకీయ' పేరుతో కొత్త పార్టీ ప్రకటన



బెంగళూరు : కర్నాటక రాజకీయ ముఖచిత్రంపైకి ఇటీవల వచ్చిన కొత్త రాజకీయ పక్షం కర్నాటక ప్రజ్ఞావంతర జనతా పక్ష (కెపిఎపి)లో లుకలుకలు తారస్థాయికి చేరటంతో ఆ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన నటుడు ఉపేంద్ర పార్టీ నుండి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. తాను సొంతంగా 'ప్రజాకీయ' పేరుతో కొత్త పార్టీని ప్రారంభించి ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు ఆయన మంగళవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో చెప్పారు. త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న వారితో భేటీ అయిన అనంతరం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ వ్యవస్థాపకులైన ఉపేంద్ర, ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ మధ్య విభేదాలు సోమవారం భగ్గు మన్న విషయం తెలిసిందే. ఉపేంద్ర నియంత తరహాలో వ్యవహరిస్తున్నారని గౌడ మీడియా సమావేశంలో విమర్శించారు. అంతకు ముందు ఆదివారం నాడు పార్టీ ఆఫీస్ బేరర్లతో భేటీ అయిన ఉపేంద్ర 'ప్రజాకీయ' పేరుతో కొత్త పార్టీ పెడుతున్న విషయాన్ని ట్విట్టర్‌లో సూచన ప్రాయంగా వెల్లడించారు. పార్టీలో నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నాడని ఉపేంద్రపై మహేష్ విమర్శలు గుప్పిస్తుండగా, మహేష్, ఇతర నేతలు పార్టీ బిఫారంలను డబ్బుకు అమ్ముకుంటున్నారని ఉపేంద్ర ఆరోపిస్తున్నారు.

రైతు గర్జన

మహారాష్ట్రలో మొదలైన 'లాంగ్ మార్చ్'

- నాసిక్ నుంచి ముంబయికి రైతుల పాదయాత్ర
- సమస్యలను పరిష్కరించాలని డిమాండ్



నాసిక్ : సమస్యలు పరిష్కరించాలని మహారాష్ట్ర సర్కారుకు అన్నదాతలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిష్ప్రయోజనంగానే మిగిలింది. దీంతో రైతులు తమ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆలిండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) మహారాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో రైతులు 'లాంగ్ మార్చ్' పేరుతో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. దాదాపు 25 వేల మందితో ఈ పాదయాత్ర మంగళవారం నాసిక్‌లో ప్రారంభమైంది. 200 కిలోమీటర్ల దూరం సాగనున్న లాంగ్ మార్చ్.. ఈనెల 12న రాష్ట్ర రాజధాని ముంబయిలో ముగియనున్నది. ఈ మార్చ్‌లో వందలాది మంది మహిళా రైతులు కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. ఎర్ర జెండాలు, ఎర్ర బ్యానర్లు, ఎర్ర ప్లేకార్డులతో తమ డిమాండ్లను నినదించారు. రుణమాఫీ, మద్దతు ధర, ఫారెస్ట్ రైట్స్ చట్టం (ఎఫ్ఆర్ఎ) అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎఐకెఎస్ నాయకులు డాక్టర్ అశోక్ ధావలే, విజూ క్రిష్ణన్, జెపి గవిత్, కిసాన్ గుజార్, అజిత్ నావలే, ఇతర రాష్ట్ర నాయకులు ఈ లాంగ్ మార్చ్‌ను ప్రారంభించారు. మంగళవారం రాత్రి వాల్దేవి నది సమీపంలో పాదయాత్ర ఆగుతుంది. బుధవారం ల్గాత్‌పూరి దిశగా సాగుతుంది. తమ డిమాండ్లను సాధించుకోవడం కోసం రైతులు నాసిక్ నుంచి ముంబయి వరకూ ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నారు.

పాదయాత్ర ప్రారంభం సందర్భంగా ఏఐకేఎస్ కార్యదర్శి రాజు దిస్లే మాట్లాడుతూ.. రైతు రుణాలు, విద్యుత్ బిల్లులను పూర్తిగా మాఫీ చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఫడ్నవీస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాదయాత్రలో థానె, పాల్‌గఢ్ జిల్లాల రైతులు కూడా పాల్గొంటారని వివరించారు. పాదయాత్ర ముగింపు రోజున ముంబయిలో ఉన్న రాష్ట్ర అసెంబ్లీ భవనాన్ని ముట్టడిస్తామని చెప్పారు. రాష్ట్రంలో గతేడాది జూన్ నుంచి 1,753 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన తెలిపారు.

రైతుల డిమాండ్లు..

- స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి.
- వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- అటవీ హక్కుల చట్టంలో అమలుతో పాటు ఆలయ భూములు, పచ్చిక భూముల్లో రైతులకు వాటా ఇవ్వాలి.
- పంట నష్టానికి తగిన పరిహారం చెల్లించాలి.
- ప్రజా పంపిణీ వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.
- బుల్లెట్ రైలు, సూపర్ హైవే లాంటి అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణను ఆపాలి.

సంక్షిప్తం

అదానిని పెద్ద ఎగవేతదారుడు : సుబ్రమణ్యస్వామి

న్యూఢిల్లీ : బిజెపి ఎంపి సుబ్రమణ్య స్వామి ఈసారి పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానిని లక్ష్యంగా చేసుకున్నారు. అతను అతిపెద్ద 'నిరర్థక ఆస్తుల' మోసగాడని విమర్శించారు. గురువారం డిమాండ్ చేశారు. 'పిఎస్‌యుల్లో గౌతమ్ అదాని అతి పెద్ద మోసాలకు పాల్పడ్డాడని, అతని బాధ్యుడ్ని చేస్తూ పిటిషన్ వేయాలి' ట్విటర్‌లో పేర్కొన్నారు. 'అతన్ని ఎవరూ ప్రశ్నించడం లేదు. ఇది ప్రభుత్వానికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది' అని అన్నారు. వివిధ కేసుల్లో అదాని కంపెనీల భాగస్వామ్యం, కంపెనీల నిర్థరక ఆస్తులు, బొగ్గు దిగుమతులు, ఆస్ట్రేలియాలో అతని వ్యాపారం.. వంటి వివాదాస్పద అంశాలపై ప్రభుత్వం స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని సుబ్రమణ్య స్వామి డిమాండ్ చేశారు. సుబ్రమణ్యస్వామి వ్యాఖ్యలపై అదాని గ్రూప్ స్పందించింది. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల ప్రాజెక్టులను అతి తక్కువ సమయంలోనూ, తక్కువ వ్యయంతో పూర్తి చేసిన చరిత్ర తమకు ఉందని తెలిపింది. తమకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

మూడేళ్ల బాలికపై అత్యాచారం

కోల్‌కతా : దేశంలో వయసొచ్చిన ఆడపిల్లకే కాదు.. పసిమొగ్గలకు కూడా రక్షణ లేకుండా పోతుంది. కోల్‌కతాలో మూడేళ్ల బాలికపై 45 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. నగరంలోని కెనాల్ (వెస్ట్) రోడ్డులో నిలిపి ఉన్న బస్సులో సోమవారం సాయంత్రం ఈ దారుణం చోటు చేసుకుంది. మూడేళ్ల బాలిక, తన ఐదేళ్ల సోదరుడుతో కలిసి ఆడుకోవడానికి బయటకు వెళ్లింది. ఆ సమయంలో షేక్ మున్నా అనే బస్సు క్లీనర్ బాలికకు చాక్లెట్ ఆశ చూపి బస్సులోకి తీసుకుని వెళ్లాడు. ఆమె సోదరుడు వెళ్లి ఈ విషయాన్ని తల్లికి తెలిపాడు.ఆమె స్థానికుల సహాయంతో బస్సు వద్దకు చేరుకుంది. తీవ్ర గాయాలతో ఉన్న బాలికను ఆర్‌జి కార్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆగ్రహంతో స్థానికులు మున్నాను చితకబాది, తరువాత పోలీసులకు అప్పగించారు.

జపాన్ యుద్ధ నౌక స్క్వాడ్రన్ కమాండర్‌గా తొలి మహిళ

టోక్యో : యుద్ధ నౌక స్క్వాడ్రన్ కమాండర్‌గా మొదటి మహిళను జపాన్ నావికాదళం మంగళవారం నియమించింది. ఈ పదవులకు పురుషులు అందుబాటులో లేని నేపథ్యంలో ఈ రంగంలోకి మరింత మంది మహిళలను ఆకర్షించే క్రమంలో ఈ నియామకం చేపట్టినట్లు తెలిపింది. కమాండర్ రోకో అజుమా (44) నాలుగు నౌకలు, మొత్తంగా వెయ్యి మంది సిబ్బందికి నాయకత్వం వహిస్తారు. వీరిలో కేవలం 30మంది మహిళలు మాత్రమే వున్నారు. వీరందరూ కలిసి మేరిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (ఎంఎస్‌డిఎఫ్) కి చెందిన ఫస్ట్ ఎస్కార్ట్ డివిజన్‌గా రూపొందారు. 'నేను మహిళను అని భావించడం లేదు. కమాండర్‌గా నా బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించడానికి నా శక్తిసామర్థ్యాలన్నింటినీ కేంద్రీకరిస్తున్నాను." అని అజుమా ప్రకటించారు.

మత ఘర్షణలు

మత ఘర్షణలతో శ్రీలంక అట్టుడికి పోతోంది. ఎటుచూసిన ఆందోళనలు రహదారుల దిగ్బంధనాలతో ఉద్రిక్తత వాతావరణం కనిపిస్తోంది. దీంతో దేశంలో 10 రోజులు అత్యవసర పరిస్థితి విధించారు.



శ్రీలంకలో ఎమర్జన్సీ

కొలంబో : మతోన్మాద ఘర్షణలు, హింస ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా వుండేందుకు ముందు జాగ్రత్త చర్యగా శ్రీలంకలో పది రోజుల పాటు అత్యవసర పరిస్థితి విధించినట్లు ప్రభుత్వ ప్రతినిధి మంగళవారం తెలిపారు. శ్రీలంక సెంట్రల్ జిల్లా కాండీలో బౌద్ధులు, ముస్లిమ్‌ల మధ్య ఘర్షణలు చెలరేగిన మరుసటి రోజు ఎమర్జన్సీ విధించారు. గత ఏడాది కాలంగా ఈ రెండు కమ్యూనిటీల మధ్య ఉద్రికత్తలు పెరుగుతున్నాయి. ఇస్లాంలోకి మారాలంటూ ప్రజలపై ముస్లింలు ఒత్తిడి తీసుకువస్తున్నారని, బౌద్ధుల పురావస్తు ప్రాంతాలను ధ్వంసం చేస్తున్నారని కొన్ని బౌద్ధ గ్రూపులు ఆరోపిస్తున్నాయి. రోహింగ్యా ముస్లిం శరణార్థులు శ్రీలంకకు రావడాన్ని కొంతమంది బౌద్ధ జాతీయవాదులు నిరసిస్తున్నారు. మతోన్మాద ఘర్షణలు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా వుండేందుకు పది రోజుల పాటు అత్యవసర పరిస్థితి విధించాలని ప్రత్యేక మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్లు ప్రభుత్వ ప్రతినిధి దయసిరి జయశేఖర తెలిపారు. ఫేస్‌బుక్ ద్వారా హింసను రెచ్చగొట్టాలని ప్రయత్నించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు.

ఇటలీలో హంగ్ పార్లమెంట్

బెర్లుస్కోనికి గట్టి ఎదురు దెబ్బ

అతి పెద్ద పార్టీగా ఫైవ్‌స్టార్ మూవ్‌మెంట్ పార్టీ

రోమ్: ఆదివారం జరిగిన ఇటలీ పార్లమెంటు ఎన్నికల్లో శత కోటీశ్వరుడు, మీడియా మొఘల్, ఇటలీ రాజకీయాలను రెండు దశాబ్దాలకు పైగా శాసించిన సిల్వియో బెర్లుస్కోనికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి కుంభకోణాలకు పేరుమోసిన బెర్లుస్కోనిని పన్నుల అక్రమాల కేసులో దోషిగా తేలడంతో ఆయనను పోటీకి అనర్హునిగా ప్రకటించారు. దీంతో ఆయన తనకు నమ్మిన బంటుగా వున్న ప్రధానిని వారసునిగా బరిలోకి దింపాడు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న దాంతో మాటియో నేతృత్వంలోని పచ్చి మితవాద లీగ్ పార్టీతోను, ఇటాలియ బ్రదర్స్ వంటి పార్టీలతో చేతులు కలిపాడు. ఈ ఎన్నికల్లో తమదే పైచేయి అన్న ధీమాతో వున్న బెర్లుస్కోని పార్టీకి 14.5 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆయన పార్టీ జత కలిసిన సంకీర్ణ కూటమి రెండో స్థానంలో నిలిచింది. సాంప్రదాయక పార్టీకి ఇటలీ ఓటర్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారన డానికి ఈ ఫలితాలు ఒక నిదర్శనం. పోలయిన ఓట్లలో సింహభాగం పొందిన పచ్చి మితవాద లీగ్ కూటమి తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ కూటమిలో మోసం అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ నేతృత్వంలోని ఫోర్జా ఇటాలియా, చిన్న పార్టీలయిన బ్రదర్స్ ఆఫ్ ఇటలీ, యుఎస విత్ ఇటలీ భాగస్వాములుగా వున్నాయి. ఓట్ల లెక్కింపునకు ముందు బెర్లుస్కోని నేతృత్వంలోని ఫోర్జా ఇటాలియా పార్టీ ప్రధాన శక్తిగా అవతరిస్తుందని అందరూ భావించినప్పటికీ మాటియో సాల్విని నేతృత్వంలోని లీగ్ మొత్తమ్మీద17 శాతం ఓట్ల ఆధిక్యత సాధించినప్పటికీ ఫోర్జా ఇటాలియా 14.5 శాతం వద్దే చతికిలపడింది. లీగ్‌కు చెందిన నేత మాటియో శాల్వినీ మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రజలు తమ తీర్పులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కును తమకు కల్పించారని అన్నారు. ఇన్వెస్టర్లు భయపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇదిలా వుండగా పార్లమెంట్‌లో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన ప్రభుత్వ వ్యతిరేక 5 స్టార్ మూమెంట్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు తాము సిద్ధంగా వున్నట్లు ప్రకటించింది. భావ సారూప్యత కలిగిన అన్ని రాజకీయ శక్తులతో చర్చలకు తాము సిద్ధంగా వున్నామని పార్టీనేత లుయిగి డిమాయియో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటలీలో ప్రభుత్వ ఏర్పాటు బాధ్యత తమకే వుందని, తాము దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ శక్తిగా ఎదిగామని ఆయన తన ప్రకటనలో వివరించారు. ఓట్ల లెక్కింపు కొనసాగుతూ ఫలితాలు వెలువడుతున్న కొద్దీ మూడు ప్రధాన కూటముల్లో ఏ ఒక్కదానికీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ లభించే సూచనలు కన్పించకపోవటంతో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుపై ఆయా కూటములు దృష్టి సారించాయి.



రోమ్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలో ఫొటోగ్రాఫర్లకు పోజు ఇస్తున్న మితవాద కూటమి నేతలు (ఎడమ నుంచి కుడివైపు వరుసగా) పచ్చి మితవాద బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీ నేత జార్జియా మెలోనీ, ఫోర్జా ఇటాలియా పార్టీ నేత సిల్వియో బెర్లుస్కోని, యూరోస్కెప్టిక్ పార్టీ లీగ్ నేత మాటియో శాల్విని, అజ్ విత్ ఇటలీ పార్టీ నేత రాఫెలీ ఫిటో.

ఆధునిక సోషలిస్టు దేశంగా చైనా

దశల వారీ కార్యాచరణను ప్రకటించిన పార్లమెంట్

బీజింగ్ : చైనాను గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా తీర్చిదిద్దడానికి రానున్న సంవత్సరాల్లో చేపట్టాల్సిన చర్యలను ఇక్కడ జరుగుతున్న పార్లమెంట్ (ఎన్‌పిసి) వార్షిక సమావేశాల్లో ప్రకటించారు. గత అక్టోబరులో చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) 19వ జాతీయ మహాసభలో ఈ దార్శనికత, రెండంచెల దృక్పథం రూపుదిద్దుకుంది. 2035కల్లా సోషలిస్టు ఆధునీకరణను ప్రాథమికంగా పూర్తి చేసేందుకు, ఈ శతాబ్దం మధ్య నాటికల్లా చైనాను గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ దార్శనికతను సిద్ధం చేశారు. పార్టీ మహాసభ తర్వాత జరుగుతున్న కీలకమైన ఈ పార్లమెంట్ సమావేశాల్లో పార్టీ ప్రణాళికను దశలవారీల్లో కార్యాచరణగా మార్చేందుకు గట్టి పునాది పడుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జరుగుతున్న ఈ సమావేశాలకు దాదాపు 3వేల మంది ఎన్‌పిసి డిప్యూటీలు హాజరయ్యారు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రధాని లీ కెకియాంగ్ నివేదిక సమర్పించారు. ప్రస్తుత లక్ష్యాలన్నింటినీ వాస్తవ రూపం కల్పించేందుకు మనందరం కలిసి కృషి చేయాల్సి వుందని లీ పిలుపిచ్చారు. దేశ, విదేశాల్లో సంక్లిష్టమైన వాతావరణం నెలకొన్నప్పటికీ గత ఐదేళ్ల కాలంలో చైనా చారిత్రకమైన విజయాలు సాధించిందని చెప్పారు. హై స్పీడ్ రైల్, ఇ-కామర్స్, మొబైల్ చెల్లింపులు వంటి రంగాల్లో చైనా అగ్ర స్థానంలో వుందన్నారు.

రష్యా అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా జోక్యం?

విదేశీ గూఢచారుల యత్నాలు భగ్నం చేశామన్న పుతిన్

మాస్కో : తమ దేశ అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి అమెరికా ప్రయత్నిస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. గతేడాది 400మందికి పైగా విదేశీ గూఢచారుల యత్నాలను భగ్నం చేసినట్లు చెప్పారు. దేశ రాజకీయ, ఆర్థిక, సైనిక సమాచారాన్ని సంపాదించేందుకు మరిన్ని విదేశీ కుట్రలు జరిగే అవకాశం వుందని, వాటిని నిరోధించాల్సిందిగా పుతిన్ దేశ నిఘా సంస్థ ఎఫ్‌ఎస్‌బిని కోరారు. మార్చి 18న జరగనున్న రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ తిరిగి అధ్యక్షుడుగా విజయం సాధించే అవకాశం వుందని భావిస్తున్నారు. మాస్కోలో సోమవారం ఎఫ్‌ఎస్‌బి ఉద్యోగులను ఉద్దేశించి పుతిన్ ప్రసంగిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. రష్యా సైబర్ రక్షణ విధానాలను మరింత పటిష్టపరచాల్సిన అవసరం వుందని, అధికారులు ఉపయోగించే రహస్య సమాచార వ్యవస్థల భద్రతను బలోపేతం చేయాల్సి వుందని పుతిన్ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో విదేశీ నిఘా సంస్థల కార్యకలాపాలు బాగా పెరిగాయని అన్నారు. అత్యంత అధునాతనమైన గూఢచారి విమానాలు, సాంకేతిక గూఢచర్య పద్ధతులను ఉపయోగించి రష్యాపై దృష్టి పెట్టి ఇక్కడ సమాచారం సేకరించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. గత ఏడాది 72మంది నిఘా అధికారులు, 397మంది విదేశీ గూఢచర్య ఏజెంట్ల కార్యకలాపాలను భగ్నం చేశామని చెప్పారు.

ద.కొరియా అధికారులతో కిమ్ జోంగ్ ఉన్ భేటీ

- **ఇరు దేశాల మధ్య సంబంధాల పటిష్టతకు కృషి**

సియోల్ : ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ మొదటిసారిగా దక్షిణ కొరియా సీనియర్ ప్రభుత్వ ఉద్యోగులతో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్ళాలన్నది తన ధృడ నిశ్చయమని అన్నారు. ఉభయ కొరియాల పునరేకీరణ క్రమాన్ని కొనసాగి స్తామని చెప్పినట్లు ఉత్తర కొరియా అధికార వార్తా సంస్థ (కెసిఎన్ఎ) మంగళవారం తెలిపింది. జాతీ య భద్రతా కార్యాలయ అధిపతి చుంగ్ ఇయు యాంగ్ నేతృత్వంలోని 10మంది సభ్యుల దక్షిణ కొరియా ప్రతినిధి బృందం ఉత్తర కొరియా రాజ ధాని ప్యాం గాంగ్‌కు సోమవారం చేరుకుంది. ఉత్తర కొరియా, అమెరికాల మధ్య చర్చలు జరిగేలా చూసేందుకు ఈ బృందం ఇక్కడకు చేరుకుంది. ఉత్తర కొరియా అణు, క్షిపణి కార్యక్రమంపై ఇరు దేశాల మధ్య గత కొన్ని మాసాలుగా ఉద్రిక్త పరిస్థి తులు నెలకొన్నాయి. ఇటీవల దక్షిణ కొరియాలో వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా ఉభయ కొరియాల మధ్య ఉద్రిక్తతలు సడలాయి. ఉత్తర కొరియా ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గానికి దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ ఆతిథ్యమిచ్చారు. తమ దేశంలో నిర్వహించే సదస్సు కు రావాల్సిందిగా కిమ్, మూన్‌ను ఆహ్వానించారు. దక్షిణ కొరియా ప్రత్యేక దూత ద్వారా సదస్సుకు రావా లని అధ్యక్షుడు మూన్ భావిస్తున్నారన్న సమాచారం అందగానే ఉభయ వర్గాల మధ్య సంతృప్తికరమైన ఒప్పందం కుదిరిందని కెసిఎన్ఎ తెలిపింది. అయితే ఆ ఒప్పందం వివరాలు ఏమిటన్నది తెలియరాలేదు.

మయన్మార్‌లో రోహింగ్యాలపై కొనసాగుతున్న హింస

ఐరాస ఆందోళన

యాంగాన్: మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింల 'నిర్మూలన ప్రక్రియ' ఇప్పటికీ కొనసాగుతున్నదని ఐరాస మానవ హక్కుల కమిషన్ అధికారి ఆండ్రూ గిల్మర్ ఆందోళన వ్యక్తంచేశారు. పొరుగునే వున్న బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్‌లో నాలుగు రోజుల పర్యటన ముగించుకున్న ఆయన కాక్స్ బజా ర్‌లో తానుచూసిన, విన్న సమాచారాన్ని బట్టి ఈ సమస్యకు కనుచూపు మేరలో ముగింపు కన్పించటం లేదన్న అభిప్రాయానికి వచ్చినట్లు మంగళవారం విడుదల చేసిన మీడియా ప్రకటనలో పేర్కొ న్నారు. గత ఆగస్టులో రోహింగ్యా తీవ్రవాదులు పోలీసు పోస్టులు, సైనిక శిబిరంపై చేసిన దాడులకు ప్రతీకారంగా మయన్మార్ సైన్యం వారిపై సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. సైనికుల దాడులకు తట్టుకోలేని రోహిం గ్యాలు పొరుగునే వున్న బంగ్లాదేశ్‌కు వలసబాట పట్టారు. మయన్మార్ సైనిక చర్య రోహింగ్యా ముస్లింల 'నిర్మూలన'కు ఉద్దేశించిందే నంటూ ఐరాస, అమెరికా, మరికొన్ని దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గత ఏడాది రక్తపాతం, సామూహిక లైంగిక దాడు లతో ప్రారంభమైన ఈ హింస ఇప్పుడు ఆకలిచావుల రూపంలోకి మారుతోందని గిల్మర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పుడు మయన్మార్‌లో రోహింగ్యా లపై హింస మరింత విస్తరించి వ్యవస్థీకృతమైనట్లు కన్పిస్తోం దని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. మయన్మార్ నుండి రోహింగ్యాలను పూర్తిగా తరిమివేసే వరకూ ఈ హింస కొనసాగే ప్రమాదం వుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌తో గత నవంబర్‌లో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రోహింగ్యా శరణార్థులను వెనక్కి రప్పించేందుకు తాము సిద్ధంగా వున్నటు మయన్మార్ చెబుతున్నా ప్రస్తుత పరిస్థితుల్లో వారి భద్రతకు, ఆత్మగౌరవానికి ముప్పు పొంచి వున్నందున వారు తిరిగి వచ్చే అవకాశం కన్పించటం లేదని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

బిజెపితో తెగతెంపులకే మొగ్గు

ప్రధాని ఏవైతే హామీలు ఇచ్చారో...వాటిని నిలబెట్టుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఓట్లు వేశారని, వారికి జవాబుదారీ పాలన అందించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు.

ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించడం లేదు

తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఓ ప్రతిపక్ష పార్టీ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడం అనేది ఎప్పుడూ చూడలేదన్నారు. అభివృద్ధిని అడ్డుకోవడమే ప్రతిపక్ష పార్టీ ప్రధాన ఎజెండాగా ఉందని విమర్శించారు. ప్రజలు అధికారం ఇచ్చింది ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించడం, చట్టాలు చేయడం, అందుకు ఎవరి వంతు వారు తమ కర్తవ్యం వారు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. అయితే ఇందులో అధికార పార్టీకి ఎక్కువ బాధ్యత ఉంటుందన్నారు. అదే సమయంలో బాధ్యత కలిగిన ప్రతిపక్షం ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ నిర్మాణా త్మక పాత్ర పోషిస్తూ, రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేయాలన్నారు. కానీ దురదృష్టవ శాత్తు ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటోందని విమర్శించారు. అభివృద్ధి పనులపై కేంద్రానికి ఫిర్యాదులు చేయడం, నిధులు రాకుండా అడ్డుపడటం, పోలవరం ప్రాజెక్టుకు అడ్డంకులు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అన్ని పనులు సజావుగా జరిగిపోతే తమకు చెడ్డపేరు వస్తుంది, మాట్లాడేందుకు వారికేం ఉండదు.. కాబట్టి అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నార న్నారు. 'ఇది నాలుగో బడ్జెట్ సమావేశం... వచ్చే బడ్జెట్ సెషన్ అప్పటి పరిస్థితిని బట్టి ఉంటుంది' అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడితే...రాష్ట్ర ప్రభుత్వం కచ్చింతంగా బడ్జెట్ ప్రవేశ పెట్టాల్సి వస్తుందన్నారు.

శాసన సభ్యులంతా తప్పనిసరిగా సమావేశాలకు హాజరై, ప్రజా సమస్యలపై చర్చలకు అధిక ప్రాధానం ఇవ్వాలని సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నా...అధికారంలో ఉన్నా...ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపుతూ ప్రజల్ని మెప్పించేలా పనిచేస్తున్నామ న్నారు. సమావేశాలు జరిగే ఈ18-19 రోజులు సభ్యులంతా తప్పనిసరిగా సభకు హాజరై అర్థవంతమైన చర్చలు జరపాలని సూచించారు.

ప్రత్యేక హోదా రాజకీయ పోరాటం కాదు

ప్రత్యేక హోదా అనేది రాజకీయ పోరాటం కాదని, ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన ధర్నాలో పాల్గొన్న రాహుల్ గాంధీ ప్రత్యేక హోదాపై చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్పందించారు. రెండు పార్టీలు కలిసే బిల్లు పాస్ చేశాయని, ప్రజల మనోభావాలను పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయామనే ఆవేదన ప్రజల్లో ఉందన్నారు. పోలవరానికి ఖర్చు చేసిన రూ. 3,200 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రస్తావనే లేకపోవడంతో నిలదీశామన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే కేంద్రంపై పోరాడుతున్నామని స్పష్టం చేశారు. హోదా, రాయితీల గురించి మొదటి నుంచి అడుగుతున్నామని తెలిపారు. విభజన చట్టంలో చెప్పినవన్నీ ఇవ్వాలని గవర్నర్ ప్రసంగంలో కూడా పెట్టామని, ప్రజల మనోభావాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. విభజన హామీల సాధన కోసం రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు.

ఒకటీ రెండు రోజుల్లో ప్రకటన ?

బిజెపితో తెగతెంపులకు టిడిపి నాయకత్వం అంగీ కరించడంతో ఒక్కసారిగా పెనుమార్పులు మొదల య్యాయి. బిజెపి నాయకత్వం దీనిపై స్పందించేందుకు ఇష్టపడటం లేదు. మరోవైపు కేంద్రంలో ఎంపిలు కూడా ఆయా పార్టీలను కలుస్తుండటం, తెలంగాణలో కెసిఆర్ థర్డ్‌ఫ్రంట్ ప్రస్తావన తీసుకొస్తుండటంతో రాష్ట్రంలో రాజకీయాలో ఒక్కసారిగా వేడెక్కాయి. బడ్జెట్ ముందు రోజు ఈ రాజకీయ ప్రకటన రావడం వ్యూహాత్మకమా ? లేక ముందస్తు ప్రణాళికా అనేది అర్థం కావడం లేదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రం కూడా హోదా ఇవ్వడం సాధ్యం కాదని చెప్పడంతో కేంద్రస్థాయిలో నాయకత్వం అక్కడ ఇతర పక్షాలను కలిసే పనిలో నిగమ్నమైంది. ఒకటీ రెండు రోజుల్లో బిజెపితో తెగదెంపులపై స్పష్టమైన ప్రకటన రాగలదంటున్నారు. మంగళవారం అసెంబ్లీలో వాతావరణం వేడెక్కింది. తాము తలుచుకుంటే రోడ్డుపై పడతారని అటు టిడిపి నాయకులు, ఇటు బిజెపి నాయకులు ఒకరిపై ఒకరు వాగ్బాణాలు గుప్పించుకుంటున్నారు. అయినా మిత్రపక్ష ధర్మం పాటిస్తున్నామని చెబుతున్నారు. టిడిపి నాయకత్వం పార్టీ అధికారిక ఫేస్‌బుక్‌లో మోడీని తీవ్రంగా విమర్శిస్తూ పోస్టులు పెట్టారని, దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యేలు వీర్రాజు, మాధవ్ వ్యాఖ్యానించారు. బిజెపి నాయకత్వం మంగళవారం రాత్రి విజయవాడలో సమావేశమైనట్లు తెలిసింది. టిడిపి తీరుపై నాయకత్వం చర్చించినట్లు తెలిసింది.

మొదటి పేజీ తరువాయి

భిక్ష కాదు.. మా హక్కు" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు పిల్లి మొగ్గలేస్తున్నారని విమర్శించారు. నాలుగేళ్ల క్రితం తాము ప్రత్యేక హోదా గురించి తాము అడిగితే, అప్పుడు చంద్రబాబు హోదా వద్దన్నారని గుర్తు చేశారు. "ఎన్నికలకు ముందు చంద్రబాబు హోదా అన్నారు. తరువాత ప్యాకేజీ అన్నారు. ఆ తరువాత ప్రత్యేక సాయమన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడేసరికి మళ్లీ హోదా అంటున్నాడు. ఇలా పిల్లి మొగ్గలేస్తోన్నాడు. దీంతో రాష్ట్రంలోని పిల్లులన్ని చంద్రబాబులా పిల్లి మొగ్గలు వేయలేకపోతున్నా మని సిగ్గుపడుతున్నాయి" అని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే బిజెపికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలో భాగస్వామ్యం కావాలని సూచించారు. హోదా ఉద్యమంలో భాగస్వామ్యం కాకపోతే, ఆంధ్ర ప్రజలకు ద్రోహం చేసినట్లని అన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఇటీవల చంద్రబాబు అఖిల పక్షం వేస్తామని ప్రకటించా రని, అంతలోనే అఖిలపక్షం కాదు, అఖిల సంఘాల సమావేశమని మాటమార్చరని విమర్శించారు. అఖిల పక్షమేంటో? అఖిల సంఘాలేంటో? ఆయన చెప్పాలని అన్నారు. నాలుగేళ్లలో అఖిల పక్షం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు నూకలు చెల్లే పరిస్థితి వచ్చింది కనుకనే అఖిల పక్షాలు గుర్తుకొచ్చాయని దుయ్యబట్టారు.

హోరెత్తిన హస్తిన

పార్లమెంట్‌లో లేవనెత్తుతాం : డి.రాజా

ఏపి ప్రత్యేక హోదా అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతామని సిపిఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ ఎంపి డి.రాజా పేర్కొన్నారు. ఏపి ప్రజల ఆకాంక్షలకు ప్రస్తుత ప్రభుత్వం గౌరవం ఇవ్వటం లేదని అన్నారు. ఏపి ప్రత్యేక హోదా హామీని గత ప్రధాని మన్మోహన్ సింగ్ సాక్షాత్తు ప్రజాస్వామ్య వేదికైన పార్లమెంట్‌లో ఇచ్చారని గుర్తు చేశారు. దాన్ని అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం ఏపి ప్రజలను తప్పుదోవపట్టిస్తోందని విమర్శించారు.

విభజన చట్టాన్ని మరిచిపోయారా? : పి.మధు

గత నాలుగేళ్లలో విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని, కేంద్ర ప్రభుత్వం విభజన చట్టాన్ని మరిచిపోయిందా? అని అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రశ్నించారు. విభజన చట్టంలోని అంశాలు అమలు కాకపోడమేకాదు, పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదాను అటకెక్కించారని విమర్శిం చారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని దుయ్య బట్టారు. టిడిపి, బిజెపి తప్ప అన్ని రాజకీయ పార్టీలు తమ మద్దతును తెలిపాయని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఎలా పోరాడామో, హోదా సాధన కోసం అలాగే పోరాడాలని పిలుపునిచ్చారు.

భేటీలతో మళ్లీ మోసం : కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

ఏపికి ప్రత్యేక హోదాపై టిడిపి, బిజెపిలు మళ్లీ మోసం చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, జగన్ పనులు ఆపుకొని ఢిల్లీకి వస్తే, అందరం ఐక్యంగా కేంద్రాన్ని నిలదీయవచ్చునని అన్నారు. ఈ పోరాటంలో అందరు భాగస్వాములు కావాలని పిలుపు ఇచ్చారు. ఈ ధర్నాలో సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, సిపిఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆప్ నేత రామారావు, ప్రత్యేక హోదా సాధన సమితి నేత ప్రొఫెసర్ సదా శివ రెడ్డి, ఆదికవి నన్నయ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జార్జి విక్టరి, ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్.పుణ్యవతి, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వల్లీ ఉల్లా ఖాద్రీ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుధాకర్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామన్న, ఎఐవైఎఫ్ నేత లెనిన్ బాబు, వివిధ ప్రజా సంఘాల నేతలు, అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు వైసిపి ఎంపిలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, సీనియర్ నేత బొత్స సత్యన్నారాయణ, కాంగ్రెస్ ఎంపిలు కెవిపి రామచంద్రరావు, సుబ్బిరామిరెడ్డి, సిపిఐ ఎంపి డి.రాజా, సినీ విమర్శకుడు కత్తి మహేష్, ఆప్ ఎంపి సంజయ్ సింగ్, కాంగ్రెస్ నేతలు కాసు కృష్ణా రెడ్డి, తులసి రెడ్డి, వైసిపి మాజీ నేత గౌతం రెడ్డి, ఎంఆర్పీఎస్ నేత చిన్న తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా

మొదటి పేజీ తరువాయి

పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష"లో రాహుల్ గాంధీ పాల్గొని సంఘీభావం తెలిపారు.. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా సాధనలో ఆంధ్రులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు అను గుణంగా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి, ఎంపి కెవిపి రామచంద్రరావు, సుబ్బిరామి రెడ్డి, మాజీ కేంద్ర మంత్రులు పల్లం రాజు, జె.డి శీలం, సీనియర్ నేతలు కొప్పెల రాజు, రుద్రరాజు, శైలజ నాథ్, నాదెండ్ల మనోహర్, బాపిరాజు, కొణతాల రామకృష్ణ, సుంకర పద్మశ్రీ, గంగాభవాని, కమలమ్మ సహా పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోదా ఇవ్వలేం..!

మొదటి పేజీ తరువాయి

నిర్ణయాలను కూడా ఇలా లీక్ చేసిన తరువాతే కేంద్రం అధికారికంగా ప్రకటించిందని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు.

తెరపైకి ఇతర రాష్ట్రాల సాకు

సమైక్య రాష్ట్ర విభజన సమయంలో రాజ్యసభలో ప్రధాని ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదా ప్రకటించాలని రాష్ట్ర ప్రజలు డిమాండ్ చేస్తుండగా కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇతర రాష్ట్రాలను వివాదంలోకి లాగాలని చూస్తోంది. ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్న సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్ కన్నా వెనుకబడిన రాష్ట్రాలు ఉన్నాయని, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు కూడా ఇదే డిమాండ్‌ను లేవనెత్తే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలను కూడా పట్టించుకోకూడదని నిర్ణయించుకున్నట్లు ఉన్నతస్థాయి అధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నేతలు ఆంధ్రప్రదేశ్ నేతలు తెలుగు వారి ఆత్మగౌరవం అంటూ రాజకీయ వేడిని రగులుస్తున్నారని, ఇలాంటి సెంటిమెంట్ అంశాలకు లొంగితే తమిళనాడు, కేరళ రాష్ట్రాలు కూడా ఇదే అంశాన్ని లేవనెత్తే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోందని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.. ఈ నాలుగేళ్లలో పోలవరం, రెవెన్యూ లోటు సహా పలు పద్దుల కింద రూ.12,500 కోట్లు రాష్ట్రానికి ఇచ్చినా రాష్ట్రం ఒక్క రూపాయికి కూడా లెక్కలు చూపలేదని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు అంటున్నారు.

విద్యుత్ కార్మికుల సమ్మె విరమణ

మొదటి పేజీ తరువాయి

మంగళవారం విద్యుత్ సౌధలో కార్మికుల ఐక్య వేదికతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చల్లో ఐక్య వేదిక చైర్మన్ పి.కాశీ మధుబాబు, సెక్రటరీ జనరల్ బాలకాశి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్‌లో దీక్షా శిబిరంలో కార్మికులకు ఈ చర్చల వివరాలను ఐక్య వేదిక నాయకులు వివరించారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 9వ తేదీన పూర్తి స్థాయిలో చర్చలు నిర్వహించి, విద్యుత్ సంస్థలు పరిధిలో ఉన్న అంశాలను సంస్థ పరిష్కరించడంతోపాటు, ఇతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. నేరుగా జీతాలు చెల్లించే పద్ధతిని దశల వారీగా అమలు, పీసు రేట్ విధానాన్ని కచ్చితంగా రద్దు చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు చెప్పారు. 9వ తేదీ చర్చల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి తేదీలతో సహా స్పష్టమైన హామీలను లిఖిత పూర్వకంగా పొందుతామని ఐక్య వేదిక ప్రకటించింది. దీక్షా శిబిరానికి వచ్చిన ట్రాన్స్‌కో సిఇ ప్రకాష్ మాట్లాడుతూ చర్చలకు సామరస్య పూర్వక వాతావరణం కల్పించాలని, కార్మికుల సమ్మె విరమించి విధులకు హాజరు కావాలన్నారు. నిరాహార దీక్ష చేస్తున్న నాయకులకు నిమ్మరసం ఇచ్చారు. ఐక్య వేదిక ఛైర్మెన్ పి.కాశీ మధుబాబు, సెక్రటరీ జనరల్ బాలకాశీ, ట్రెజరర్ చంద్రశేఖర్, ఛీప్ కో ఆర్డినేటర్ జి.హారతి, కో కన్వీనర్ కట్టా నాగరాజు, విటిపిఎస్ నాయకురాలు సరోజ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడు రోజులు పాటు నిరాహార దీక్షలు చేయగా, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రామారావులు రెండు రోజులు నిరాహార దీక్షలు చేశారు.

విద్యా హక్కు అమలు చేయరేం?

కోరుతూ వనపర్తి జిల్లా ఆత్మకూరు నుంచి నుంచి తిప్పారెడ్డి రాసిన లేఖను కూడా హైకోర్టు పిల్‌గా పరిగణించి రెండు వ్యాజ్యాలపై బెంచ్ విచారణ చేపట్టింది. ప్రైవేటు బడుల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలనే చట్ట నిబంధన అమలు జరగడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో వసూలు చేసే ఫీజుల పూర్తి వివరాలేవీ కూడా విద్యాధికారి దగ్గర పొందుపర్చలేదు. చట్ట స్ఫూర్తిని ప్రభుత్వాలు నీరుగార్చుతున్నాయి. పేదలకు ప్రాథమిక విద్యలో ఫీజు రీయింబ్స్‌మెంట్ ఇవ్వడం లేదు. ఉన్నత విద్యకు మాత్రమే ప్రభుత్వాలు ఇస్తున్నాయి. దీని వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతాయి. చట్టం అమలు జరిగేలా హైకోర్టు చర్యలు తీసుకోవాలి.. అని యోగేష్ వాదించారు. ఈ చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పడిపోతుందని ఎపి ప్రభుత్వ లాయర్ చెప్పారు. విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

సభ ముందుకు పోలీస్ ఆర్డినెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిజిపి నూతన నియామకానికి సంబంధించి గవర్నర్ నరసింహన్ 2017 డిసెంబర్ 25న జారీ చేసిన పోలీస్ ఆర్డినెన్స్‌ను ఆమోదం కోసం మంగళవారం శాసనసభలో ప్రవేశ పెట్టారు. డిజిపి నియామక విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అభిప్రాయభేదాలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వమే డిజిపిని నియమించుకునే వెసులుబాటు కోసం ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ కొత్త ఆర్డినెన్స్ ప్రకారమే ప్రస్తుత డిజిపి మాలకొండయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏదైనా ఆర్డినెన్స్ జారీ అయిన ఆరు నెలలలోపు చట్ట సభల ఆమోదం పొందవలసి ఉంది. అందువల్ల ఈ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఎమ్మెల్యే ప్రభాకరచౌదరి సభలో ప్రవేశ పెట్టారు. ఈ సమావేశాల్లోనే ఆర్డినెన్స్‌ను ఆమోదించి చట్టరూపంలో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది.

బాబు పాలనలో సేద్యానికి సంక్షోభమే : వైసిపి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో


చంద్రబాబునాయుడి పాలనలో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకు పోయిందని వైసిపి రైతు విభాగం అధ్యక్షుడు ఎంవిఎస్ నాగిరెడ్డి విమర్శించారు. గవర్నర్ ప్రసంగంలో వ్యవ సాయంపై చంద్రబాబు అసత్యాలు చెప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మినుములు, పెసలు, జొన్నలు, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు మద్దతు ధర లేదన్నారు. వ్యవసాయం సంక్షోభంలో ఉంటే ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు.

గుంటూరులో డయేరియా విజృంభణ

మొదటి పేజీ తరువాయి

రోజుకూ పెరుగుతుండటంతో ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సోమవారం బారం ఇమాం పంజా ప్రాంతానికి చెందిన అంధురాలైన సయ్యద్ షబీనా(28), మంగళవారం జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆనంద్‌పేటకు చెందిన బీబీజాన్(68), ఫాతిమున్నీసా(55), మరో ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంటూరు రాజుగారితోటకు చెందిన గోపికృష్ణ(20) మృతి చెందారు. దీంతో అధికారుల్లో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. బిఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలోనే కాలుష్యం జరిగిందని అధికారులు గుర్తించారు. మంగళవారం కలెక్టర్ కోన శశిధర్ నగరంలోని పొన్నూరు రోడ్డులోని ఆనందపేటను సందర్శించి, అతిసార వ్యాధి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిలో పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామని, డయేరియా బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. అనంతరం జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని గూర్చి ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజునాయుడును అడిగి తెలుసుకున్నారు. జిజిహెచ్ సమావేశ మందిరంలో కలెక్టర్ కోన శశిధర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా అనూరాధ, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు యాస్మిన్‌లతో సమావేశమయి పరిస్థితిని సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. గోరంట్ల జ్వరాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సిపిఎం నగర కార్యదర్శి కె నళినికాంత్ తదితరులు పరామర్శించారు.

పడి పడి లేచే మనసు



శర్వానంద్

శర్వానంద, దర్శకుడు హనురాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి 'పడి పడి లేచే మనసు' టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని శర్వానంద్ జన్మదినం సందర్భంగా చిత్రంబృందం ప్రకటిస్తూ ఆ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. శ్రీలక్ష్మీ వెంకటేశ్వరా సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి–ప్రసాద్ చుక్కపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయికగా నటిస్తుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుధాకర్ చెరుకూరి–ప్రసాద్ చుక్కపల్లి మాట్లాడుతూ 'ఇది ఒక డిఫరెంట్, క్రియేటివ్ లవ్ స్టోరీ. ప్రస్తుతం కలకత్తాలో హీరో శర్వానంద్, హీరోయిన్ సాయిపల్లవి, మురళీశర్మల కాంబినేషన్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరిస్తున్నాం. వెంకట్ మాస్టర్ నేతృత్వంలో కొన్ని యాక్షన్ సీన్స్ కూడా ఈ షెడ్యూల్‌లో షూట్ చేయనున్నాం. విశాల్ చంద్రశేఖర్ సంగీతం, జయకృష్ణ సినిమాటోగ్రఫీ సినిమాకి ప్రత్యేక ఆకర్షణలుగా నిలవనున్నాయి. టైటిల్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది" అని అన్నారు. ఈ చిత్రానికి ఫైట్స్ : వెంకట్, అంబు–అరివ్, సంగీతం : విశాల్ చంద్రశేఖర్, ఛాయాగ్రహణం : జయకృష్ణ గుమ్మడి.

భరత్ విజన్ ఇదే



కొరటాల శివ తన సినిమాల్లో సామాజిక విలువలకు పెద్దపీట వేస్తారు. కథ క్లాస్ అయినా మాస్ అయినా సమాజానికి ఉపయోగపడే సందేశం అందులో తప్పకుండా ఉంటుంది. ఇప్పుడు తాజాగా మహేష్ బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో 'భరత్ అనే నేను' చిత్రం తీస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ చిత్రంలో హీరో ఏం చేయబోతున్నాడో ఆ టీజర్ ద్వారా స్పష్టం చేశారు. తాజాగా మంగళవారం ఈ చిత్రం మరో టీజర్‌ను, ప్రజలతో రచ్చబండపై మహేష్ బాబు కూర్చొని మాట్లాడుతున్న ఫొటోను విడుదల చేశారు. ఈ టీజర్‌లో...'చిన్నప్పుడు మా అమ్మ నాకు ఓ మాట చెప్పింది. ఒకసారి ప్రమాణం చేసి ఆ మాట తప్పితే నువ్వు మనిషివి అనిపించుకోవు అని.... ఎప్పటికీ ఆ మాట తప్పలేదు, మర్చిపోలేదు. నా జీవితంలోనే అతి పెద్ద ప్రమాణం చేయాల్సి వచ్చింది. పెద్దదే కాదు కష్టమైంది కూడా....కానీ.. ఎంత కష్టమైనా ఆ మాట కూడా తప్పలేదు. ఎందుకంటే నేను మనిషిని. మనం సమాజంలో నివసిస్తున్నాం. ప్రతి ఒక్కళ్లకి భయం, బాధ్యత ఉండాలి....భరత్ అనే నేను....అంటూ ప్రమాణం చేయడంతో టీజర్ ముగిసింది. భరత్ రామ్ ముఖ్యమంత్రి అనే నేమ్‌ప్లేట్ మహేష్ చూపించారు. ఈ టీజర్ ద్వారా మహేష్‌బాబు పాత్ర తీరు ఎలా ఉంటుందో అర్థమవుతుంది. అందుకే దీన్ని 'భరత్ విజన్'పేరుతో విడుదల చేశారు. మహేష్ గెటప్ మాత్రం ఓ రాజకీయ నాయకుడిలా కాకుండా ఈ చిత్రం ఫస్ట్‌లుక్ ఏ విధంగా ఉందో టీజర్ మొత్తం అలానే కనిపించారు. ఇందులో కైరా అద్వాని కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సినిమాను నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ బాణీలు అందిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 20న విడుదల కానుంది.

అవన్నీ పుకార్లేనండీ - నిఖిల్



"ప్రతి సినిమా కొత్త అనుభూతినిస్తుంది. అయితే అందులో మనకు కొన్ని సినిమాలు అలా గుర్తుండిపోతాయంతే. 'హ్యాపీడేస్', 'యువత', 'కార్తికేయ' సినిమాలు గుర్తుండిపోయాయి. అలాగే ఈ 'కిరాక్ పార్టీ' కూడా. ఎందుకంటే నేను కాలేజ్ ఫిలిం చేసి 11 ఏళ్లవుతుంది. కాలేజ్‌కి కూడా వెళ్లడం.. అక్కడి వారిని కలవడం అన్ని చూసి నాకు హ్యాపీడేస్ రోజులు గుర్తుకు వచ్చాయి. హ్యాపీడేస్ తర్వాత ఓ పూర్తిస్థాయి కాలేజ్ సినిమా చేయలేదు" అని నిఖిల్ అన్నారు. ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిఖిల్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొపి శెట్టి దర్శకుడు. ఈనెల 16న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా మంగళవారం ఈ హీరో చెప్పిన విశేషాలు.

- 'కిరాక్‌పార్టీ' నా 15వ సినిమా. నా తొలి సినిమా 'హ్యాపీడేస్' ఫలితం కోసం ఎలాగైతే ఎదురుచూశానో.. ఇప్పుడు కూడా అంతే అతృతగా ఈ సినిమా ఫలితం కోసం నిరీక్షిస్తున్నా. ఇప్పుడే సినిమా రిలీజ్ ఫీవర్ స్టార్టయింది. రేపు 30వ సినిమానో, 40వ సినిమానో చేసినా నేను ఇలాగే ఉంటాను.
- మనం అమ్మాయిల గురించి ఈజీగా మనకు తోచినట్లు మాట్లాడుతుంటాం. అలా మాట్లాడటం వల్ల ఆ అమ్మాయి ఎలా బాధపడుతుంది. పరిస్థితులు ఎలా మారుతాయనే ఈ సినిమా. నేను కాలేజ్ చదువుకునే రోజుల్లో రెండుసార్లు పెద్ద గొడవలయ్యాయి. అయితే పోలీసులు మమ్మల్ని ఏమీ అనలేదు. ఇప్పుడు అవన్నీ గుర్తుకు వస్తున్నాయి.
- నేను, దర్శకుడు శరణ్ కొపిశెట్టి, చందు, సుధీర్ వర్మ, అనిల్, కిషోర్ ఇలా అందరం ఇంజనీరింగ్ చదివినవాళ్లే. వాళ్లు చదువుకున్న కె.ఎల్.యూనివర్సిటీలోనే 'కిరాక్ పార్టీ'ని చిత్రీకరించాం. కన్నడ మాతృకలో నటించిన సంయుక్త హెగ్డే, సంగీత దర్శకుడు అజనీశ్ లోక్‌నాథ్ మినహా అందరూ కొత్త వారినే తీసుకున్నాం. అందుకు కారణం ఆడియెన్స్‌కు ఫ్రెష్ ఫీల్ కలగాలనే. ఈ సినిమాలో హీరోయిన్‌గా ముందు కన్నడంలో చేసిన రష్మికనే తీసుకుందామనుకున్నాం. అప్పటికే తను రెండు, మూడు సినిమాలు కమిట్ కావడంతో, తన స్థానంలో సిమ్రాన్ పరింజను హీరోయిన్‌గా తీసుకున్నాం.
- కన్నడలో మూడు గంటల సినిమాను తెలుగులో ట్రిమ్ చేసి రెండు గంటల 25 నిమిషాలకు చేశాం. రీమేక్ సినిమా అయినా అందులోని ఆత్మను మిస్ కాకుండా చూసుకున్నాం. కన్నడ సినిమాను రీమేక్ చేయాలనే ఆలోచన నిర్మాత అనిల్ సుంకరది. ఆయన నన్ను కలిసిన 10 నిమిషాలకే సినిమా చేయడానికి ఓకే చెప్పాను.
- అనిల్ సుంకర చాలా అభిరుచి గల నిర్మాత. ఆయన రెండు సార్లు మాత్రమే లొకేషన్‌కు వచ్చారు. ఆయన ఏదో సన్నివేశాన్ని డైరెక్ట్ చేశారని.. ఇన్‌వాల్వ్ అవుతారని వచ్చే వార్తలన్నీ పుకార్లేనండీ. ఫైనల్‌గా సినిమా చూసిన అనిల్ చాలా హ్యాపీగా ఫీలయ్యారు.
- శరణ్‌కి డైరెక్టర్ చందు మొండేటి, సుధీర్ వర్మ చాలా క్లోజ్ ఫ్రెండ్స్. శరణ్‌కు ధైర్యాన్ని ఇవ్వడానికే చందు, సుధీర్ ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. సినిమా ప్రారంభం కావడానికి ముందు చాలా వర్క్ చేశారు. చందు దాదాపు నెలన్నర పాటు స్క్రిప్ట్‌పైన కూర్చున్నాడు. శరణ్ చాలా ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్లాన్ చేసుకున్నాడు. అంతా ఓకే అనుకున్న తర్వాత అనిల్‌గారు సెట్స్‌కు వెళ్లారు.
- 'కణిదన్' రీమేక్ కాదు. అందులో ఫేక్ సర్టిఫికేట్స్ అనే పాయింట్‌ను మాత్రమే తీసుకుని కొత్త కథను తయారు చేశారు. ఇందులో జర్నలిస్ట్ పాత్రలో కనపడతాను. ఈ సినిమా తర్వాత చందు మొండేటితో కార్తికేయ సీక్వెల్ చేస్తాను. ఎక్కడ ఆగిపోతుందో అక్కడే 'కార్తికేయ' సీక్వెల్ స్టార్ట్ అవుతుంది. దీంతో పాటు ఠాగూర్ మధుతో సినిమా చేస్తున్నాను.

'అర్జున్‌రెడ్డి'తో పోల్చొద్దు

- మల్కాపురం శివకుమార్



" ప్రస్తుతం సర్వీస్‌ప్రొవైడర్ల సమస్య కొలిక్కి వచ్చింది. అతిత్వరలో ఛాంబర్ ఓ నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. ఒక రకంగా వారు మెట్టుదిగారనే చెప్పాలి. అందుకే ఈనెల 9నుంచి థియేటర్లలో సినిమాను విడుదల చేయబోతున్నాం"

'అర్జున్‌రెడ్డి' వంటి ఓ సంచలన విజయం తర్వాత వస్తున్న సినిమా కాబట్టి ప్రేక్షకుల్లో అంచనాలు ఉండటం సహజం. 'బాహుబలి' తర్వాత ప్రభాస్‌ను తిరిగి అదే స్థాయి పాత్రలో ఊహించుకోవడం సాధ్యం కాదు కదా. 'అర్జున్‌రెడ్డి'తో విజయ్ దేవరకొండ యువతలో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్నాడు. ఆ సినిమా స్థాయిలో అంచనాలు పెట్టుకోవడం భావ్యం కాదనుకుంటున్నాను" అని నిర్మాత మల్కాపురం శివకుమార్ అన్నారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై తాజాగా నిర్మించిన చిత్రం 'ఏ మంత్రం వేసావె'. విజయ్‌దేవరకొండ కథానాయకుడు. శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. 2014లో మొదలైన ఈ సినిమా 2017లో సెన్సార్ అయింది. ఈనెల 9న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.

'ఏ మంత్రం వేసావె'లో విజయ్ దేవరకొండ పాత్ర చిత్రణ చాలా వైవిధ్యంగా ఉంటుంది. నేటి యువత అందరూ అతని పాత్రలో చూసుకుంటారు. కథాంశంలోని కొత్తదనం ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది. ఈతరం మనోభావాల్ని ప్రతిబింబించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. థ్రిల్లర్ అంశాల కలబోతగా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతి యువకుడికీ ఏదొక బలహీనత ఉంటుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కంప్యూటర్ గేమ్స్ అంటే చాలా ఇష్టం. అవే సర్వస్వంగా గడుపుతుంటాడు. ఒక అమ్మాయి పరిచయం అతడి జీవిత గమనాన్ని ఎలా మార్చివేసింది? అతడు ఎలా ప్రయోజకుడయ్యాడు? అన్నదే చిత్ర ఇతివృత్తం.

ఇందులో విజయ్ పాత్ర చిత్రణ నవ్య పంథాలో ఉంటుంది. నేటి యువత అందరూ అతని పాత్రతో కనెక్ట్ అవుతారు. కథాంశంలోని కొత్తదనం ప్రతి ఒక్కరినీ మెప్పిస్తుంది. చిత్ర ట్రైలర్స్, పాటలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. పరిశ్రమలోని ప్రముఖులు చాలా మంది సినిమా చూసి బాగుందని ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు వెయ్యిథియేటర్లలో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం.

ఎమోషనల్‌గా నచ్చే చేశాను

- సాయిపల్లవి

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్.సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కణం'. శ్యాం సి.ఎస్. సంగీత సారథ్యం వహించారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించారు. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ ఆడియో సీడీని రిలీజ్ చేసి తొలి సీడిని హీరోయిన్ సాయిపల్లవికి అందించారు.

సాయిపల్లవి మాట్లాడుతూ "తల్లికి, బిడ్డకు మధ్య ఉన్న అనుబంధం, తపనే ఈ సినిమా కథ. సినిమాకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయి చేశాను. సినిమాలో నటించడం వల్ల వెరోనికాతో మంచి అనుబంధం ఏర్పడింది. సినిమాను చూసిన ప్రేక్షకులకు ఆనందంగా, మంచి ఫీలింగ్‌తో ఇంటికి వెళ్లాలనే ఆలోచనతో దర్శకుడు చక్కగా తెరకెక్కించారు' అని పేర్కొన్నారు. ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ 'రజనీకాంత్ '2.0'కి కెమెరా వర్క్ అందించిన నిరవ్‌షా ప్రతి విజువల్‌ను గొప్పగా పిక్చరైజ్ చేశారు. సినిమాలో వెరోనికా అనే చిన్న పాప అద్భుతమైన పాత్రలో నటించింది. దర్శకుడు విజయ్ మంచి ఉద్దేశంతో సినిమాను తీశారు. సినిమాలో కాస్త యాక్షన్ పార్ట్ ఉన్నా పక్కా ప్రణాళికతో సినిమాను 37 రోజుల్లో పూర్తి చేశారు' అని అన్నారు.



సాయిపల్లవి, బేబీ వెరోనికా, బీవీఎస్ఎన్ ప్రసాద్, విజయ్ తదితరులు

చిత్ర దర్శకుడు విజయ్ మాట్లాడుతూ 'మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. 'కరు' సినిమానే తెలుగులో 'కణం'గా విడుదల చేస్తున్నాం' అన్నారు.

నలుగురు కుర్రాళ్ల కథ

తారానీలు కార్పొరేషన్ పతాకంపై అనురాగ్(ఎమ్.ఎస్.బాబు) స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అనిల్ నెమలి హీరోగా పరిచయమవుతున్నారు. మేఘన కథానాయిక. ప్రతిఘటన, నేటిభారతం తరహాలో విప్లవభావాలతో సాగే చిత్రమిదని దర్శకుడు తెపారు. నలుగురు కుర్రాళ్లు సమాజంలో ఏ విధంగా మార్పు తీసుకొచ్చారనేది ఆసక్తిని పంచుతుందని, మతకల్లోలాలు జరగకుండా సంఘవిద్రోహుల పన్నాగాన్ని ఎలా అడ్డుకున్నారనేది చిత్ర ఇతివృత్తమని చెప్పారు. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామన్నారు.



మేఘన, అనిల్ నెమలి

మూడు నెలల్లో పెళ్లి!



రణవీర్‌సింగ్, దీపికా పదుకొనే

దీపికా పదుకొనే, రణవీర్‌సింగ్ ఎప్పటి నుంచో ప్రేమించుకుంటున్న విషయం తెలిసిందే. ఆ విషయాన్ని ఎవరికి వారే ఇంతకాలం బహిర్గతం చేయకుండా జాగ్రత్త పడగలిగారు. వీరిద్దరూ కలిసి తిరగడం, తరచూ మీడియా కంట పడడం జరుగుతూనే ఉంది. 'మీరు ఇద్దరూ ప్రేమించుకుంటున్నా? అని ఎవరైనా ప్రశ్నిస్తే...ప్రేమించుకుంటేనే కలిసి తిరగాలా? స్నేహితులైతే తిరగకూడదా?' అనే సమాధానమే వచ్చేది. ఈ సారి మాత్రం దీపికా పదుకొనే నుంచి కొత్తగా సమాధానం వచ్చింది. అదే అందరినీ ఆశ్చర్యపరిచింది. 'నేను రణ్‌వీర్‌తో ఉంటే ఇంకెవ్వరూ అక్కర్లేదనిపిస్తుంది' అని దీపికా చెప్పింది. ఇక అంతే వీరి పెళ్లి గురించే బాలీవుడ్ ప్రచారం మొదలైంది. అది నిజమో కాదో సంబంధిత వర్గాల నుంచి నిర్దిష్టంగా సమాచారం లేదు గానీ... వీరిద్దరికీ వివాహం జరిపించాలని దీపికా, రణవీర్ కుటుంబాలు నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. రణ్‌వీర్ తల్లిదండ్రులతో మాట్లాడేందుకు దీపిక తల్లిదండ్రులు బెంగళూరు నుంచి ముంబయి వచ్చారని, ఈ విషయంపై చర్చించుకున్నట్టు ఆ ప్రచారంలో సారాంశం. మరో మూడు నెలల్లో దీపిక, రణ్‌వీర్ వివాహం జరిగే అవకాశం ఉందని, విరాట్ కోహ్లి, అనుష్క శర్మ లాగే వీరిద్దరు కూడా విదేశాల్లో వివాహం చేసుకోవాలని అనుకుంటున్నారని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. దక్షిణ భారతీయ సంప్రదాయం ప్రకారమే వివాహ వేడుకను జరిపిస్తారట.

అమెరికాలో విహార యాత్ర




విఘ్నేశ్, నయన తార

నయనతార, తమిళ దర్శకుడు విఘ్నేశ్ శివన్ ఎప్పటి నుంచో ప్రమించుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. నయన, విఘ్నేశ్ దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం ఈ ప్రచారానికి ఊతమిస్తుంది. అందులో ఆ ఫొటోలను విఘ్నేశ్ స్వయంగా తన ట్విట్టర్ ఖాతా నుంచే పోస్టు చేస్తుండడం విశేషం. వీరిద్దరూ త్వరలో వివాహం చేసుకోబోతున్నారని ఆ ప్రచారంలో భాగమైనా దీనిపై ఇప్పటివరకూ నయనతార మాత్రం ఒక్కసారీ స్పందించలేదు. విఘ్నేశ్ మాత్రం నయనతార తనకు ఎంత ప్రత్యేకమో తెలుపుతూ అనేక సందర్భాల్లో ట్వీట్లు చేశారు. 'ఆమె నా జీవితాన్ని ప్రత్యేకంగా మార్చేశారు' అని చెప్పారు. గతంలో ఓసారి వీరిద్దరూ దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమంలో దర్శనమిచ్చాయి. ఇప్పుడు అమెరికా విహారయాత్రకి వెళ్లినప్పుడు దిగిన వాటిని విఘ్నేశ్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అమెరికా నుంచి కొన్ని గొప్ప అనుభూతులను, సానుకూలతను తీసుకుని వెళ్తున్నామని, త్వరలో మళ్లీ వస్తామని ప్రమాణం చేశారు విఘ్నేశ్.

సైటెక్ Science & Technology

scitechpage@gmail.com



ఫొటోషాప్‌కి ప్రత్యామ్నాయం!

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు కలిగిన సాఫ్ట్‌వేర్... ఫొటోషాప్. ఫొటో ఎడిటింగ్, కలర్ మేనేజ్‌మెంట్‌లో దీనికిదే సాటి. సాఫ్ట్‌వేర్ మార్కెట్లో అడోబ్ ఫొటోషాప్‌ని మించిన ఫొటో ఎడిటింగ్ టూల్స్ లేవన్నది జగమెరిగిన సత్యం. అయితే ఫొటోషాప్ పూర్తిగా ప్రొప్రయిటరీ సాఫ్ట్‌వేర్. అంతేకాదు... ఈ సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేసిన ప్రతిసారీ వినియోగదారులూ దీన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే.... కొత్త వెర్షన్‌లో ఉన్న ఫీచర్లను వినియోగదార్లు ఉపయోగించుకోలేరు. దీనిలోనూ సవాలక్ష కండీషన్లు ఉంటాయి. అయితే ఈ సాఫ్ట్‌వేర్‌కున్న విస్తృతమైన క్వాలిటీ, ఫీచర్ల దృష్ట్యా దీన్ని వాడుతున్నారు. అంతేకాదు ఇప్పటి వరకూ దీనికి ధీటైన ప్రత్యామ్నాయమూ లభించలేదు. దీనికి సరైన ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా అని వెతుకుతుంటారు. అలాంటి వారికి పూర్తి ఉచితంగా లభించే ఏకైక ప్రత్యామ్నాయం ఉందనేది ఊరట కలిగించే విషయమే. ఆ ప్రత్యామ్నాయమే...జింప్ (GIMP).

ఇది ఫొటోషాప్‌కి ఏకైక ప్రత్యామ్నాయం. 100 డాలర్లు పెట్టి ఫొటోషాప్‌ను కొనలేనివారు, ప్రతిసారీ అప్‌గ్రేడ్ చేసుకోవడం సాధ్యపడని వారు నిరభ్యంతరంగా, నిర్భీతిగా జింప్ సాఫ్ట్‌వేర్‌ను వాడుకోవచ్చు. ఫొటో ఎడిటింగ్ ప్రపంచంలో ఫొటోషాప్‌కి ప్రత్యామ్నాయంగా ఎదిగిన ఒకేఒక్క సాఫ్ట్‌వేర్ జింప్. ఫొటోషాప్ మాదిరిగానే ఇదీ రాస్టర్ ఇమేజ్ ప్రోగ్రామ్. టూల్స్, లేయర్స్, ఫిల్టర్స్ మొత్తం ఫొటోషాప్‌ని జ్ఞప్తికి తెచ్చేవిధంగానే ఉంటాయి. ఫిల్టర్స్‌లో మాత్రం ఫొటోషాప్ కంటే ఎక్కువ ఫీచర్స్ ఉన్నాయి. స్క్రిప్ట్–ఫ్యూలో ఉన్న అనేక ఆకర్షణీయమైన ప్యాటర్న్స్ దీని సొంతం. ఫొటో ఎడిటింగ్‌కి సంబంధించిన కలర్ బ్యాలెన్స్, బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్, లెవల్స్, కర్వ్, హ్యూ– సాచురేషన్ వంటి ఆప్షన్స్ అన్నీ కలర్ ఎడిటింగ్‌కి బాగా ఉపకరిస్తాయి. అంతేకాకుండా జింప్‌లో 48 రకాల బ్రష్‌లు ఉన్నాయి. వాటిని అవసరానికి తగినట్టుగా మార్పులు చేసుకోవచ్చు.

ఫొటోషాప్ ఒక ప్రొప్రైటరీ సాఫ్ట్‌వేర్ అయితే, జింప్ ఉచిత సాఫ్ట్‌వేర్. ప్రస్తుతం అందరికీ అందుబాటులో ఉంది. జింప్ పూర్తి పేరు "గ్నూ ఇమేజ్ మ్యానుప్యులేషన్ ప్రోగ్రామ్' (GNU Image Manipulation Program). దీనిని 1995లో స్పెన్సర్ కింబాల్ (Spencer Kimball), పీటర్ మాట్టిస్ (Peter Mattis) రూపొందించి 'గ్నూ జిపిఎల్' కింద అందరికీ అందుబాటులో



ఉంచారు. వీరితోపాటు మూడువేలకుపైగా ఔత్సాహికులైన సాంకేతిక నిపుణులు దీనిపై పనిచేస్తున్నారు. దీన్ని డౌన్లోడ్ చేసుకోవడం, అప్‌గ్రేడ్ చేసుకోవడం అంతా ఉచితం. జింప్‌లో టూల్స్, లేయర్స్, కలర్ మేనేజ్‌మెంట్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుంది. ఫొటోషాప్‌ను ప్రతి 12–18 నెలలకొకసారి అప్‌గ్రేడ్ చేస్తుంటారు. అప్‌గ్రేడ్ అయిన ప్రతిసారీ మనమూ అప్‌గ్రేడ్ చేసుకోవాలంటే సుమారు 200 డాలర్లు ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. జింప్‌తో ఆ సమస్యలేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఇది ప్రపంచవ్యాప్తంగా 52 భాషలలో లభిస్తుండగా, 37 భాషలలోకి పూర్తిగా అనువాదం చేశారు. మిగతా భాషలలో పాక్షికంగా అనువాదం జరుగుతోంది. జింప్‌లో సేవ్ చేసే ఫైల్స్ అన్నీ xcf (eXperimental Computing Facility) ఫార్మెట్‌లో సేవ్ అవుతాయి. దీని నుండి మనకు కావాల్సిన ఫార్మెట్‌లోకి సేవ్‌యాజ్ చేసుకోవచ్చు. సాధారణంగా ఫొటోషాప్‌లో అయితే PSD (Photoshop Document) లో సేవ్ అవుతాయి.

జింప్‌లో వాడుకొనేందుకు అనేక ప్లగిన్స్ అందుబాటులో ఉన్నాయి. జింప్ 2.8 వెర్షన్‌కి ముందున్న వెర్షన్‌లలో ఫొటోలను సిఎంవైకె కలర్స్‌లోకి కన్వర్ట్ చేసుకునే సౌలభ్యం కానీ, వెబ్‌పేజీలకు ఇమేజ్‌లను సేవ్ చేసుకునేందుకు ఉపయోగించే 'సేవ్ ఫర్ వెబ్' అనే ఆప్షన్స్ లేవు. ఇవి దీనిలోని ప్రధాన లోపాలుగా చెప్పొచ్చు. అయితే... 2.8 వెర్షన్ నుండి వీటికి సంబంధించిన ప్లగిన్స్‌తో 'సెపరేట్' అనే సిఎంవైకె కన్వర్టర్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీనిద్వారా ఆర్‌జిబి ఇమేజ్‌లను సిఎంవైకెలోకి మార్చుకునే అవకాశం ఉంది. వీటిని http://registry.gimp.org/ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు. గత వెర్షన్లలో టూల్‌బార్, మెయిన్ విండో లేయర్ ఇతర ప్యాలెట్స్ విడివిడిగా ఉండేవి. ఇవన్నీ ఒకే విండోలో ఉండేవిధంగా ప్రస్తుత తాజా వెర్షన్‌లో ఏర్పాటు చేశారు. అదేవిధంగా http://gimp-scripts.com/ నుంచి స్క్రిప్ట్స్, ప్లగిన్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటిని ఏవిధంగా వాడుకోవాలో ఈ వెబ్‌సైట్‌లో స్క్రీన్‌షాట్స్‌తో సహా వివరంగా ఉంటుంది. అయితే దీనిలోనూ కొన్ని లోపాలున్నాయి. డైరెక్ట్‌గా సిఎంవైకె ఫీచర్ లేకపోవడం, టెక్స్ట్ లేయర్‌ను ఎడిట్ చేయలేకపోవడం వంటి కొన్ని లోపాలున్నాయి. దీనిపై జింప్ కన్సార్టియం ఎప్పటికప్పుడు రీసెర్చ్ చేస్తూనే ఉంది. దీనిలో మరికొన్ని మార్పులు చేర్పులతో పాటు అడ్వాన్స్ ఫీచర్స్‌ను పరిచయం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ వచ్చే సందేహం ఒక్కటే. జింప్‌లో ఇన్ని ఫీచర్స్ ఉండి, ఇంత యూజర్ ఫ్రెండ్లీ అయితే ఫొటోషాప్ మాదిరిగా ఎందుకు పాపులర్ కాలేదని. అయితే జింప్ ఉచిత సాఫ్ట్‌వేర్ కావడం వల్లనే రావాల్సినంత ప్రచారం రాలేదనేది దీనిగురించి తెలిసినవారు చెప్పేమాట.

ఇంటర్నెట్ బాగా అందుబాటులోకి వచ్చిన తర్వాతనే జింప్ పాపులర్ అయింది. జింప్ వినియోగదారులకు సహాయపడేందుకు అనేక ఫోరమ్స్ (http://registry.gimp.org/forum) ఉన్నాయి. ఆ ఫోరమ్స్ నుండి సాంకేతిక సహకారమూ పొందొచ్చు. దీన్ని http://www.gimp.org/downloads/ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు. జింప్‌కు సంబంధించిన అనేక వీడియోలు 'యూట్యూబ్'లోనూ అందుబాటులో ఉన్నాయి. ఫొటోషాప్‌కు ప్రత్యామ్నాయంగా జింప్‌ను వాడటం వల్ల బోల్డంత ఖర్చు తగ్గించుకోవచ్చు.

ఇవేకాకుండా PhotoScape, The Nik Collection, Paint.NET, HitFilm Express, HitFilm Express, Pixlr.com, Sumopaint, PicMonkey, iPiccy వంటి టూల్స్ అందుబాటులో ఉన్నాయి. మొబైల్‌లో ఉపయోగించుకోడానికీ అనువైన ఫొటో ఎడిటింగ్ యాప్‌లు లభ్యమవుతున్నాయి. అంత ఖర్చుతో ఫొటోషాప్‌ను ఉపయోగించలేని వారికి ఇవన్నీ కచ్చితంగా ప్రత్యామ్నాయాలే. ★

నేడు రానున్న షావోమి సరికొత్త టీవీ

స్మార్ట్‌ఫోన్ల రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకముద్ర వేసుకున్న షావోమీ (Xiaomi) ఇటీవలే టెలివిజన్ మార్కెట్‌లో ప్రవేశించింది. ఇప్పటికే రూ.40 వేలకు 55 అంగుళాల స్మార్ట్ టీవీని పరిచయం చేసిన ఈ కంపెనీ, మధ్యస్థమైన ధరల్లో మరో టీవీని మార్చి 7న ఆవిష్కరిస్తోంది. దీనికి సంబంధించిన ఓ టీజర్‌నూ ట్విట్టర్‌లో పోస్టు చేసింది. స్విచ్ టూ స్మార్ట్, స్విచ్ టూ స్టయిల్, స్విచ్ టూ ఎంటర్‌టైన్‌మెంట్' అనే పంచ్‌లైన్లతో ఈ కొత్త సిరీస్ టీవీని ఆవిష్కరిస్తోంది.



షావోమి తన దేశీయ మార్కెట్‌లో రెండు టీవీలను లాంచ్ చేసింది. ఒకటి ఎంఐ టీవీ 4సీ, రెండు ఎంఐ టీవీ 4ఏ. ముందస్తు రిపోర్టులను బట్టి షావోమి ఎంఐ 4ఏ సిరీస్‌లో 40 అంగుళాల టీవీని 17,500 రూపాయలకు లాంచ్ చేస్తుందని తెలిసింది. కానీ కంపెనీ వెబ్‌సైట్ తాజా లీకేజీల ప్రకారం ఎంఐ టీవీ 4సీ సిరీస్‌ను ఆవిష్కరిస్తోంది. రెండు సిరీస్‌లో ఈ స్మార్ట్‌టీవీ విడుదల అవుతుందని, 43 అంగుళాల ఫుల్‌హెచ్‌డీ రిజల్యూషన్, 4కే రిజల్యూషన్‌తో 55 అంగుళాల స్క్రీన్‌ను ఇది కలిగి ఉంటుందని తెలుస్తోంది. ఎంఐ టీవీ4 లాగానే.. హెచ్‌డీఆర్ 10 సపోర్టు, హెచ్‌ఎల్‌జీ, వైఫై 802, డోల్బీ, డీటీఎస్ ఆడియో, బ్లూటూత్ 4.2 స్పెషిఫికేషన్లను కలిగి ఉంటుందని టెక్ నిపుణుల అంచనా. బుధవారం నిర్వహించే ఈవెంట్‌ను షావోమి తన కంపెనీ వెబ్‌సైట్లో మూడు గంటలకు లైవ్ స్ట్రీమ్ కూడా చేయనుంది. దీంతోపాటు తాజాగా విడుదలైన రెడ్‌మి నోట్ 5 ప్రొ, రెడ్‌మి నోట్ 5 స్మార్ట్‌ఫోన్లను కూడా బుధవారం మధ్యాహ్నం నుంచి విక్రయించనుంది. ★

ఈ యాప్స్ గురించి తెలుసా ?

స్మార్ట్‌ఫోన్ చేతిలో లేకుండా రోజు గడవని పరిస్థితి. ఎంత కాదనుకున్నా స్మార్ట్‌ఫోన్‌పై ఆధారపడాల్సిన స్థితికి నెట్టబడ్డాము. సినిమా టిక్కెట్ల రిజర్వేషన్ నుంచి బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్ వరకూ ప్రతి అవసరానికీ స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి. ముఖ్యంగా ఆయా అవసరాలకు కావాల్సిన యాప్స్ మరీ ముఖ్యం. ఒక్కో అవసరానికి ఒక్కో యాప్ కావాల్సిందే. ఈ క్రమంలో ముందుకొచ్చిన అంశం ప్రైవసీ. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లు ఉపయోగించే వినియోగదార్లకు ఇది పెద్ద సమస్యగా తయారైంది. తమ ఫోన్ ఎవరైనా తీసుకుంటే... అందులోని ఫొటోలు, వీడియోలు, మెసేజ్ చూస్తారేమో అనే ఆందోళన. ఇతరులకు ఫోన్ ఇవ్వాలంటేనే ఇబ్బంది. ఇటువంటి భయాన్ని తొలగించేందుకే కొన్ని యాప్స్ సిద్ధంగా ఉన్నాయి. ఈ యాప్స్ మన ఫోన్‌లో ఉంటే... మన ఫోన్ మనల్ని గుర్తిస్తుంది. మన వాయిస్‌ను గుర్తిస్తుంది. మన ముఖాన్ని గుర్తిస్తేనే ఫోన్లో ఉన్న యాప్స్ ఓపెన్ అవుతాయి. తద్వార మన ప్రైవసీకి ఇబ్బంది కలుగుతుందేమోనని ఆందోళనపడాల్సిన అవసరమే లేదు. అందుకు అవసరమయ్యే ఈ ఉచిత యాప్స్ గురించి తెలుసుకుందాం...



యాప్ లాక్ (applock face/ voice recognition) : ఈ యాప్ ద్వారా ఇతరులు మీ యాప్స్‌ను ఓపెన్ చేయకుండా మీ ముఖాన్నే పాస్‌వర్డ్‌గా సెట్ చేసుకోవచ్చు. ఫేస్ రికగ్నేషన్ తో పాటు వాయిస్ లాక్ కూడా ఈ యాప్‌లో ఉంది. ఫేస్ లాక్, వాయిస్ లాక్ ద్వారా ఇతరులు మీ యాప్స్‌ను ఓపెన్ చేయకుండా నియంత్రించ వచ్చు. ఈ యాప్‌ను ఏ ఇతర ఆండ్రాయిడ్ యాప్ లాకర్లో అయినా అన్ ఇన్‌స్టాల్ చేయలేం. అయితే... యాప్‌ను అన్ ఇన్‌స్టాల్ చేయాలంటే, సెట్టింగ్స్‌లోకి వెళ్ళి చేయొచ్చు. చేయకుండానూ నిరోధించవచ్చు. కాబట్టి సెట్టింగ్స్‌ను కూడా లాక్ చేయడం మంచిది. ఈ యాప్ డిఫాల్ట్‌గా మీ ఫొటోలు, వాయిస్‌ను సర్వర్లకు అప్‌లోడ్ చేస్తుంది. అలా కాకుండా ఉండాలంటే అడ్వాన్స్ సెట్టింగ్స్ ఓపెన్ చేసి ఫొటోలు, వీడియో అప్‌లోడ్ ఆప్షన్‌ను డిసేబుల్ చేయండి. ఫేస్‌లాక్ ఆండ్రాయిడ్ యాప్‌లో రెండు మోడ్స్ ఉంటాయి. కన్వినెన్స్ మోడ్‌లో మీరు వాయిస్‌తో మాట్లాడవచ్చు. లేదా ఒక యాప్‌ను అన్‌లాక్ చేయడానికి మీ ముఖాన్ని పాస్‌వర్డ్‌గా ఉపయోగించుకోవచ్చు. 'ట్రూలీ సెక్యూర్ మోడ్'లో అయితే వాయిస్, ఫేస్ రెండూ మ్యాచ్ అయితేనే అన్‌లాక్ అవుతుంది. ఈ రెండింటిలో మీకు కావాల్సిన మోడ్‌ను సెట్ చేసుకోవచ్చు.



అయోబిట్ యాప్ లాక్ (Iobit applock-face lock) : ఫేస్ లాక్ యాప్ మాదిరిగానే... దీనిలో కూడా ఎవరైనా మీ స్టిల్ ఫొటో పెట్టి అన్‌లాక్ చేయడానికి ప్రయత్నిస్తే ఈజీగా పట్టేస్తుంది. యాప్‌ను అన్‌లాక్ చేస్తున్నప్పుడు ముఖ కదలికలను బట్టి, అతను యూజర్ అవునో కాదో నిర్ధారిస్తుంది. లాక్ ఫేస్ తోపాటు, యాప్స్‌కు ఫేక్ లాక్, నోటిఫికేషన్ లాక్ వంటివి యాడ్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్ సెట్టింగ్స్‌లో వైఫై, ఆటో సింక్ వంటి స్విచ్‌లను కూడా లాక్ చేయడం దీని ప్రత్యేకత. అంతేకాదు మీ ఫోన్‌ను ఎవరైనా అన్‌లాక్ చేసేందుకు ప్రయత్నిస్తే వారి సెల్ఫీ కూడా తీస్తుంది. ఈ యాప్‌ను యాక్సెస్ చేయడం చాలా సులభం. గూగుల్ ప్లేస్టోర్‌లో నుంచి డౌన్‌లోడ్ చేశాక మిమ్మల్ని గుర్తించడానికి కెమెరాను ఓపెన్ చేస్తుంది. ఇప్పుడు మీ ముఖాన్ని లాక్, అన్‌లాక్ చేయడానికి పాస్‌వర్డ్‌ను సెట్ చేస్తుంది. ఈ ప్రాసెస్ పూర్తయ్యాక ఫేస్ రికగ్నేషన్ బటన్‌పై నొక్కండి. స్క్రీన్ నుంచి ఫేస్ రికగ్నేషన్ లాక్ చేయడానికి యాప్స్‌ను సెలెక్ట్ చేసుకోండి. లాక్ చేసిన యాప్స్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తే ఫేస్ స్కానర్ స్క్రీన్ ద్వారా వాళ్లను గుర్తిస్తుంది.

యాప్ లాక్ బై ఫేస్ (applock by face) : ఈ యాప్ కూడా ఫేస్ రికగ్నేషన్ ద్వారా యాప్‌ను ఓపెన్ చేస్తుంది. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత మీ ఫేస్‌ను గుర్తించడానికి ట్రైనింగ్ ఇవ్వాలి. ఇది చాలా ఈజీ ప్రాసెస్. ఓవెల్ షేప్‌లో ఉంటే సర్కిల్‌లో మీ ఫేస్ ఎడ్జెస్ట్ చేసి Train బటన్ నొక్కాలి. దీంతో మీ ఫేస్ రికగ్నైజేషన్ రిజిస్టర్ అవుతుంది. ఇప్పుడు దీన్ని ఉపయోగించి మీరు యాప్స్‌ను లాక్ చేయడానికి, అన్‌లాక్ చేయడానికి మీ ఫేస్‌ను పాస్‌వర్డ్‌గా సెట్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్ ఫోన్ స్క్రీన్‌లాక్, అన్‌లాక్ చేయడానికీ ఈ యాప్ ఉపయోగపడుతుంది.



ఉచితంగా లభించే ఫేస్, వాయిస్ రికగ్నేషన్ యాప్‌లను ఉపయోగించుకోవడం ద్వారా మీ స్మార్ట్‌ఫోన్‌లోని డేటాకు కావాల్సినంత ప్రైవసీని ఏర్పాటు చేసుకోవచ్చు. ★

చిన్నారి



పొడుపు కథ

రెక్కలు కలిగి ఉంటా,
కరెంటుతో తిరుగుతూ,
చల్లనిగాలిని ఇస్తాను,
హాయి గొల్పుతాను.. నేనెవరిని?

జవాబు : ఫ్యాను

జోక్:

టీచర్ : రామూ! విమానాన్ని ఎవరు కనిపెట్టారు?
రాము : రైట్ సోదరులు టీచర్!
టీచర్ : సోమూ! రైలుని ఎవరు కనిపెట్టారు?
సోము : లెఫ్ట్ సోదరులు టీచర్!
టీచర్ : ఆఆఆ.........

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని బొమ్మకు చుక్కలు కలిపి, రంగులు వేయండి!

బాస్కెట్‌బాల్ ఎలా ఆడాలి?



బాస్కెట్ బాల్ ఆట తెలుసా? మీరెప్పుడైనా ఆడారా? ఆడే ఉంటారు. ఒకవేళ ఆడకపోతే ఎలా ఆడాలో చూద్దాం. ఈ ఆటను ఒక రింగు, బంతితో ఆడతారు. బంతిని తీసుకెళ్లి రింగులో వేయడమే ఆట. ఓస్ అంతేనా! అనుకుంటున్నారా! బంతిని రింగులో వేయడం అంత సులభమేమీ కాదు. ఈ ఆటను జట్టులుగా ఆడతారు. ఒక్కొక్క జట్టులో ఐదుగురు సభ్యులుంటారు. రింగు బుట్టను పది అడుగుల ఎత్తులో పెడతారు. ఒక్కో గ్రూపులో ఉన్న సభ్యులు బంతిని ఆ బుట్టలో వేయాలి. ప్రత్యర్థి జట్టు బుట్టలో బంతిని వేయకుండా ఆటంకపరస్తూ ఉంటుంది. వారి నుంచి తప్పించుకుని, అంత ఎత్తులో ఉన్న బుట్టలో ఎవరైతే ఎగిరి బంతిని వేస్తారో ఆ సభ్యుని జట్టుకు పాయింట్ వస్తుంది. ఆట ముగింపు సమయానికి అధిక పాయింట్లతో ఉన్న జట్టు గెలుస్తుంది. ఒకవేళ రెండు జట్లకు సమాన పాయింట్లు వస్తే అదనపు సమయం తీసుకుంటారు. అధిక పాయింట్లను గెలుపొందిన జట్టు విజేతగా నిలుస్తుంది. బాస్కెట్‌బాల్ ఆడటానికి సరదాగా ఉంటుంది. ఇది చాలా వేగంగా ఉద్వేగభరితంగా సాగే ఆట. కోర్టులో ఉన్న ప్రతి క్రీడాకారుడూ డిఫెన్స్, అఫెన్స్ రెండు పాత్రలు పోషిస్తూ ఆడతారు. ప్రతి క్రీడాకారుడికీ ఈ విధంగానే డిఫెన్స్ ఆడాలి అనిగాని, లేదా ఆఫెన్స్ ఆడాలి అన్నట్లుగాని నిబంధనేం ఉండదు. మిగతా క్రీడలలా పెద్ద టీమ్ అవసరం ఉండదు. బాస్కెట్ బాల్ క్రీడను 1891లో జిమ్‌నామ్‌స్మిత్ కనుగొన్నారు. 1936లో బాస్కెట్‌బాల్ ఒలింపిక్ క్రీడగా మారింది. ★





నేను గీసిన బొమ్మ





సుబోధిని గ్రేస్,
5వ తరగతి, కేంద్రీయ విద్యాలయం, కడప

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

తొలి పంచ్ లంకదే!

టీ20 ట్రై సిరీస్‌లో భారత్ ఓటమి


మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ కుశాల్ పెరీరా

కొలంబో : భారత్-శ్రీలంక జట్ల మధ్య మంగళవారం జరిగిన టీ20లో లంక జట్టు విజయాన్ని సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 174 పరుగులు చేసింది. అనంతరం లంక జట్టు 18.3 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. టీమిండియాలో శిఖర్ ధావన్ అత్యధికంగా 49 బంతుల్లో 90 పరుగులు సాధించాడు. అతని ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 6 సిక్సర్లున్నాయి. అనంతరం శ్రీలంక జట్టు పవర్‌ప్లే 6 ఓవర్లలోనే రెండు వికెట్ల నష్టానికి 75 పరుగులు సాధించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. శార్దూల్ ఠాకూర్ వేసిన మూడో ఓవర్‌లో 4,4,4,6,నోబ్4,4,0తో మొత్తం 27 పరుగులు సాధించి మ్యాచ్‌ను ఒక్కసారిగా తమవైపుకు తిప్పుకుంది. శ్రీలంక జట్టులో అత్యధికంగా కుశాల్ పెరీరా 66 పరుగులు చేశాడు. చాహల్, సుందర్‌లకు రెండేసి వికెట్లు చొప్పున లభించాయి. అంతకుముందు టీమిండియా సారథి రోహిత్ శర్మ తొలి ఓవర్ నాల్గో బంతికే చమీరా బౌలింగ్‌లో అవుటయ్యాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన టీ20 స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్ సురేష్ రైనా (1) సైతం నిరాశపరచడంతో టీమిండియా 9 పరుగులకే రెండు ప్రధాన వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. మూడో వికెట్‌కు మనీష్‌పాండే, ధావన్‌లు 95 పరుగుల భాగసామ్యం నిర్మించి భారతజట్టు గౌరవప్రద స్కోర్ సాధించడంలో తోడ్పడ్డారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కుశాల్ పెరీరాకు లభించింది.

'గోల్డెన్' టాస్

శ్రీలంక స్వాతంత్ర్యం సాధించి 70 ఏళ్ళయిన సందర్భంగా తలపెట్టిన 'నిదహస్' ముక్కోణపు టి20 టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీలంక క్రికెట్ బోర్డు మ్యాచ్ ఆరంభానికి ముందే వేసే టాస్ కాయిన్‌ను ప్రత్యేక రూపొందించింది.

భారత్-బంగ్లాదేశ్-శ్రీలంక జట్లమధ్య ముక్కోణపు టీ20 సిరీస్ కోసం లంక ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 70 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో శ్రీలంక క్రికెట్ బోర్డు ఈ ముక్కోణపు సిరీస్‌ను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో మ్యాచ్ ప్రారంభానికి ముందు వేసే టాస్ కోసం లంక బోర్డు ప్రత్యేకంగా బంగారు నాణేన్ని తయారు చేయించిందని బోర్డు అధ్యక్షుడు తిలంగ సుమతిపాల తెలిపారు.



భారత్ - 174/5 (20 ఓవర్లలో)
(ధావన్ 90, మనీష్ పాండే 37; చమీరా 2/33)
శ్రీలంక - 175/5 (18.3 ఓవర్లలో)
(కుశాల్ పెరీరా 66; సుందర్ 2/28)

మను బాకర్ ఖాతాలో మరో స్వర్ణం

మిక్సిడ్ టీమ్ ఫైనల్లో విజయం



న్యూఢిల్లీ : మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు మూడోరోజూ రాణించారు. 10 మీటర్ల మిక్సిడ్ టీమ్ ఫైనల్ విభాగంలో భారత జోడీ స్వర్ణం సాధించింది. మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్‌కు చెందిన మను-ఓంప్రకాష్ మితర్వాల్ జోడీ 476.1 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఆమె ఖాతాలో మరో పసిడి చేరింది. జర్మనీ జోడీ (475.2), ఫ్రాన్స్ జోడీ (415.1) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలను సాధించారు. భారత్‌కే చెందిన మరో జోడీ మహిమ తుర్హి అగర్వాల్-రిజ్వి జోడీ 372.4 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. మరో విభాగమైన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్సిడ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన మెహులి ఘోష్-దీపక్ కుమార్ జోడీ కాంస్యం సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో యువ షూటర్ మను బాకర్ సంచలనాలు సృష్టిస్తోంది. సీనియర్ విభాగంలో తొలి ప్రపంచకప్ ఆడుతున్న 16 ఏళ్ల మను.. సోమవారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రెండుసార్లు ప్రపంచకప్ స్వర్ణ పతక విజేత అలెగ్జాండ్రా జవాలాను వెనక్కి నెట్టి పసిడి పతకాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే.

సుల్తాన్ అజ్లాన్ షా టోర్నీ

భారత్‌కు మరో ఓటమి



కౌలాలంపూర్ : 27వ సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టుకు మరో పరాజయం ఎదురైంది. మంగళవారం పటిష్ట ఆస్ట్రేలియాతో తలపడి 2-4 గోల్స్ తేడాతో ఓటమిపాలైంది. దీంతో భారతజట్టు బంగారు పతక రేసు నుండి నిష్క్రమించినట్లయింది. తొలి రెండు క్వార్టర్లు ముగిసే సరికి ఆస్ట్రేలియా జట్టు కేవలం 1-0 ఆధిక్యతలో మాత్రమే ఉంది. మూడో క్వార్టర్‌లో 35, 38, 40 నిమిషాల్లో ఆసీస్ ఆటగాళ్ళు మూడు గోల్స్ చేయడంతో భారత్‌పై 4-0 తిరుగులేని ఆధిక్యతలో నిలిచింది. భారత్‌కు చెందిన రమణ్‌దీప్ సింగ్ 52, 53 నిమిషాల్లో రెండు గోల్స్ చేయడంతో ఆసీస్ ఆధిక్యతను 4-2కు మాత్రమే తగ్గించగలిగాడు. తొలిమ్యాచ్ 2-3 గోల్స్ తేడాతో అర్జంటీనా చేతిలో ఓడి... తర్వాత ఇంగ్లండ్‌తో మ్యాచ్‌ను 1-1 గోల్స్ తేడాతో డ్రా మాత్రమే చేసుకోగలిగింది. ఇప్పటికే రెండు ఓటమిలు, ఒక డ్రాతో భారత హాకీ జట్టు ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఇతర మ్యాచ్‌లలో ఇంగ్లండ్ 4-1 గోల్స్ తేడాతో ఐర్లాండ్‌ను, మలేషియా జట్టు 2-1తేడాతో అర్జంటీనాను ఓడించాయి.

నేటి మ్యాచ్‌లు :
భారత్ X మలేషియా, ఆస్ట్రేలియ X ఐర్లాండ్, అర్జంటీనా X ఇంగ్లండ్

పోల్‌వాల్ట్‌లో శివ జాతీయ రికార్డు



పాటియాల: పోల్‌వాల్ట్‌లో సుబ్రమణి శివ కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. ఫెడరేషన్ కప్ జాతీయ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం జరిగిన పురుషుల పోల్‌వాల్ట్‌లో 5.15 మీటర్ల దూరం ఎగిరి (5.14 మీ)ను తన రికార్డును తానే సవరించుకున్నాడు. అయితే జాతీయ రికార్డు సృష్టించి స్వర్ణ పతకం సాధించినా కామన్వెల్త్ పోటీలకు మాత్రం అర్హత సాధించలేకపోయాడు. కామన్వెల్త్ క్రీడలకు వెళ్లాలంటే కనీసం 5.45 మీటర్లు ఎగరాల్సి ఉంటుంది.

పూనే క్యూరేటర్ సస్పెన్షన్



ముంబయి : పూనే పిచ్ క్యూరేటర్ పాండురంగ్ సల్గోంకర్ ఆరు నెలల సస్పెన్షన్‌కు గురయ్యాడు. మంగళవారం అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసిసి) మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ క్యురేటర్ పాండురంగ్ సల్గోంకర్‌పై ఈ నిషేధం విధించింది. గత ఏడాది అక్టోబర్ 25న ఇదే మైదానంలో భారత్-న్యూజిలాండ్‌ల మధ్య జరిగిన రెండో వన్డేకోసం సిద్ధం చేసిన మైదానానికి సంబంధించిన వివరాలను తెలియజేస్తున్న వీడియో ఫుటేజి ఐసీసీ దృష్టికి వెళ్లింది. ఇలా పిచ్ స్వభావ వివరాలను బహిరంగంగా వెల్లడించడం ఐసీసీ నిబంధన (2.4.4) ప్రకారం విరుద్ధం. పాండురంగ్‌పై ఇతరత్రా అవినీతి ఆరోపణలు ఏమీ లేకపోవడంతో ఇది తొలి తప్పుగా మన్నించి కేవలం 6 నెలలపాటు ఈ సస్పెన్షన్ విధించినట్లు ఐసీసీ తెలిపింది. ఈ నిషేధం అక్టోబర్ 2017 నుండి ఏప్రిల్ 24, 2018 వరకు ఉంటుంది. అనంతరం విధులకు హాజరవ్వవచ్చు.

మహిళా హాకీజట్టుకు రెండో విజయం



సియోల్ : దక్షిణ కొరియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. మంగళవారం ఆతిథ్య కొరియాపై 3-2 గోల్స్ తేడాతో విజయం సాధించింది. పూనమ్‌రాణి, రాణి, గుర్జీత్‌కౌర్‌లు 6, 27, 32వ నిమిషాల్లో గోల్స్ సాధించారు. కొరియా తరఫున లీ 10వ నిమిషంలో, జంగ్‌జియో సియో 31వ నిమిషాల్లో గోల్స్ చేశారు. తొలి క్వార్టర్‌లోనే ఇరుజట్లు ఒక్కొక్క గోల్‌ను నమోదు చేసుకొని 1-1తో సమంగా నిలిచాయి. సోమవారం జరిగిన తొలిపోరులోనూ మనజట్టు 1-0తో గెలిచిన విషయం తెలిసిందే. ఇరుజట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా మహిళాజట్టు 2-0 ఆధిక్యతలో నిలిచింది.

ప్రపంచకప్ అర్హత మ్యాచ్‌ల ఫలితాలు

వెస్టిండీస్-357/4 (గేల్-123, హెట్మీర్-127 : హైదర్ 1/62)
యు.ఎ.ఇ-297/6 (షెహజాద్-112, అన్వర్-64 : హోల్డర్ 5/53)
(వెస్టిండీస్ 64 పరుగుల తేడాతో విజయం)

పపువ్యూగేనియా-235 ఆలౌట్ (టోనీ యురా-151 : మెక్‌బ్రెయిన్ 3/38
ఐర్లాండ్ - 237/6 (పోర్టర్‌ఫీల్డ్-111, జొయాస్-53 : అస్సద్‌వాలా 2/39
(ఐర్లాండ్ 4 వికెట్ల తేడాతో విజయం)

జింబాబ్వే-196 ఆలౌట్ (బ్రెండర్ టేలర్-89, రాజా-60 : రషీద్ ఖాన్ 3/38
ఆఫ్ఘనిస్తాన్-194 ఆలౌట్ (రహ్మత్ షా-69, మహ్మద్ నబీ-51 : ముజీరబ్బాని-4/47 (జింబాబ్వే 2 పరుగుల తేడాతో విజయం)

హాంకాంగ్-91ఆలౌట్ (నిజకత్ ఖాన్-26 : టామ్ సోల్-4/15
స్కాట్లాండ్-92/6 (కొయెట్జర్-41 : ఎహసాన్ ఖాన్-3/29
(స్కాట్లాండ్ 4 వికెట్ల తేడాతో విజయం)

ఏజెన్సీ ప్రాంతాలకు

122 ఫీడర్ అంబులెన్స్‌లు

ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏజెన్సీ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలతో కూడిన 122 ఫీడర్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ఈ అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫీడర్ అంబులెన్స్‌ల పనితీరును సిఎంకు మంత్రి కామినేని శ్రీనివాస్ వివరించారు. అనంతరం కామినేని మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రయోగాత్మకంగా పిపిపి పద్ధతిలో ఈ సేవలు వినియోగించనున్నామన్నారు. ఒక్కో వాహనానికి ప్రభుత్వం రోజుకు రూ. 2,100 వెచ్చించనుందన్నారు. ప్రతి ఐటిడిఏ పరిధిలో రెండు లేదా మూడు 108 అంబులెన్స్‌లకు ఒక్కో ఫీడర్ అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. వీటి ద్వారా మన్య ప్రాంతంలో ఉన్న గర్భిణులతో పాటు ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన రోగులకు, ప్రమాదాలకు గురైన వారికి సత్వరం వైద్య సేవలు అందుతాయన్నారు. రోగి ఈ వాహనంలో పడుకునే విధంగా బెడ్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆక్సిజన్ సిలిండర్‌ను కూడా అమర్చినట్టు చెప్పారు. సుమారు 12 రకాల వైద్య పరికరాలు, అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఈ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు ఈ అంబులెన్స్‌లు సులభంగా చేరుకోగలవన్నారు. 108 టోల్ ఫ్రీ నంబర్ నుంచి ఫోన్ వచ్చిన గంట వ్యవధిలోనే సంఘటన స్థలానికి ఇవి చేరుకుంటాయని, 24 గంటల పాటు వీటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సీతంపేట ఐటిడిఏకి 15, పార్వతీపురానికి 24, పాడేరుకు 42, రంపచోడవరంకు 21, చింతూరుకు 6, కెఆర్ పురంకు 8, శ్రీశైలంకు 6 అంబులెన్స్‌లు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, వైద్య, ఆరోగ్య ప్రభుత్వ సలహాదారు జితేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ రుణాలపై వడ్డీ రద్దు చేస్తా

ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్


ప్రజల నుంచి వినతిపత్రాలు అందుకుంటున్న జగన్

ప్రజాశక్తి-ఇంకొల్లు (ప్రకాశం)

వైసిపి అధికారంలోకి వస్తే వ్యవసాయ రుణాలపై వడ్డీలు రద్దు చేస్తానని, 9 గంటలు పగలు కరెంటు ఇస్తానని ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఉదయం ప్రకాశం జిల్లా పంగులూరు మండలం అరికట్లవారిపాలెం నుంచి బయలుదేరిన యాత్ర పర్చూరు నియోజకవర్గంలోని గంగవరం వరకు సాగింది. సాయంత్రం తాటిపర్తివారిపాలెం మీదుగా ఇంకొల్లు చేరింది. ఇంకొల్లులోని స్తూపం సెంటర్‌లో నియోజకవర్గ సమన్వయకర్త రామనాథంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. కరెంటు బిల్లులు గతంలో కన్నా పదింతలు పెరిగాయని, తమ హెరిటేజ్ డెయిరీ కోసం నెల్లూరు, చిత్తూరు, ఒంగోలు సహకార కేంద్రాలను అప్పులపాలు చేసి పాడి రైతులకు ఇవ్వవలసిన డబ్బులు ఇవ్వకుండా ముఖ్యమంత్రి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. యాత్రలో భాగంగా రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు అభిషేక్ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద జగన్‌ను కలిశారు. తమ వైఖరిని త్వరలో వెల్లడిస్తానని చెప్పారు. ఎంఆర్‌పిఎస్ జెండాలతో వారిలో కొద్ది మంది కొంత దూరం జగన్ యాత్ర వెంట సాగారు.

రోడ్డు ప్రమాదంలో ప్రజాశక్తి విలేకరి వలి మృతి

ప్రజాశక్తి-యలమంచిలి (విశాఖపట్నం)



షేక్ కామోసి వలి

విశాఖపట్నం జిల్లా రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రజాశక్తి డాబాగార్డెన్స్ విలేకరి షేక్ కామోసి వలి(43) మృతి చెందారు. విశాఖపట్నం నుంచి రేగుపాలెం స్కూటీపై వెళ్తుండగా పంచదార్ల సమీపంలో అదుపు తప్పి బోల్తా పడడంతో వల్లీ తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రాంబిల్లి పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. కెజిహెచ్‌కు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. వలి పదేళ్లుగా ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్నారు. మృతునికి తల్లి బీజాన్ బీబీ, భార్య మదీనా బీబీ ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం గ్రేటర్ విశాఖ నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు, ప్రజాశక్తి సిబ్బంది, విజెఎఫ్, ఫెడరేషన్ నాయకులు కెజిహెచ్‌కు వెళ్లి వలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాష్ట్రంలో ఐదుగురు ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఐదుగురు ఐఎఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ డైరెక్టర్‌గా రంజిత్ బాషా బదిలీ అయ్యారు. పంచాయతీరాజ్ కార్యదర్శిగా రామాంజనేయులు, కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జెఎస్వి ప్రసాద్ బదిలీ అయ్యారు. ఎపి ఫైబర్ నెట్ సిఇవోగా దినేష్, రంపచోడవరం ఐటిడిఎ పిఓగా నిశాంత్ కుమార్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68